RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in

Cell: 9292104449 / 9848384973
SRAVANTHI Enterprises
OFFSET PRINTERS
We undertake Printing of Daily News Papers

హైదరాబాద్ 23 అక్టోబర్ 2026 శుక్రవారం | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:22 | సంచిక:124

## ముదిరాజ్‌లను గ్రూపు-ఏ లోకి మార్చడంపై మంత్రివర్గ ఉపసంఘం అధ్యయనం

### ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి

హైదరాబాద్ ముదిరాజ్ సామాజిక వర్గాన్ని బీసీ-ఏ గ్రూపులో చేర్చే అంశంపై మంత్రివర్గ ఉపసంఘం అధ్యయనం చేస్తుందని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రకటించారు. నిరుపేదల కోసం జీవితాలను త్యాగం చేసిన పోరాటయోధులు పండుగ సాయన్న, దొడ్డి కొమురయ్యల విగ్రహాలను ట్యాంక్ బండ్ పరిసరాల్లో ప్రతిష్ఠించడానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.



హైదరాబాద్ రవీంద్రభారతిలో ప్రభుత్వం అధికారికంగా నిర్వహించిన పండుగ సాయన్న ముదిరాజ్ 174వ జయంతి కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. పండుగ సాయన్న చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. సాయన్నపై రూపొందించిన పాటలను ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, ముదిరాజ్ కమ్యూనిటీని బీసీ–డీ నుంచి మరో గ్రూపులోకి మార్చే అంశంపై గతంలో సరైన లెక్కలు లేవన్న కారణంగా న్యాయస్థానాలు ఆ ప్రతిపాదనను తిరస్కరించాయని గుర్తుచేశారు.

మిగతా 2 లో

## కొడంగల్ ఆలయ నిర్మాణ పనులు పరిశీలించిన సీఎం రేవంత్



వికారాబాద్ జిల్లా కొడంగల్లోని ప్రసిద్ధి చెందిన శ్రీ మహాలక్ష్మి వెంకటేశ్వర స్వామి దేవస్థానం పునర్నిర్మాణ పనులను ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పరిశీలించారు. పేదల తిరుపతిగా ప్రసిద్ధి చెందిన ఈ ఆలయాన్ని అత్యంత వైభవంగా తీర్చిదిద్దే పనులు కొనసాగుతున్నాయి. ఆలయ పునర్నిర్మాణ పనులకు సంబంధించి అధికారులకు పలు సూచనలు చేశారు. అంతకుముందు ముఖ్యమంత్రి బాలాలయంలో శ్రీ వెంకటేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు.

## వరంగల్ కోట అభివృద్ధికి గ్రీన్ సిగ్నల్.. రూ. 382 కోట్లు మంజూరు

కాకతీయ వైభవానికి ప్రతీకగా నిలిచిన వరంగల్ కోట అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం పరిపాలన అనుమతులు మంజూరు చేసింది. ఖిల్లా వరంగల్‌తో పాటు హనుమకొండ నగరంలోని కీలక ప్రాంతాల్లో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనుల కోసం మొత్తం రూ. 382 కోట్ల కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిధులతో ఖిల్లా వరంగల్ పునరుద్ధరణ, సెంట్రల్ ప్లాజా నిర్మాణం, బస్ టెర్మినల్, వేయి స్తంభాల ఆలయం పరిసరాల అభివృద్ధి, మ్యూజికల్ గార్డెన్ వంటి కీలక ప్రాజెక్టులను చేపట్టనున్నారు. ఈ పనులన్నింటినీ కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ (కుడా) పర్యవేక్షణలో నిర్వహించనుండగా, ప్రాజెక్టుల అమలుకు ప్రపంచ బ్యాంకు నిధులను వినియోగించనున్నారు. వరంగల్ ప్రాంతంలోని చారిత్రక కట్టడాలు పరిరక్షణతో పాటు మౌలిక సదుపాయాలను మెరుగుపరిచే విస్తృత ప్రయత్నాల్లో భాగంగా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఈ ప్రాజెక్టులు పూర్తయితే పర్యాటక రంగంలో వరంగల్ నగరానికి మరింత గుర్తింపు లభించడంతో పాటు, నగర రూపురేఖలు పూర్తిగా మారిపోతాయని అధికారులు భావిస్తున్నారు.

## పత్తి కొనుగోళ్లకు సర్వం సిద్ధం.. అని కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని మంత్రి ఆదేశం

**పత్తి రైతుకు ధరల భరోసా కల్పించాలి.. అధికారులకు తుమ్మల దిశానిర్దేశం**
**పత్తి మార్కెట్లలో ధరల వ్యత్యాసంపై సమీక్ష..**
**స్పిన్నింగ్, ప్రాసెసింగ్ పరిశ్రమల విస్తరణకు చర్యలు చేపట్టాలి**

హైదరాబాద్, అక్టోబర్ 22: రాష్ట్రంలో 2026-27 ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్‌కు సంబంధించి పత్తి కొనుగోలు కేంద్రాలను గత ఏడాది మాదిరిగానే ప్రారంభించి, రైతులకు కనీస మద్దతు ధర లభించేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార మరియు చేనేత, జౌళి శాఖల మంత్రి శ్రీ తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. గురువారం సచివాలయంలో మార్కెటింగ్ శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో రాష్ట్రంలో పత్తి సాగు, ఉత్పత్తి అంచనాలు, మార్కెట్ ధరలు, సీసీఐ కొనుగోళ్లకు చేసిన ఏర్పాట్లు, రైతులకు అందిస్తున్న సౌకర్యాలపై సమీక్షించారు.




పత్తి రైతులకు గిట్టుబాటు ధర కల్పించడం, కొనుగోళ్లలో జాప్యం లేకుండా చూడటం, మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా అవసరమైన చర్యలు తీసుకోవడం ప్రభుత్వ ప్రాధాన్యత అని మంత్రి స్పష్టం చేశారు. ప్రస్తుత 2026-27 ఖరీఫ్ సీజన్‌లో తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా 48.20 లక్షల ఎకరాల్లో పత్తి సాగు జరగగా, 29.43 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి వస్తుందని అంచనా వేస్తున్నట్లు అధికారులు మంత్రికి వివరించారు. గత సీజన్‌లో 50.73 లక్షల ఎకరాల్లో సాగు జరగగా, 28.33 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి నమోదైంది.

మిగతా 3 లో

# ఎల్‌నినో వచ్చినా..

## విద్యుత్ కొరత రాకుండా పటిష్ట చర్యలు

**రోజువారీ విద్యుత్ ఉత్పత్తిని 140 మిలియన్ యూనిట్లకు పెంచాలి**
**యాదాద్రి ప్లాంట్‌లో రెండు యూనిట్లకు**
**కోల్ ఇండియా నుంచి ప్రత్యామ్నాయ బొగ్గు సరఫరా**
**మూతపడిన పరిశ్రమల విద్యుత్ బకాయిల**
**చెల్లింపులకు వన్‌టైమ్ సెటిల్‌మెంట్ అవకాశం**
**విద్యుత్ బకాయిల పరిష్కారానికి వెసులుబాటు**
**కల్పించేలా డిప్యూటీ సీఎం కీలక ఆదేశాలు**
**థర్మల్ విద్యుత్ ఉత్పత్తి, సరఫరాపై సమీక్షలో**
**ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదేశాలు**

ఎల్‌నినో ప్రభావంతో జలవిద్యుత్ ఉత్పత్తి తగ్గే అవకాశం, రానున్న రోజుల్లో విద్యుత్ డిమాండ్ పెరిగే పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రాష్ట్రంలో విద్యుత్ కొరత తలెత్తకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. రానున్న రబీ, వేసవి సీజన్లలో వ్యవసాయ, గృహ విద్యుత్ అవసరాలను సమర్థంగా తీర్చేందుకు థర్మల్ విద్యుత్ ఉత్పత్తిని రోజుకు 140 మిలియన్ యూనిట్లకు పెంచేలా సమగ్ర కార్యాచరణ ప్రణాళికతో ముందుకు సాగాలని స్పష్టం చేశారు.



మిగతా 2 లో

# ఇది కాలం తెచ్చిన కరువు కాదు..

**ఇది కాలం తెచ్చిన కరువు కాదు.. ముమ్మాటికీ కాంగ్రెస్ తెచ్చిన కరువే. సస్పెండ్ చేయాల్సింది అధికారులను కాదు..**
**ముఖ్యమంత్రిని, విద్యుత్ శాఖ మంత్రిని:**
**మాజీ మంత్రి హరీశ్ రావు ధ్వజం**

రోమ్ నగరం తగలబడుతుంటే నీరో చక్రవర్తి ఫిడేలు వాయించినట్లు.. రాష్ట్రంలో 12 లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోయి రైతులు కన్నీరు పెడుతుంటే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మొద్దునిద్ర పోతున్నారు.

కరోనా విపత్తులో కేసీఆర్ గారు ప్రజలకు రక్షణ కవచంలా నిలబడి కోటి టన్నుల పంట పండిస్తే.. ఎల్‌నినో పేరిట రేవంత్ రెడ్డి క్రాప్ హాలిడే ప్రకటించి రైతులను శిక్షిస్తున్నారు.

10 నెలల ముందే శాస్త్రవేత్తలు హెచ్చరించినా బొగ్గు నిల్వలు, విద్యుత్ కొనుగోళ్లు చేయకుండా చేతులు కాలాక అధికారులపై చిందులు వేస్తున్నారు.. సస్పెండ్ చేయాల్సింది అధికారులను కాదు, అసమర్థ సీఎంను, విద్యుత్ మంత్రిని.

కేసీఆర్ కు పేరు వస్తుందనే రాజకీయ అక్కసుతో కన్నెపల్లి మోటార్లు ఆన్ చేయకుండా, దేవాదుల, కల్వకుర్తి మోటార్లను 24 గంటలు నడపకుండా సాగునీటి కరువు సృష్టించారు.

కరువు కాలంలో ప్రజలపై రూ. 5,420 కోట్ల కరెంటు బిల్లుల భారం, ఆర్టీసీ చార్జీల పెంపు దుర్మార్గం.. తక్షణమే కరువు మండలాలు ప్రకటించి ఎండిన పంటలకు నష్టపరిహారం, రైతు కూలీలకు రూ. 12 వేలు ఇవ్వాలి.



సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం బూరుగుపల్లి గ్రామంలో సాగునీరు, కరెంటు అందక ఎండిపోయిన వరి పంట పొలాలను మాజీ మంత్రి, బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు ఈరోజు సందర్శించి పరిశీలించారు. చేతికొచ్చే దశలో ఎండిపోయిన పొలాలను చూపుతూ కన్నీరుమున్నీరైన బాధిత రైతులను ఆయన ఓదార్చి ధైర్యం చెప్పారు. అనంతరం రైతులతో కలిసి మీడియాతో మాట్లాడారు.

ఈ సందర్భంగా మాజీ మంత్రి హరీశ్ రావు మాట్లాడుతూ...

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ ఘోర వైఫల్యం వల్ల వానాకాలంలోనే దాదాపు 12 లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోయి రైతులంతా తీవ్ర ఆందోళనలో ఉంటే, ఈ ప్రభుత్వం మాత్రం మొద్దునిద్ర పోతోంది.

రోమ్ నగరం తగలబడుతుంటే ఫిడేలు వాయించినట్లుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యవహరిస్తున్నారు.

ఇది కాలం తెచ్చిన కరువు కాదు, ముమ్మాటికీ కాంగ్రెస్ తెచ్చిన కరువే. ఎల్‌నినో ప్రభావంతో కరువు పరిస్థితులు ఏర్పడతాయని 10 నెలల క్రితమే శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు హెచ్చరించినా ముందస్తు చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది.

కరువు పరిస్థితులతో ఆదిలాబాద్, నల్లగొండ, మెదక్, కరీంనగర్, మహబూబ్‌నగర్, ఖమ్మం తదితర జిల్లాల్లో పత్తి రైతులు పెట్టిన పెట్టుబడి కూడా రాక కుదేలయ్యారు.

మిగతా 3 లో

ప్రజాబలం

23 అక్టోబర్ 2026 శుక్రవారం

## మళ్లీ తెరపైకి డీలిమిటేషన్

దేశ రాజకీయాలు రసకందాయంలో పడ్డాయి. ఇరాన్ యుద్ధం వలన దేశం లో నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి, ప్రజలు ఇబ్బందులు పడుతున్న నేపథ్యం లో కేంద్రంలోని పాలక, ప్రతిపక్షాలు విమర్శలు, ప్రతి విమర్శలతో రాజకీయాలకు పదును పెడుతున్నాయి. దురదృష్టవశాత్తూ జెన్ జీలకు కూడా ప్రజలు ఎదుర్కొంటున్న కష్టాలు పట్టడం లేదు. సిఇసి జ్ఞానేశ్ కుమార్ రాజీనామా కోసం ఒకవైపు సిజెపి, మరోవైపు ఇండీ కూటమి ఎన్‌డిఎ ప్రభుత్వంపై తీవ్ర ఒత్తిడిని కొనసాగిస్తూ, నిరసనలతో దేశ రాజధానిలోను, ఇతర రాష్ట్రాల్లోను తమ ఆందోళనలను ఉధృతం చేస్తుండగా, మరొక వైపు కేంద్ర ప్రభుత్వం ప్రత్యర్థులను కట్టడి చేయడానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్నది. ఇంతకు ముందే జంతర్ మంతర్ వద్ద నీట్ పేపర్ లీకేజీ వ్యవహారానికి సంబంధించి, కాక్రోచ్‌లు నిర్వహించిన ఉద్యమానికి స్పందించి కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ చేత రాజీనామా చేయించి, సోనమ్ వాంగ్‌చుక్ చేత నిరాహార దీక్ష విరమింప చేసిన కేంద్ర ప్రభుత్వ పెద్దలపై మరోసారి ఒత్తిడి పెంచి, ఇప్పుడు సిఇసి జ్ఞానేశ్ కుమార్ చేత రాజీనామా చేయించాలని వైరి పక్షాలు పట్టుబడుతున్నాయి. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా విషయంలో బొద్దింకల ఉద్యమాన్ని పరిగణనలోకి తీసుకున్న కేంద్ర ప్రభుత్వ పెద్దలు ప్రస్తుతం సిఇసి విషయంలో తలెత్తిన నిరసన జ్వాలలను పట్టించుకోవడం లేదు. జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా ఉద్యమిస్తున్న సిజెపి, ప్రతిపక్షాల ఆందోళనలను అణచివేయడానికే ఎన్‌డిఎ ప్రభుత్వం మొగ్గు చూపడం గమనార్హం. ప్రత్యర్థుల ఆందోళనలకు లొంగిపోతే కేంద్ర ప్రభుత్వ ప్రతిష్ట దెబ్బతినడమే కాకుండా తాము వారు చేసిన ఆరోపణలను అంగీకరించినట్టే అవుతుందని భావించి ఉండవచ్చు. అందుకే ఈ నిరసనలను పట్టించుకోకుండా, పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి డీలిమిటేషన్ బిల్లుతోపాటు, మహిళలకు చట్టసభల్లో మూడో వంతు రిజర్వేషన్లు కల్పిస్తూ తీసుకున్న నిర్ణయానికి ఆమోద ముద్ర వేయించుకోవాలని ప్రయత్నిస్తున్నది. ఈ బిల్లులు ప్రస్తుతం జరుగుతున్న సిజెపి, విపక్షాల నిరసనల నుండి దారి మళ్ళించడానికా? లేక ప్రతిపక్షాలు మహిళల రిజర్వేషన్లకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నాయని ప్రజల్లో దురభిప్రాయం కలిగించడానికా? అనే అంశాలను పక్కనబెడితే డీలిమిటేషన్ బిల్లును, మహిళల రిజర్వేషన్ల బిల్లుతో ముడిపెట్టి, తాము అనుకున్న లక్ష్యం సాధించడానికే సన్నద్ధమవుతున్న సూచనలు కనిపిస్తున్నాయి. గతంలో డీలిమిటేషన్ బిల్లుపై వ్యతిరేక గళం వినిపించిన స్టాలిన్ నేతృత్వంలోని డిఎంకె ప్రస్తుతం ఎన్‌డిఎకు దగ్గరవుతున్న సూచనలు అగుపిస్తున్నాయి. తృణమూల్ కాంగ్రెస్ నుండి చీలిన పలువురు ఎంపిలు, ఇతర పార్టీలకు చెందిన సభ్యులు ఈ బిల్లులను గట్టెక్కించడంలో సహకరిస్తారనే సంకేతాలు వెలువడుతున్నాయి. 2011 జనాభా లెక్కల ఆధారంగా నియోజకవర్గాల పునర్విభజన జరిగితే దక్షిణాది రాష్ట్రాలు నష్టపోతాయని, పార్లమెంటు లోను, కేంద్రంలోను దక్షిణాది రాష్ట్రాల ప్రాభవం తగ్గి, ఉత్తరాది రాష్ట్రాలు ఆధిపత్యం చెలాయిస్తాయనే వాదన సత్యదూరం కాదు. అయితే లోక్‌సభతోపాటు అన్ని రాష్ట్రాల చట్టసభల సీట్లను 50 శాతం పెంచి పునర్విభజన చేపట్టడం కొంతలోకొంత ఉపశమనం కలిగించే చర్య అయినప్పటికీ, ఇది పూర్తి స్థాయిలో సంతృప్తి కలిగించే చర్య మాత్రం కాబోదు. ప్రతిపక్షాలు సూచించిన విధంగా డీలిమిటేషన్ బిల్లు పక్కన బెట్టి, ఇప్పుడున్న 543 స్థానాల్లోనే మహిళలకు ప్రాతినిధ్యం కల్పించడానికి కేంద్రం అంగీకరించదు. జనాభా ప్రాతిపదికన డీలిమిటేషన్ జరిగితే ఉత్తరాది రాష్ట్రాలు సీట్ల విషయంలో అధికంగా లబ్ధి పొందుతాయి. దక్షిణాది రాష్ట్రాలు తీవ్రంగా నష్టపోతాయి. ఉత్తరాది ప్రాబల్యం పెరిగితే దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గి, తీవ్ర వివక్షకు గురయ్యే అవకాశాలున్నాయి. నిజానిజాల సంగతి ఎలా ఉన్నా, ఇప్పటికే కేంద్రం దక్షిణాది రాష్ట్రాలనుండి అధిక మొత్తంలో పన్నులు గుంజి, దక్షిణాదికి లాంఛనంగా నాలుగు మెతుకులు విదుల్చుతూ, ఉత్తరాదికి మేలు చేస్తున్నదనే వాదన విస్తృతంగా వ్యాప్తిలో ఉంది. డీలిమిటేషన్ బిల్లుతో దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గించే ప్రయత్నాలు జరుగుతున్నాయనే విమర్శలు జోరందుకోవడంతో అప్రమత్తమైన కేంద్రం అన్ని రాష్ట్రాల అసెంబ్లీ, లోక్‌సభ సీట్లను 50 శాతం పెంచుతామని ప్రకటించింది. అయితే కేంద్రం ప్రవేశపెట్టిన డీలిమిటేషన్ బిల్లులో ఈ విషయమై స్పష్టత కొరవడిందని ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ గతంలోనే నిలదీసింది. అయితే గతంలో ప్రవేశపెట్టిన బిల్లులోని అంశాలను మారుస్తారా? లేక యథాతథంగా బిల్లును ప్రవేశపెడతారా? కాంగ్రెస్ కోరినట్టు ప్రతిపక్షాలతో సంప్రదిస్తారా? అనే విషయాలపై సందిగ్ధత తొలగితే కాని, ఈ అంశంపై పూర్తి స్థాయిలో స్పష్టత రాదు. చట్టాలుతెలుసుకోండి మరిన్ని కనుగొనండి చట్టాలు తెలుసుకోండి పథకాలు చూడండి రాజకీయాలు చూడండి ప్రస్తుతం దేశంలో పెద్ద రాష్ట్రమైన ఉత్తర ప్రదేశ్‌కు తెలుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌కు లోక్‌సభ లో 55 సీట్ల వ్యత్యాసముంది. మరో తెలుగు రాష్ట్రమైన తెలంగాణ విషయంలో 63 సీట్ల వ్యత్యాస ముంది. తమిళనాడుతో పోల్చిచూస్తే ప్రస్తుత యుపి లోక్ సభ సీట్లు 41 సీట్లు అధికం. జనాభా ప్రాతిపదికన కాకుండా అన్ని రాష్ట్రాలకు 50 శాతం సీట్లు పెంచితే ఆంధ్ర, యుపిల మధ్య 82 సీట్లు, తెలంగాణాతో పోల్చి చూస్తే 94 సీట్లు, తమిళనాడు, యు.పి ల మధ్య 61 సీట్ల వ్యత్యాసముంటుంది. ఏ విధంగా చూసినా పెద్ద రాష్ట్రాల్లో సీట్ల సంఖ్య భారీగా పెరిగే అవకాశాలున్నాయి. ప్రస్తుతమున్న లోక్‌సభ సీట్ల సంఖ్య 543 నుండి 816కు పెంచడం వలన పెరిగే లోక్‌సభ సభ్యుల సంఖ్య వలన ప్రభుత్వ ఖజానాపై మరింత భారం పడే అవకాశముంది. ఇక రాష్ట్రాల్లో పెరిగే శాసన సభ్యుల సంఖ్య వలన కూడా విపరీతమైన ఆర్థిక భారం పడుతుంది. ఈ భారాన్ని ప్రజల మీద మోపడం భావ్యమా? ఇప్పటికే సామాన్య ప్రజలపై వివిధ మార్గాల్లో ప్రభుత్వాలు ఆర్థిక భారం మోపుతున్నాయి. పెద్ద పెద్ద నియోజకవర్గాలను విభజించి, అధికార వికేంద్రీకరణ చేయడం సముచితమే. అయితే ప్రభుత్వ నిర్ణయాలు కొండ నాలుకకు మందు వేస్తే ఉన్న నా లుక ఊడిన చందంగా పరిణమించరాదు. డీలిమిటేషన్ హేతుబద్ధంగా జరగాలి. ఉత్తర, దక్షిణ భారతాల మధ్య విభేదాలు తలెత్తకూడదు. డీలిమిటేషన్‌పై లోతైన మేధోమథనం జరగాలి. తీవ్రమైన కసరత్తు జరగాలి. అందరికీ ఆమోదయోగ్యం పద్ధతిలో డీలిమిటేషన్ ప్రక్రియను చేపట్టాలి.

# ముదిరాజ్‌లను గ్రూపు-ఏ లోకి మార్చడంపై మంత్రివర్గ ఉపసంఘం అధ్యయనం

మొదటి పేజీ తరువాయి

రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన కులగణన ప్రాతిపదికగా భవిష్యత్తులో న్యాయపరమైన చిక్కులు ఎదురుకాకుండా ముదిరాజ్‌లను గ్రూపు-ఏ లోకి మార్చడంపై మంత్రివర్గ ఉపసంఘం సమగ్రంగా అధ్యయనం చేస్తుందని తెలిపారు. ఈ ఉపసంఘం న్యాయనిపుణులు, అధికారులతో సంప్రదింపులు జరిపిన మీదట, మంత్రివర్గంలో చర్చించి ముదిరాజ్‌లకు న్యాయం జరిగేలా సరైన నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.? ప్రభుత్వం నిర్వహించిన కులగణనతో ఇప్పుడు బీసీల లెక్కలు (ాఇఇఖఅ) పక్కాగా ఉన్నాయని, పక్కా ప్రణాళికతో సముచిత నిర్ణయం తీసుకుంటామన్నారు. ముదిరాజ్‌లను బీసీ-ఏ గ్రూపులో చేర్చడం ద్వారా గంగపుత్రులకు అన్యాయం జరుగుతుందన్న అనుమానాలు, అపోహలు ఉన్నాయని, అన్ని వివరాలపై ఆ వర్గాలతో చర్చించి వారిలోని అపోహలను దూరం చేయాలని ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ కి సూచించారు.

స్వతంత్ర భారతదేశంలో ఎవరూ చేయని పని, జనగణనలో కులగణన చేసి చూపించాం. 2024 ఫిబ్రవరి 4న కమిషన్ ఏర్పాటు చేసి సరిగ్గా ఏడాదికి 2025 ఫిబ్రవరి 4 నాటికి కులగణన లెక్కలు చేసి దేశానికి ఆదర్శంగా నిలబడ్డాం

ఆ కులగణన లెక్కలే బలహీనవర్గాలకు ధైర్యాన్నిచ్చాయి. అడిగే హక్కును కల్పించింది. ప్రతి ఇంటి తలుపుతట్టి సమాచారాన్ని నిక్షిప్తం చేశారు. లెక్కల్లో తేడాలు ఉన్నాయని భావిస్తే, ఏదైనా కారణంతో ఎవరి వివరాలైనా నమోదు కాకపోతే, వారి వివరాలను నమోదు చేయించండి

ఒకటి అరా ఎక్కడైనా తప్పిపోతే లెక్కలను సవరించుకోవడం మన బాధ్యత. ప్రభుత్వం ఓపెన్ మైండ్ తో ఉంది. పక్కాగా లెక్కగట్టి సామాజిక న్యాయం చేయాలన్నదే ప్రభుత్వ ఆశయం. విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో పక్కా న్యాయం జరగాలన్నదే లక్ష్యం. అని ముఖ్యమంత్రి వివరించారు.

ఎస్సీ ఉపకులాల వర్గీకరణ కోసం చాలామంది బిడ్డలు ప్రాణాలు కోల్పోయారని, 40 ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న ఈ సమస్యను ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పరిష్కరించిందని గుర్తుచేశారు. దేశంలోనే ఎస్సీ కులాల వర్గీకరణ చేపట్టి దేశానికి ఆదర్శంగా నిలబడ్డామని చెప్పారు.

ఇలా జటిలమైన సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరించుకుంటూ ముందుకు వెళ తున్నామని అన్నారు. ఆలస్యమైనా అన్యాయం జరగకుండా చూసే బాధ్యత నాది. ఈ జాతి సమస్యలపై సంపూర్ణ అవగాహన నాకుంది.

నిరుపేదలు, బహుజనులకు అండగా వారి భూములను రక్షించాలని, జమీందార్లు, జాగీర్దార్లు, భూస్వాములకు వ్యతిరేకంగా పౌరుషంతో నేలకొరిగినా ఫరవాలేదని సర్వం ఒడ్డి పండుగ సాయన్న పోరాటం చేశారని కొనియాడారు. నిరుపేదలు పండుగ సాయన్న పేరును జానపదాల రూపంలో పల్లెల్లో ఇప్పటికీ స్మరిస్తారని చెప్పారు.

ఆ గొప్ప పోరాటయోధుడు పాలమూరు బిడ్డ అయినందుకు నాకెంతో గర్వకారణంగా ఉందన్నారు. జాతి మొత్తం తలెత్తుకునే విధంగా చరిత్ర పుటల్లో పండుగ సాయన్నకు ఒక పేజీ ఉండాలి. సమాజానికి ఉపయోగపడేది ఏదైనా తక్షణ నిర్ణయం తీసుకుంటానని చెప్పారు

రాష్ట్రంలో సంక్షేమ పథకాల అమలు గురించి ముఖ్యమంత్రి గారు ప్రస్తావిస్తూ.. గత పాలకులు అమలు చేసిన సంక్షేమ పథకాలు వేటినీ రద్దు చేయకపోగా వాటిని మరింత మెరుగ్గా రెండింతలు చేసి అమలు చేస్తున్నామని వివరించారు

గతంలో 2 రూపాయలకే కిలో బియ్యం పథకం ఉంటే ఇప్పుడు రాష్ట్రంలో 3.48 కోట్ల మందికి ఒక్కొక్కరికి 6 కిలోల చొప్పున సన్నబియ్యం అందిస్తున్నాం. వ్యవసాయానికి ఉచిత కరెంటిస్తే, ఇప్పుడు 200 యూనిట్ల లోపు వినియోగదారులు 55 లక్షల కుటుంబాలకు ఉచితంగా గృహవిద్యుత్ ఇస్తున్నాం.

రూ. 2 లక్షలున్న రాజీవ్ ఆరోగ్యశ్రీని పరిమితిని రూ. 10 లక్షలకు పెంచాం. రైతు భరోసా రూ. 10 వేలు ఉంటే రూ. 12 వేలకు పెంచి ఇస్తున్నాం. గతంలో ఎప్పుడూ లేని విధంగా ఆడబిడ్డలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాం. అందుకోసం ప్రభుత్వం ఇప్పటికే రూ. 14 వేల కోట్లకు పైగా వెచ్చించింది.

25 లక్షలకు పైగా రైతులకు రూ. 2 లక్షల మేరకు రుణమాఫీ చేశాం. నిరుపేదలకు 8 లక్షల ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేశాం. షాదీముబారక్, కళ్యాణ లక్ష్మి ఏ పథకం ఆపలేదు. మంచి పని ఎవరు చేసినా వాటిని మరింత మెరుగ్గా చేసి అమలు చేశామే తప్ప ఏ ఒక్కటీ ఆపలేదు అని స్పష్టం చేశారు.

సర్వాయి పాపన్న గౌడ్, దొడ్డి కొమురయ్య, కొండా లక్ష్మణ్ బాపూజీ, జ్యోతీరావు పూలే, చాకలి ఐలమ్మ ఎంతో మంది బహుజనుల కోసం పోరాడిన యోధులని గుర్తుచేశారు. కొందరు పోరాటయోధుల చరిత్రను కనుమరుగు చేశారు. జాతి కోసం జీవితాంతం తపించి, సర్వం త్యాగం చేసిన వారికి చరిత్రలో స్థానం లేకపోతే, ఈ నేల ఉన్నా లేకపోయినా ఒకటే అని వ్యాఖ్యానించారు.

సర్వాయి పాపన్న గౌడ్, జ్యోతీరావు పూలే దంపతుల విగ్రహాలు ఏర్పాటు చేసినట్టుగానే ట్యాంక్ బండ్ చుట్టూ ఉన్న ప్రాంతంలో దొడ్డి కొమురయ్య, పండుగ సాయన్న విగ్రహాలను ఏర్పాటు చేస్తాం అని ముఖ్యమంత్రి ప్రకటించారు.

ఈ కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్ , వాకిటి శ్రీహరి , శాసనమండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండ ప్రకాష్, ఎంపీలు అనిల్ కుమార్ యాదవ్ , ఈటల రాజేందర్, సలహాదారు వీ హనుమంతరావు , ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ఎల్‌నినో వచ్చినా.. విద్యుత్ కొరత రాకుండా పటిష్ట చర్యలు

మొదటి పేజీ తరువాయి

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో గురువారం విద్యుత్ ఉత్పత్తి, సరఫరా, బకాయిల అంశాలపై విద్యుత్ శాఖ ఉన్నతాధికారులతో భట్టి విక్రమార్క సమీక్ష నిర్వహించారు. ప్రస్తుతం రోజువారీ థర్మల్ విద్యుత్ ఉత్పత్తి సగటున 91 మిలియన్ యూనిట్లకు చేరిందని, ఇటీవల ఒక్కరోజులో 118 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి నమోదైందని అధికారులు వివరించారు. ఈ స్థాయి నుంచి ఉత్పత్తిని మరింత పెంచి రోజుకు 140 మిలియన్ యూనిట్ల లక్ష్యాన్ని చేరుకోవాలని ఉప ముఖ్యమంత్రి సూచించారు. యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రంలోని రెండు యూనిట్లకు బొగ్గు సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా కోల్ ఇండియా లిమిటెడ్ నుంచి ప్రత్యామ్నాయ బొగ్గు సరఫరా అనుసంధానాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ మార్గం ద్వారా బొగ్గు సరఫరా నవంబర్ నుంచి ప్రారంభం అవుతుందని వెల్లడించారు.

విద్యుత్ ఉత్పత్తి పెంపులో భాగంగా యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. “ఈ కేంద్రంలోని 800 మెగావాట్ల సామర్థ్యం కలిగిన నాలుగు యూనిట్లు ఇప్పటికే విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నాయి. ఐదో యూనిట్‌ను ఈ నెల 20న గ్రిడ్‌కు అనుసంధానించామని, మిగిలిన సాంకేతిక, నిర్వహణపరమైన సమస్యలను యుద్ధప్రాతిపదికన పరిష్కరించి, ఐదో యూనిట్‌ను పూర్తిస్థాయి వాణిజ్య కార్యకలాపాల్లోకి తీసుకువస్తున్నామని అధికారులు ఉప ముఖ్యమంత్రికి వివరించారు.

“టీజీజెన్‌కో థర్మల్ విద్యుత్ కేంద్రాల రోజు వారీ సగటు ఉత్పత్తి 2024-25 సంవత్సరంలో 65.90 మిలియన్ యూనిట్లు, 2025-26 ఆర్థిక సంవత్సరంలో సుమారు 76.46 మిలియన్ యూనిట్లు ఉండగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో అక్టోబర్ 21 నాటికి 90.97 మిలియన్ యూనిట్లకు చేరింది. గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే రోజుకు 14.51 మిలియన్ యూనిట్ల మేర, సుమారు 19 శాతం పెరుగుదల నమోదైంది. అక్టోబర్ 16న ఒక్కరోజులో 118 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి” జరిగిందని అధికారులు తెలిపారు. థర్మల్ విద్యుత్ కేంద్రాల్లోని అన్ని యూనిట్లు గరిష్ఠ సామర్థ్యంతో పనిచేసేలా చూడాలని, ప్లాంట్ లోడ్ ఫ్యాక్టర్‌ను పెంచాలని, ఉత్పత్తిని రోజువారీ సమీక్షిస్తూ లక్ష్య సాధన దిశగా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని భట్టి విక్రమార్క ఆదేశించారు.

మూతపడిన పరిశ్రమల విద్యుత్ బకాయిల చెల్లింపులకు వన్‌టైమ్ సెటిల్‌మెంట్ అవకాశం తెలంగాణ రాష్ట్రంలో మూతపడిన పరిశ్రమలకు పెండింగ్‌లో ఉన్న విద్యుత్ బకాయిల చెల్లింపుల విషయంలో వన్‌టైమ్ సెటిల్‌మెంట్ విధానం ద్వారా బకాయిల చెల్లింపును సులభతరం చేసి, వినియోగదారులకు ప్రయోజనం కలిగించేలా సమగ్ర ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. మూతపడిన పరిశ్రమల యాజమాన్యాలతో సమన్వయం చేసుకొని, విద్యుత్ బకాయిల పరిష్కారానికి అందుబాటులో ఉన్న అవకాశాలు, నిబంధనలపై అవగాహన కల్పించాలని TGSPDCL, TGN-PDCL సీఎండీలను డిప్యూటి సిఎం ఆదేశించారు. ఈ విధానం ద్వారా అర్హత కలిగిన పరిశ్రమలకు బకాయిల చెల్లింపుల్లో కొంతమేర వెసులుబాటు లభించడంతో పాటు, విద్యుత్ పంపిణీ సంస్థలకు దీర్ఘకాలిక బకాయిల వసూళ్లకు అవకాశం కలుగుతుందన్నారు. అలాగే సింగరేణి, జెన్‌కో, ట్రాన్స్‌కో తదితర సంస్థలకు వివిధ విభాగాల నుంచి రావాల్సిన బకాయిల వసూలుకు చర్యలు చేపట్టాలని ఆర్థిక శాఖ ఉన్నతాధికారులకు సూచించారు. రానున్న రోజుల్లో విద్యుత్ డిమాండ్ ఎంత పెరిగినా దానికి అనుగుణంగా ఉత్పత్తి, ప్రసారం, సరఫరా వ్యవస్థలను సిద్ధం చేయాలని ఉప ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రజలకు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ అందించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. ఈ సమావేశం లో ఎనర్జీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ నవీన్ మిట్టల్, ఫైనాన్స్ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా, సింగరేణి సీఎండీ బుద్ధ ప్రకాష్ జ్యోతి, జెన్‌కో సీఎండీ హరీశ్, ట్రాన్స్‌కో సీఎండీ కృష్ణ భాస్కర్, ఎస్పీడీసీఎల్ సీఎండీ జితేష్ వి. పాటిల్, ఆర్పిడిసిఎల్ సీఎండీ ముషారఫ్, సింగరేణి డైరెక్టర్ గౌతం పోట్రు తదితరులు పాల్గొన్నారు.

# మేడిగడ్డ బ్యారేజీని పేల్చేసిన కేసును ఎలా క్లోజ్ చేస్తారు?

కాళేశ్వరం ప్రాజెక్టులో లక్ష్?మ బ్యారేజ్ 21 అక్టోబర్ 2023 లో రవికాంత్ ఫిర్యాదు చేసి 3 ఏళ్లు దాటింది. ఇప్పటికీ ఎలాంటి చర్యలు లేవు. గాఢ నిద్రలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం.ఎల్ నినో వర్షాభావ పరిస్థితుల్లో రైతులు తీవ్ర బాధలు పడుతున్నారు.పత్తి రైతులు తీవ్ర నిరాశలో ఉన్నారు.సి ఎం పట్టించుకోకుండా ఎల్ నినో ప్రభావం వల్ల నీరు ఇవ్వలేం అంటున్నారు.యాసంగి అసలు పంటలు వేయకండి అంటూ బాధ్యతారాహిత్యంగా మాట్లాడుతున్నారు.తాగడానికి కూడా నీరు లేవని బెదిరిస్తున్నారు. కానీ వాస్తవాలు. కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బ్యారేజీ బాగుంటే ఈ కరువు వచ్చేది కాదు. కంట్రోల్డ్ ఎక్స్ ప్లోజన్ తో డిటోనేటర్లు పెట్టి పేల్చి ఉంటారని అనుమానమని అన్నారు.మేడిగడ్డ లక్ష్మి బారేజ్ లో 8 బ్లాక్ లు ఉండగా... 7 వ బ్లాక్ పిల్లర్ 20 కుంగిపోయిందిఅక్టోబర్ 21,2023 లో సాయంత్రం రవికాంత్ ఇంజనీర్ ఫిర్యాదు తో 174/2023 ఐపిసి 357 ప్రకారం కేసు నమోదు అయింది. కేసు నమోదైన వెంటనే నేర స్థలాన్ని సీజ్ చేసి క్రాక్స్ వచ్చిన పిల్లర్ దగ్గర సాంపుల్స్ సేకరించి, వీడియో రికార్డ్ చేసి, సెల్ ఫోన్ టవర్స్ లొకేషన్స్ తీసుకొని కాల్ డేటా తీసుకొని విశ్లేషించాల్సిన పరిస్థితి ఉండాలి.జియాలజీ డిపార్ట్ మెంట్ ద్వారా సీస్మిక్ డాటా సేకరించాల్సింది. భూకంపం ఏమైనా వచ్చిందా,రిక్టర్ స్కేల్ మీద రీడింగ్ ఎంత నమోదైంది అనేది తెలుసుకొని ఉండాలి. ఎందుకంటే డిటొనేటర్లు తో పేలుళ్లు జరిగినపుడు భూకంపం వచ్చినట్టుగా శబ్దం వస్తుంది.2025 లోనే ఈ కేసును అన్ డిటెక్టివ్ గా మూసేశారు. ఎవిడెన్స్ లేదని, తప్పుడు సమాచారం అని, అన్ డిటెక్టివ్ అని పోలీసిబి కేసు క్లోజ్ చేయవచ్చు. అన్ డిటెక్టివ్ అంటే పోలీసులకు కూడా ఈ కేసులో అనుమానం ఉంది. కాంట్రాక్టర్లు, సిడబ్ల్యుసి రిపోర్ట్ తీసుకున్నారా లేదా?అప్పటికీ కాళేశ్వరం వ్యతిరేకంగా మాట్లాడే కాంగ్రెస్ బిజెపి నేతలు, వారి పోల్ స్ట్రాటజిస్టుల కాల్ డాటా సేకరించారా? హోం మంత్రి రేవంత్ రెడ్డే, ఆయన దగ్గరనే లక్ష మంది పోలీసులు ఉన్నారు. సిఐడి, ఎస్.బి, ఇంటలిజెన్స్,కౌంటర్ ఇంటలిజెన్స్ అందరూ ఆయన చేతిలోనే ఉన్నారు.అయినా కేసులు అర్ధాంతరంగా మూసేశారు. ఇది క్లోజ్ చేసే కేసు కాదు. అత్యంత అధునాతన టెక్నాలజీ ఉపయోగించి విచారణ జరపాల్సిన కేసు. ఎలా క్లోజ్ చేశారు.జెనీవా ఒప్పందం ప్రకారం ఏ డ్యాం కూల్చేసినా అది యుద్ధ నేరం అని ప్రపంచ దేశాలు అంగీకరించాయి.అలాంటి యుద్ధనేరం తెలంగాణలో జరిగింది. అలాంటి కేసును ఎలా క్లోజ్ చేస్తారు.2025 తనుగుల హుజూరాబాద్ మానేరు నది మీద 35 కోట్లతో కట్టిన చెక్ డ్యాం ను దుండగులు పేల్చేశారు. ఆ కేసు కూడా విచారణ చేయకుండా ఆపేశారు. ఇదేంటని అడిగితే ఎక్స్ పర్ట్ ఒపీనియన్ కి పంపామని చెబుతున్నారు.హుస్సేమియా వాగు మీద మరోసారి పేల్చాలని పోతుంటే పోలీసులే కాంగ్రెస్ నాయకులను ఆపారు. 25 లక్షల క్యూసెక్కుల వరదను ఆపగలిగిన లక్ష్మి బ్యారేజీ.కూలిపోయే నాటికి వరద ప్రవాహం 22 లక్షల క్యూసెక్కులు మాత్రమే ఉంది అలాంపుడు ఎలా కుంగిపోతుంది.కిషన్ రెడ్డి అక్టోబర్ 3 2023న తియస్థా నది మీద కట్టిన డ్యాం ధ్వంసమైతే 70 మంది చనిపోయారు కానీ ఆయన,దీనిపై ఎన్.డి.ఎస్.ఎ కు లేఖ రాయలేదు.కానీ కేవలం మేడిగడ్డలో ఒక పిల్లర్ కుంగిపోయిందని ఎన్ డి ఎస్ ఏ కు కిషన్ రెడ్డి లేఖ రాసారు. కిషన్ రెడ్డి, బండి సంజయ్, రేవంత్ ఫోన్ కాల్ డాటా మరియు వారి పోల్ స్ట్రాటజిస్టులు,వారితో సంబంధాలు కలిగి ఉన్న మాజీలను గుర్తించి వారి కాల్ డేటా సేకరించి విచారణ చేయాలి. కన్నెపల్లి పంప్ హౌస్ ఆన్ చేయకపోవడం వల్ల ఆంధ్రకు లాభం. క్రాప్ హామీ డే అంటూ సి ఎం మాట్లాడడం దారుణం. సాగు నీరు లేకపోవడానికి కారణం రేవంత్ రెడ్డే. ఇప్పటికే 734 టి ఎం సిల నీరు సముద్రం లో అందులో 400 టి ఎంసి ల నీరు గత ఆగస్టు నెలలోనే కలిసాయి.కేసిఆర్ మీద కోపంతో మాత్రమే కన్నెపల్లి నీరు ఎత్తిపోయలేదు.కేటిఆర్ ,హరీష్ రావు పోరాటంతో కొంత కాలం ఎత్తిపోసి మళ్లీ ఆపేశారు.సీనియర్ రైటైర్డ్ ఇంజనీర్లు చెప్తున్న ప్రకారం, ఇప్పటికీ 1 లక్ష 15 వేల క్యూసెక్కుల నీరు గోదావరి నదిలో పారుతుంది

# పత్తి కొనుగోళ్లకు సర్వం సిద్ధం.. అని కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని మంత్రి ఆదేశం

మొదటి పేజీ తరువాయి

దేశవ్యాప్తంగా ప్రస్తుత సీజన్‌లో 271.06 లక్షల ఎకరాల్లో పత్తి సాగు జరగగా, 133.04 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి వస్తుందని అంచనా. గత సీజన్‌లో 148.02 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి నమోదైంది. దేశవ్యాప్తంగా ఎల్‌నినో ప్రభావం సహా ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా పత్తి ఉత్పత్తి తగ్గే అవకాశం ఉన్న నేపథ్యంలో, రాష్ట్రంలో కొనుగోళ్ల ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని మంత్రి సూచించారు.

**కనీస మద్దతు ధర రూ.8,667.. రైతులకు ధరల భరోసా**

కేంద్ర ప్రభుత్వం 2026-27 ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్‌కు పత్తి కనీస మద్దతు ధరను క్వింటాల్‌కు రూ.8,667గా ప్రకటించింది. ప్రస్తుతం తెలంగాణలో పత్తి మోడల్ మార్కెట్ ధర సుమారు రూ.9,000గా ఉందని అధికారులు వివరించారు. ఇది కనీస మద్దతు ధర కంటే రూ.333 అధికం.

మార్కెట్ ధరలు కనీస మద్దతు ధర కంటే ఎక్కువగా ఉన్నప్పుడు రైతులు బహిరంగ మార్కెట్లో విక్రయించుకోవచ్చని, ధరలు తగ్గి కనీస మద్దతు ధర కంటే దిగువకు వచ్చినప్పుడు సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో పత్తిని విక్రయించుకునే అవకాశం ఉంటుందని మంత్రి తెలిపారు. రైతులు నష్టపోకుండా ఉండేందుకు సీసీఐ, మార్కెటింగ్ శాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.

పత్తిలో తేమ శాతం, నాణ్యత ఆధారంగా సీసీఐ నిబంధనల ప్రకారం కొనుగోలు ధర నిర్ణయిస్తారని, రైతులు పత్తిని విక్రయించే ముందు నాణ్యత ప్రమాణాలు, తేమ శాతాన్ని పరిశీలించుకోవాలని సూచించారు.

**335 జిన్నింగ్ మిల్లులు కొనుగోలు కేంద్రాలుగా నోటిఫై**

2026-27 సీజన్‌లో పత్తి కొనుగోళ్ల కోసం సీసీఐ గత సీజన్‌లో ఉన్న 122 కొనుగోలు కేంద్రాల సంఖ్యను 133కు పెంచింది. రాష్ట్రంలో రోజుకు 1,09,035 బేళ్ల సామర్థ్యంతో 356 జిన్నింగ్ మిల్లులు ఉండగా, ఇప్పటివరకు 30 జిల్లాల్లో 335 జిన్నింగ్ మిల్లులను కొనుగోలు కేంద్రాలుగా నోటిఫై చేసినట్లు అధికారులు తెలిపారు.

పత్తి కొనుగోళ్లకు సంబంధించి 11-08-2026న రాష్ట్రస్థాయి సమావేశం నిర్వహించి, సీసీఐ, సంబంధిత శాఖల అధికారులు, జిన్నింగ్ మిల్లుల ప్రతినిధులకు అవసరమైన సూచనలు ఇచ్చినట్లు వివరించారు. కొనుగోలు కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు, పత్తి నాణ్యత పరీక్షలు, జిన్నింగ్, బేళ్ల తయారీ, గోదాములకు రవాణా, రైతులకు సకాలంలో చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు.

ప్రభుత్వం జారీ చేసిన G.O.Rt.No.640, తేదీ 01-10-2026 ద్వారా రాష్ట్రస్థాయి పర్యవేక్షణ కమిటీని, G.O.Rt.No.641, తేదీ 01-10-2026 ద్వారా జిల్లా స్థాయి కమిటీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కమిటీలు పత్తి మార్కెట్ ధరలు, కొనుగోళ్ల పురోగతి, కొనుగోలు కేంద్రాల్లో సమస్యలను నిరంతరం పర్యవేక్షించాలని మంత్రి సూచించారు.

దేశంలోని ఇతర ప్రధాన పత్తి మార్కెట్లతో పోలిస్తే తెలంగాణలో కొన్ని మార్కెట్లలో ధరలు తక్కువగా ఉండటానికి గల కారణాలను మంత్రి అధికారులను అడిగి తెలుసుకున్నారు. గుజరాత్, మహారాష్ట్ర వంటి రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణలో పత్తి గింజల ప్రాసెసింగ్ యూనిట్లు, స్పిన్నింగ్ పరిశ్రమల సంఖ్య, సామర్థ్యం తక్కువగా ఉండటం కూడా ధరలపై ప్రభావం చూపుతోందని అధికారులు వివరించారు.

ఈ నేపథ్యంలో రాష్ట్రంలో పత్తి ప్రాసెసింగ్, స్పిన్నింగ్, ఆయిల్ పరిశ్రమల అభివృద్ధికి అవసరమైన అవకాశాలను పరిశీలించాలని మంత్రి సూచించారు. ఇతర రాష్ట్రాల్లో పరిశ్రమలకు అందిస్తున్న ప్రోత్సాహకాలు, రాయితీలు, సౌకర్యాల వివరాలను సేకరించి, తెలంగాణలో పత్తి ఆధారిత పరిశ్రమల విస్తరణకు తగిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

మార్కెటింగ్ శాఖ, సీసీఐ అధికారులు బహిరంగ మార్కెట్లో పత్తి ధరలను ప్రతిరోజూ సమీక్షిస్తూ, ధరల వ్యత్యాసాలకు గల కారణాలను విశ్లేషించాలని మంత్రి స్పష్టం చేశారు. రాష్ట్రంలో పత్తి ప్రాసెసింగ్ సామర్థ్యం పెరిగితే స్థానికంగా పత్తికి డిమాండ్ పెరిగి, రైతులకు మెరుగైన ధరలు లభించే అవకాశాలు ఉంటాయని తెలిపారు.

**నాణ్యమైన పత్తి సేకరణపై ప్రత్యేక దృష్టి**

పత్తి కొనుగోళ్లలో తెలంగాణ దేశంలో ముందంజలో ఉండటానికి రాష్ట్రంలో పండించే నాణ్యమైన పత్తి ప్రధాన కారణమని మంత్రి పేర్కొన్నారు.రైతులు పండించిన పత్తిని సేకరించి మార్కెట్లకు తరలించే సమయంలో నాణ్యత దెబ్బతినకుండా రైతులకు అవగాహన కల్పించాలని, కొనుగోలు కేంద్రాల్లో నాణ్యత పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. నాణ్యత ప్రమాణాలను కాపాడటం ద్వారా రైతులకు మెరుగైన ధర లభించడంతో పాటు సీసీఐ కొనుగోళ్లు కూడా సజావుగా సాగుతాయని తెలిపారు.

**కపాస్ కిసాన్ యాప్‌తో రైతులకు సౌలభ్యం**

పత్తి కొనుగోళ్లలో పారదర్శకత పెంచేందుకు కపాస్ కిసాన్ యాప్, ఆన్‌లైన్ చెల్లింపులు, రైతుల వివరాల ధ్రువీకరణ వంటి డిజిటల్ విధానాలను అమలు చేస్తున్నారు. అక్టోబర్ 21, 2026 నాటికి 12,75,185 మంది రైతులకు సంబంధించిన 21,58,938 వివరాలను కపాస్ కిసాన్ యాప్‌తో అనుసంధానం చేసినట్లు అధికారులు తెలిపారు.

రైతులు పత్తి విక్రయానికి స్లాట్ బుక్ చేసుకునే ముందు యాప్‌లో నమోదైన వివరాలను పరిశీలించుకోవాలని సూచించారు. జిల్లాకు నిర్ణయించిన సగటు దిగుబడి కంటే ఎక్కువ పత్తి దిగుబడి ఉన్న రైతులు అదనపు దిగుబడి ధ్రువీకరణ కోసం సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈఓ)ను సంప్రదించాలి. కౌలు రైతులు తమ పేర్ల నమోదు కోసం సంబంధిత ఏఈఓను సంప్రదించి, అవసరమైన భూమి, ఆధార్, మొబైల్ వివరాలను అందించాలని అధికారులు సూచించారు. భూ యజమాని ధ్రువీకరణ అనంతరం నమోదు ప్రక్రియ పూర్తవుతుంది.

**టోల్‌ఫ్రీ, వాట్సాప్ సేవలు అందుబాటులోకి**

పత్తి రైతులకు సమాచారం, సహాయం అందించేందుకు మార్కెటింగ్ శాఖ 1800-599-5779 టోల్‌ఫ్రీ నంబర్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. అలాగే 8897281111 వాట్సాప్ నంబర్ ద్వారా పత్తి కొనుగోళ్లకు సంబంధించిన వివరాలను తెలుసుకునే సౌకర్యం కల్పించింది.

ఈ సేవల ద్వారా రైతులు సీసీఐ ద్వారా ఎంత పత్తి విక్రయించవచ్చో, విక్రయించిన పంట విలువ, చెల్లింపుల స్థితి, కొనుగోలు కేంద్రాల్లో వేచి ఉండే సమయం తదితర వివరాలను తెలుసుకోవచ్చు. అన్ని మార్కెట్ యార్డుల్లో ప్రత్యేక హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేసి, కొనుగోలు కేంద్రాల్లో ఎదురయ్యే సమస్యలను వెంటనే పరిష్కరించాలని మంత్రి ఆదేశించారు.

రైతులు పత్తిని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చే ముందు తేమ శాతాన్ని పరీక్షించుకునేందుకు రాష్ట్రంలోని రైతు వేదికల వద్ద మాయిశ్చర్ మీటర్లను అందుబాటులో ఉంచినట్లు అధికారులు తెలిపారు.

**రైతులకు మంత్రి విజ్ఞప్తి**

రైతులు ప్రస్తుత మార్కెట్ ధరలను పరిశీలించి, కనీస మద్దతు ధర కంటే ఎక్కువ ధర లభిస్తున్నప్పుడు బహిరంగ మార్కెట్లో పత్తిని విక్రయించుకోవాలని మంత్రి సూచించారు. మార్కెట్ ధర తగ్గినప్పుడు సీసీఐ ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో నిబంధనలకు అనుగుణంగా పత్తిని విక్రయించుకోవాలని కోరారు.

పత్తి కొనుగోళ్లలో పారదర్శకత, రైతులకు ధరల భరోసా, సకాలంలో చెల్లింపులు, కొనుగోలు కేంద్రాల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించడం లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రి స్పష్టం చేశారు. అధికారులు సమన్వయంతో పనిచేస్తూ పత్తి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆదేశించారు.

# ఇది కాలం తెచ్చిన కరువు కాదు..

మొదటి పేజీ తరువాయి

ఎకరాకు 10 క్వింటాళ్లు రావాల్సిన పత్తి దిగుబడి నేడు 2, 3 క్వింటాళ్లు కూడా వచ్చే పరిస్థితి లేదు.

పొరుగున ఉన్న మహారాష్ట్ర ప్రభుత్వం రైతులకు తక్షణ సాయంగా ఎకరాకు రూ. 5,000 విడుదల చేసింది, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కరువు మండలాలను ప్రకటించింది. మరికొన్ని రాష్ట్రాలు తాగునీటి ప్రత్యామ్నాయ ఏర్పాట్ల కోసం కలెక్టర్లకు నిధులు ఇచ్చాయి.

కానీ తెలంగాణ ప్రభుత్వం ఇంతవరకు కరువు మండలాలు ప్రకటించలేదు, పైసా సాయం చేయలేదు.

ఎల్‌నినో హెచ్చరికలు రాగానే ఇతర రాష్ట్రాలు 10 నెలల ముందే విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు చేసుకుని, థర్మల్ కేంద్రాల్లో బొగ్గు నిల్వలు సమకూర్చుకున్నాయి.

కానీ రేవంత్ రెడ్డి 9 నెలల పాటు నిద్రపోయి, సమీక్షలు చేయకుండా, కోల్ ఇండియాతో మాట్లాడి బొగ్గు తేకుండా ఇప్పుడు రైతులు రోడ్డెక్కి సబ్ స్టేషన్లను ముట్టడిస్తుంటే కొందామన్నా కరెంటు దొరకడం లేదని బీద అరుపులు అరుస్తున్నారు.

తన తప్పును కప్పిపుచ్చుకోవడానికి అధికారులను సస్పెండ్ చేస్తానని ముఖ్యమంత్రి చిందులు వేస్తున్నారు.

సకాలంలో ఆదేశాలు ఇవ్వని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని, విద్యుత్ శాఖ మంత్రిగా ఉన్న ఉపముఖ్యమంత్రిని ముందుగా సస్పెండ్ చేయాలి.

సమస్య నెత్తిమీదకు వచ్చాక నిన్న యాదాద్రి ఐదో యూనిట్‌ను సింక్రనైజ్ చేశారు, ఈ పని ముందే చేసి ఉంటే పంటలు ఎండేవి కావు.

నాడు కరోనా విపత్తు వచ్చినప్పుడు కేసీఆర్ గారు ప్రజలకు రక్షణ కవచంలా నిలబడితే.. నేడు ఎల్‌నినో వస్తే రేవంత్ రెడ్డి ప్రజలను శిక్షిస్తున్నారు.

కరోనా సమయంలో కేసీఆర్ గారు భయపడకుండా స్వయంగా గాంధీ ఆసుపత్రికి వెళ్లి పేషెంట్లను పరామర్శించి ధైర్యం చెప్పారు. యుద్ధ విమానాల్లో ఆక్సిజన్ తెప్పించారు. రెమ్‌డెసివిర్ ఇంజెక్షన్లు సమకూర్చారు.

లాక్‌డౌన్‌లో ప్రజలు ఇబ్బంది పడకూడదని కేసీఆర్ గారు 87 లక్షల తెల్ల రేషన్ కార్డుదారులకు రూ. 1,500 చొప్పున నగదు, మనిషికి 10 కిలోల ఉచిత బియ్యం, ప్రైవేట్ స్కూల్ టీచర్లకు రూ. 2,000 ఆర్థిక సాయం అందించారు.

ప్రాణాలకు తెగించి పనిచేసిన డాక్టర్లు, పోలీసులకు 10 శాతం వేతనం, మున్సిపల్, గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మికులకు రూ. 1,000 జీతం పెంచి ప్రోత్సహించారు.

కరోనా కష్టకాలంలోనూ రైతులకు నిరంతర కరెంటు, సాగునీరు ఇచ్చి, విశాఖపట్నం పోర్టులో స్పెషల్ ఆఫీసర్లను పెట్టి యూరియా తెప్పించి, బీహార్ నుంచి ప్రత్యేక రైళ్లలో హమాలీలను రప్పించి కేసీఆర్ గారు కోటి టన్నుల పంట పండించారు.

కానీ రేవంత్ రెడ్డి మాత్రం "పైసలు పెడితే నీళ్లు దొరుకుతాయా?" అంటూ ఉచిత డైలాగులు కొడుతూ ఎల్‌నినో పేరిట క్రాప్ హాలిడే ప్రకటించారు.

బూరుగుపల్లి గ్రామంలో అరవింద్ రెడ్డి అనే యువ రైతు తన 3 ఎకరాల పొలాన్ని కాపాడుకోవడానికి కరెంటు లేక రోజుకు రూ. 4,000 జనరేటర్ కిరాయి, రూ. 3,000 డీజిల్ కలిపి రోజుకు రూ. 7,000 చొప్పున మూడు రోజుల్లో రూ. 21,000 ఖర్చు పెట్టాడు.

అయినా కరెంటు రాకపోవడంతో పెట్టుబడి తడిసిమోపెడవుతుందని పంటను వదిలేస్తే 2.5 ఎకరాలు ఎండిపోయి కేవలం అర ఎకరం మాత్రమే మిగిలింది.

కేసీఆర్ పాలనలో దుకాణాల్లో ఇన్వర్టర్లు, కన్వర్టర్లు, బావుల దగ్గర ఆయిల్ ఇంజన్లు, జనరేటర్లు మాయమైపోతే.. కాంగ్రెస్ మార్పు పాలనలో మళ్లీ పాత రోజులు తెచ్చి జనరేటర్లకు గిరాకీ పెంచారు.

ఇదే బూరుగుపల్లిలో స్వామి అనే రైతు 3 ఎకరాలు నాటేస్తే 2 ఎకరాల 30 గుంటలు ఎండిపోయి 10 గుంటలే మిగిలింది. దయ్యాల యాదగిరి అనే రైతు 10 ఎకరాలు వేస్తే 9 ఎకరాలకు పైగా ఎండిపోయిందని కన్నీరు పెట్టుకున్నాడు.

నరసింహులు అనే రైతు వేసిన ఒక్క ఎకరం పూర్తిగా ఎండిపోయింది.

సత్యనారాయణ అనే మరో రైతు 6 ఎకరాలు నాటేస్తే 3 ఎకరాలు ఎండిపోయింది. లో-వోల్టేజీ, టూ ఫేజ్ కరెంటు వల్ల స్టార్టర్లలో పత్తులు కొట్టుకుంటూ రెండుసార్లు మోటార్లు, ఒకసారి ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయి రూ. 10 వేల చొప్పున నష్టపోయానని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

నాడు కేసీఆర్ హయాంలో హైదరాబాద్ హైటెక్ సిటీలో ఎంత నాణ్యమైన కరెంటు ఉండేదో, రైతుల బోర్ల దగ్గర కూడా అంతే నాణ్యమైన కరెంటు ఉండేది.

బూరుగుపల్లి పరిసరాల్లోనే వందలాది ఎకరాలు పొట్ట దశకు వచ్చి, మరో 20 రోజుల్లో కోతకు వచ్చే సమయంలో నీళ్లు లేక కరెంటు లేక నోటికాడి బుక్క మట్టిపాలవుతోంది. కేసీఆర్ ఉన్న ఐదేళ్లలో యాసంగి, వానాకాలాల్లో బంగారంలా పంటలు పండాయని, వానాకాలంలో నీళ్లు లేకపోవడం ఇదే మొదటిసారని రైతులు వాపోతున్నారు.

కాళేశ్వరం ప్రాజెక్టులో మోటార్లు ఆన్ చేసి నీళ్లు నింపుకోవచ్చని, తమకు సంబంధం లేదని చీఫ్‌ూగా హైకోర్టులో స్పష్టంగా అఫిడవిట్ వేసింది.

కానీ కన్నెపల్లి పంపులు ఆన్ చేసి మల్లన్న సాగర్, రంగనాయక సాగర్ నింపితే కేసీఆర్ గారికి పేరు వస్తుందని, తమ అబద్ధాలు బయటపడతాయనే రాజకీయ కక్షతోనే రేవంత్ రెడ్డి నీళ్లు ఎత్తకుండా గజ్వేల్, దుబ్బాక, సిద్దిపేట, మెదక్, రామాయంపేట, భువనగిరి, యాదాద్రి ప్రాంతాల్లో పంటలను ఎండబెడుతున్నారు.

కాళేశ్వరం రెండో టీఎంసీ పనులను మూడేళుగా ఆపేశారు. ఆ పనులు పూర్తి చేసి ఉంటే మల్లన్న సాగర్‌లోకి రోజుకు 2 టీఎంసీల నీళు వచ్చేవి, హైదరాబాద్ తాగునీటికి, మూసీకి కూడా నీళ్లు అందేవి.

దేవాదుల ప్రాజెక్టు వద్ద కేసీఆర్ గారు కట్టిన సమ్మక్క బ్యారేజీలో గోదావరి నీళ్లు అందుబాటులో ఉన్నా.. 10 మోటార్లకు గాను 7, 8 మోటార్లను మాత్రమే నడుపుతూ, 24 గంటలకు బదులు 8 గంటలే నడిపి 16 గంటలు బంద్ పెడుతూ వరంగల్ జిల్లాలో కృత్రిమ కరువు సృష్టించారు.

నీళ్ల కోసం ముఖాన్ని మొగులుకు పెట్టి చూడాల్సిన పనిలేదు, కట్కొత్తుతే చాలు రెండు పంటలు పండాలి అని కేసీఆర్ గారు ప్రాజెక్టులు కడితే, ఉన్న నీళ్లను ఎత్తడం కూడా ఈ దద్దమ్మ ప్రభుత్వానికి చేతకావడం లేదు.

ముఖ్యమంత్రి సొంత జిల్లా పాలమూరులో కల్వకుర్తి కింద శ్రీశైలంలో నీళ్లు ఉన్నా, 24 గంటలు మోటార్లు నడిపి 35 టీఎంసీలు ఎత్తాల్సిన చోట కేవలం 8 గంటలే నడిపి 13 టీఎంసీలు మాత్రమే ఎత్తారు.

నాడు 30 ఏళ్ల కాంగ్రెస్, టీడీపీ పాలనలో 13 వేల ఎకరాలకే నీళ్లిస్తే, కేసీఆర్ గారు వేల కోట్లు ఖర్చుపెట్టి 7 లక్షల ఎకరాలకు నీళ్లిచ్చారు. నేడు పాలమూరు కరువుకు ఎల్‌నినో కారణం కాదు, రేవంత్ రెడ్డి పరిపాలనా వైఫల్యమే కారణం.

రేవంత్ రెడ్డి గోదావరిలో, కృష్ణాలో నీళ్లు ఎత్తకుండా వదిలేస్తే.. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి మాత్రం ఒడిసిపట్టుకుని నీళ్లను తరలించుకుపోయారు. అందుకే ఏపీలో పంటలు ఎండలేదు, రేవంత్ రెడ్డి వైఫల్యం ఏపీకి వరంగా మారింది.

కరోనా కష్టకాలంలో ప్రజలపై భారం పడకూడదని కేసీఆర్ గారు కరెంటు చార్జీలు, ఆర్టీసీ చార్జీలు పెంచే ప్రతిపాదనలను తిరస్కరించారు.

కానీ రేవంత్ రెడ్డి ఈ కరువు కాలంలో పేద, మధ్యతరగతి ప్రజలపై రూ. 5,420 కోట్ల కరెంటు చార్జీల భారం మోపారు, ఆర్టీసీలో భార్యకు ఫ్రీ అని భర్తకు డబుల్ టికెట్ కొడుతూ చార్జీలు పెంచేశారు.

నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటాయి. మంచినూనె రూ. 220, పప్పులు రూ. 160, ఉల్లిగడ్డ రూ. 70, ఎల్లిగడ్డ రూ. 200 కి చేరింది. దేశానికే ధాన్యాగారమైన తెలంగాణలో బ్లాక్ మార్కెట్‌ను అరికట్టలేక, గోదాముల్లోని నిల్వలను బయటకు తేలేక బియ్యం ధరను కిలో రూ. 90 కి పెంచిన ఘనత ఈ ప్రభుత్వానిదే.

పంటలు ఎండిపోయి పని దొరకక అల్లాడుతున్న దళిత, గిరిజన, బలహీన వర్గాల వ్యవసాయ కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద రూ. 12,000 ఇస్తామని రెండు బడ్జెట్లలో పెట్టి, అసెంబ్లీలో ఆమోదించినా ఇంతవరకు ఒక్క రూపాయి విడుదల చేయలేదు.ప్రభుత్వం ఇప్పటికైనా మేల్కొని ఈ 20-30 రోజుల పాటు మల్లన్న సాగర్ నుంచి నీళ్లు వదిలి, 24 గంటల నాణ్యమైన కరెంటు ఇస్తే రాష్ట్రంలో మిగిలిన 10 నుంచి 20 లక్షల ఎకరాల పంటనైనా కాపాడుకోవచ్చు.

కన్నెపల్లి, దేవాదుల, కల్వకుర్తి మోటార్లను తక్షణమే 24 గంటలూ నడిపించాలి.

రాష్ట్రంలో తక్షణమే కరువు మండలాలను ప్రకటించి, ఎండిపోయిన 12 లక్షల ఎకరాల పంటలకు నష్టపరిహారం అందించాలి. రైతు కూలీలకు వెంటనే రూ. 12,000 విడుదల చేయాలి.

తాగునీటి ఎద్దడి నివారణకు కలెక్టర్లకు నిధులు ఇచ్చి ఎమ్మెల్యేలు, సర్పంచులు, కౌన్సిలర్లను భాగస్వాములను చేయాలి.

ప్రజలపై మోపిన రూ. 5,420 కోట్ల విద్యుత్ భారాన్ని, పెంచిన బస్సు చార్జీలను తక్షణమే ఉపసంహరించుకుని, నిత్యావసరాల ధరలను నియంత్రించాలని బీఆర్ఎస్ పార్టీ తరఫున డిమాండ్ చేస్తున్నాం.

# ఫ్రాన్స్ అల్లర్లకు, భారత్ నిరసనలకు లింక్..
# ఫాక్స్ న్యూస్ రిపోర్ట్‌తో కాంగ్రెస్‌పై బీజేపీ ఫైర్

న్యూఢిల్లీ, అక్టోబరు 22 ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీపై బీజేపీ తీవ్ర స్థాయిలో విరుచుకుపడింది. ఫ్రాన్స్‌లో చోటుచేసుకున్న అల్లర్లకు, భారత్‌లో సీఈసీకి వ్యతిరేకంగా జరిగిన నిరసనలకు మధ్య సంబంధం ఉందంటూ అమెరికన్ మీడియా సంస్థ 'ఫాక్స్ న్యూస్' ప్రచురించిన కథనాన్ని బీజేపీ ఈ సందర్భంగా ఉటంకించింది. ఇది కేంద్ర ప్రభుత్వాన్ని కూల్చేందుకు కాంగ్రెస్ పన్నిన కుట్ర అని ఆరోపిస్తూ, రాహుల్ గాంధీ ద్రోహి అంటూ ఘాటు వ్యాఖ్యలు చేసిందిఫాక్స్ న్యూస్ డిజిటల్ నిర్వహించిన పరిశీలనలో, 13 దేశాలకు చెందిన 101 సంస్థలు ఈ నిరసనలను సమన్వయం చేస్తూ మద్దతు ఇస్తున్నట్లు తెలిసిందని సదరు కథనం పేర్కొంది. ఫ్రాన్స్‌లోని అశాంతికి, భారత్‌లో యువత నేతృత్వంలో జరిగిన ప్రదర్శనలకు మధ్య అంతర్జాతీయ సంబంధాలు ఉన్నట్లు ఆరోపించింది.గురువారం ఈ నివేదికను ఆధారంగా చేసుకుని బీజేపీ అధికార ప్రతినిధి గౌరవ్ భాటియా మీడియా సమావేశంలో మాట్లాడారు. "ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ దేశంలో అరాచకాన్ని, ద్రోహాన్ని ప్రోత్సహించే నమూనాను ప్రదర్శిస్తున్నారు. ఈ కుట్రలకు విదేశీ ఏజెన్సీలతో సంబంధాలు ఉన్నాయని నేటి నివేదిక బట్టబయలు చేసింది. కాబట్టి, ఈ ద్రోహుల నాయకుడు ఎవరు? అని ప్రశ్నించడంలో తప్పు లేదు" అని భాటియా ధ్వజమెత్తారు. దురదృష్టవశాత్తు మన ప్రతిపక్ష నేత బాధ్యతారాహిత్యంగా, అపరిపక్వంగా వ్యవహరిస్తున్నారని, లభిస్తున్న ఆధారాల ప్రకార ఆయనను దేశద్రోహి లేదా మీర్ జాఫర్ అని పిలవడంలో అతిశయోక్తి లేదని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఫాక్స్ న్యూస్ రిపోర్ట్ ప్రకారం 'రెడ్-గ్రీన్ ఎకోసిస్టమ్ ఆఫ్ ప్రొటెస్ట్' నడుస్తోందని, ఇందులో 'రెడ్' అంటే కమ్యూనిస్ట్ వర్గాలని, 'గ్రీన్' అంటే ఇస్లామిక్ వర్గాలని ఆయన వివరించారు.మరో బీజేపీ అధికార ప్రతినిధి ప్రదీప్ భండారి సైతం 'ఎక్స్' వేదికగా కాంగ్రెస్‌పై విమర్శలు గుప్పించారు. "ప్రపంచవ్యాప్త దర్యాప్తులో కాంగ్రెస్ సాగిస్తున్న అరాచకం, ప్రభుత్వాన్ని మార్చే కుట్ర బహిర్గతమైంది" అని ఆయన పేర్కొన్నారు. 'ప్రోగ్రెసివ్ ఇంటర్నేషనల్' (పీఐ) అనే కమ్యూనిస్ట్ సంస్థ ఫ్రాన్స్, అల్బేనియా, భారత్‌లోని నిరసనలకు ఒకేరకమైన సందేశాలను సమన్వయం చేసిందని, కొత్త తిరుగుబాటు ద్వారా వ్యవస్థీకృత శక్తిని సాధించడమే దీని లక్ష్యమని ఆ నివేదికను ఉటంకిస్తూ భండారి ఆరోపించారు.అంతేకాకుండా, "2025 ఏప్రిల్ 10న రాహుల్ గాంధీ, సోనియా గాంధీలు 10 జనపథ్‌లో ప్రోగ్రెసివ్ ఇంటర్నేషనల్ ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఇది విదేశీ ప్రజాస్వామ్య వ్యతిరేక శక్తుల రిమోట్ కంట్రోల్‌లో కాంగ్రెస్ ఉందనడానికి నిదర్శనం" అని ప్రదీప్ భండారి సంచలన ఆరోపణలు చేశారు. ఈ సమావేశంపై, నిరసనల సమయంలో పీఐతో సమన్వయం చేసుకున్నారా అనే అంశంపై కాంగ్రెస్ సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

# యాంటీ బీజేపీ స్టాండ్ తో వైసీపీ

విశాఖపట్టణం అక్టోబరు 22, వైసీపీ వచ్చే పార్లమెంటు సమావేశాల్లో గళం విప్పనుందని తెలుస్తోంది. వైసీపీ ధినేత వైఎస్ జగన్ చేసిన వ్యాఖ్యలు కొంత కలకలం రేపుతున్నాయి. తాము కేంద్ర ఎన్నికల కమిషన్ నియామకంలో ఎన్డీఏ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బిల్లుకు మద్దతిచ్చి తప్పు చేశామని జగన్ చెప్పడాన్ని బట్టి ఇక ఢిల్లీపై పోరుకు జగన్ సిద్ధమయినట్లు కనిపిస్తుంది. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఎన్డీయే నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వానికి గతంలో కొన్ని బిల్లుల విషయంలో మద్దతు ఇవ్వడంపై విచారం వ్యక్తం చేశారు. అయితే, ఆయన నేరుగా బీజేపీకి క్షమాపణలు చెప్పలేదు, కానీ కేంద్ర ఎన్నికల కమిషనర్ల నియామక బిల్లు–2023 విషయంలో నాడు ఎన్డీయే ప్రభుత్వానికి మద్దతు ఇచ్చి పెద్ద తప్పు చేశామని వ్యాఖ్యానించారు. దీంతో వైసీపీకి, బీజేపీకి ఇప్పుడు మరింత దూరం పెరిగిందని చెప్పొచ్చు. పార్టీ 2024 ఎన్నికలలో ఓటమి పాలయినా జగన్ పార్టీ బీజేపీలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టే ప్రతి బిల్లుకు మద్దతిచ్చింది. 2023లో కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఎన్నికల కమిషనర్ల నియామక సవరణ బిల్లుకు తాము మద్దతు ఇవ్వడం పొరపాటని జగన్ అభిప్రాయపడ్డారు. ఈ బిల్లు ద్వారా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ని నియామక కమిటీ నుంచి తొలగించి, ఆ స్థానంలో కేంద్ర మంత్రిని చేర్చారు. దీనికి వైఎస్సార్‌సీపీ మద్దతు ప్రకటించింది. ప్రస్తుతం కేంద్ర ఎన్నికల సంఘం పనితీరుపై, ఓటర్ల జాబితాల సవరణపై దేశవ్యాప్తంగా వస్తున్న ఆరోపణల నేపథ్యంలో జగన్ స్పందించారు. రాజ్యాంగబద్ధమైన సంస్థలపై ప్రజల్లో నమ్మకం కలగాలంటే మళ్లీ పాత నియామక పద్ధతినే సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ కమిటీలో ఉండేలా పునరుద్ధరించాలని ఆయన డిమాండ్ చేశారు. తాము గతంలో కేంద్రానికి కేవలం అంశాల వారీగా మాత్రమే మద్దతు ఇచ్చామని, అయితే ప్రస్తుత పరిస్థితుల్లో ఎన్నికల వ్యవస్థపై ప్రజలకు మరింత నమ్మకం కలిగించాల్సిన అవసరం ఉందని వైసీపీ నేతలు స్పష్టం చేస్తున్నారు.... అయితే జగన్ కాంగ్రెస్ నేతృత్వం వహిస్తున్న ఇండియా కూటమిలో భాగస్వామిగా మారతారని మాత్రం అనుకోవడానికి వీలులేదు. ఎందుకంటే కాంగ్రెస్ జగన్ కు ప్రధాన శత్రువు. అందుకే దానికి దూరంగా ఉండే అవకాశాలే ఎక్కువ ఉన్నాయి. అలాగని బీజేపీకి కూడా దగ్గరయ్యే ఛాన్సులు లేవు. ప్రస్తుతం పార్లమెంటులో ఏదైనా కీలకమైన బిల్లుల విషయంలో జగన్ పార్టీ ఇటు మద్దతు, అటు వ్యతిరేకత తెలపకుండా వాకౌట్ చేసే అవకాశాలున్నాయని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. మరొకవైపు తమిళనాడుకు చెందిన డీఎంకే పార్టీ బీజేపీ, కాంగ్రెస్ కు వ్యతిరేకంగా తృతీయ కూటమిని ఏర్పాటు చేయాలన్న లక్ష్యంతో ఉంది. అందులో భాగంగా జగన్ తో డీఎంకే నేతలు సంప్రదింపులు జరిపితే కొంత వరకూ ఆ కూటమిలో చేరే అవకాశముంది. మొత్తం మీద జగన్ దారి ఎటన్నది రాజకీయంగా చర్చనీయాంశమైంది. రానున్న కాలంలో దీనిపై పూర్తి స్థాయిలో క్లారిటీ రానుంది.

# వైసీపీ ‘సెల్ఫ్ గోల్’ వ్యూహం !

విజయవాడ, అక్టోబరు 22, విజయవాడ మేయర్ ఎన్నికల పోరులో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అనుసరిస్తున్న వ్యూహం ఆ పార్టీ ఉనికిని ప్రశ్నార్థకం చేసేలా ఉంది. టీడీపీ–జనసేన–బీజేపీ కూటమిలో ఎలాగైనా చిచ్చు పెట్టాలనే కుతంత్రంతో.. ఎన్నికల బరిలో ఉన్న మాజీ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావుకి వైసీపీ సోషల్ మీడియా, ద్వితీయ శ్రేణి నేతలు పరోక్షంగా పూర్తి మద్దతు ప్రకటిస్తూ ప్రచారం సాగిస్తున్నారు. ఈ ఎన్నికను ఎప్పటిలాగే పాత సామాజిక సమీకరణాలైన కమ్మ వర్సెస్ కాపు పోరుగా మార్చేయాలని చూస్తూ, ప్రధాన పోటీ వంగవీటి వర్సెస్ ఏబీవీ అన్నట్లుగా ఒక కృత్రిమ వాతావరణాన్ని సృష్టించేందుకు తాపత్రయపడుతున్నారు. కూటమి ఐక్యతను దెబ్బతీసి, కాపు–కమ్మ ఓట్లను చీల్చడం ద్వారా కూటమిలో రాజకీయ అగాధాన్ని సృష్టించాలనే కుయుక్తితోనే వైసీపీ ఈ పరోక్ష ప్రచారానికి తెరతీసింది. ఈ వికృత రాజకీయం నడుపుతున్న క్రమంలో వైసీపీ నాయకత్వం ఒక కీలకమైన ప్రాథమిక వాస్తవాన్ని పూర్తిగా విస్మరిస్తోంది. బరిలో స్వయంగా తమ పార్టీ తరఫున అధికారిక అభ్యర్థి ఒకరు పోటీలో ఉన్నారన్న సంగతినే తాడేపల్లి వర్గాలు గాలికొదిలేశాయి. సొంత అభ్యర్థి గెలుపు కోసం వ్యూహాలు రచించి, క్షేత్రస్థాయిలో పార్టీ ఓటర్లను ఏకం చేయాల్సిన వైసీపీ.. ప్రత్యర్థి కూటమిని దెబ్బకొట్టే ఏకైక అజెండాతో స్వతంత్రంగా బరిలో ఉన్న ఏబీవీని భుజానకెత్తుకోవడం వారి రాజకీయ దివాలాకోరుతనానికి నిదర్శనం. గతంలో తమ ప్రభుత్వ హయాంలో ఏబీ వెంకటేశ్వరరావుపై తప్పుడు కేసులు బనాయించి, నిరంతరం వేధించిన వైసీపీ నేతలే.. నేడు రాజకీయ ప్రయోజనాల కోసం ఆయనకు అనుకూలంగా నెరేటివ్ నిర్మించేందుకు ప్రయత్నిస్తున్నారు .క్షేత్రస్థాయి రాజకీయ సమీకరణాలను నిశితంగా పరిశీలిస్తే.. వైసీపీ పన్నిన ఈ వల చివరకు వారికే ఉచ్చుగా మారే స్పష్టమైన సంకేతాలు కనిపిస్తున్నాయి.

కూటమి వర్గాల్లో కమ్మ, కాపు సామాజిక వర్గాలతో పాటు బీసీ, ఎస్సీ, ఎస్టీ ఓటర్లంతా పూర్తి సమన్వయంతో కూటమి అభ్యర్థి వంగవీటి వెంటే ఏకతాటిపై నిలబడుతున్నారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్ నాయకత్వంలో కూటమి ఓటు బ్యాంకు అత్యంత పటిష్టంగా ఉండటంతో.. ఎంతటి కుల రాజకీయాలు రేపినా కూటమి ఓట్లలో చీలిక తెచ్చే అవకాశమే లేదని తేలిపోయింది. కానీ, వైసీపీ చేస్తున్న పరోక్ష ప్రచారం వల్ల ఆ పార్టీకి చెందిన సంప్రదాయ ఓటర్లు, క్యాడర్ తీవ్ర గందరగోళానికి గురవుతున్నారు. సొంత పార్టీ నాయకత్వమే పరోక్షంగా ఏబీవీకి ప్రాధాన్యం ఇస్తుండటంతో.. వైసీపీ అభ్యర్థిపై నమ్మకం కోల్పోయిన ఆ పార్టీ కేడర్, ద్వితీయ శ్రేణి ఓటర్లు వైసీపీని కాదని నేరుగా ఏబీవీ వైపు మళ్లే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. అంటే కూటమి ఓట్లను చీల్చాలనుకున్న వైసీపీ పన్నాగం బూమరాంగ్ అయి.. చివరకు వైసీపీ సొంత ఓటు బ్యాంకే ఏబీవీ ఖాతాలోకి వెళ్లి, ఆ పార్టీ అభ్యర్థి డిపాజిట్ కూడా గల్లంతయ్యే దుస్థితి దాపురిస్తోంది.

కూటమి ఓట్లన్నీ సంపూర్ణంగా వంగవీటికే దక్కనుండగా.. ఇటు వైసీపీ ఓట్లు రెండుగా చీలిపోయి, ఏబీవీకి దక్కే పరోక్ష మద్దతుతో వైసీపీ సొంత చేతులతోనే తన గొయ్యి తాను తవ్వుకుంటున్న సెల్ఫ్ గోల్ వ్యవహారంగా మారుతోంది.

# సాయివర్షితకు ఏకంగా ఆరు ప్రభుత్వ ఉద్యోగాలు

కడప, అక్టోబరు 22, ఒక్క ఉద్యోగం సాధించడానికే కష్టపడుతున్న ఈ రోజుల్లో.. ఆ యువతి వరుసగా ఆరు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు. తొలి ప్రయత్నం సక్సెస్ కాకపోయినా మళ్లీ కష్టపడి చదివి అనుకున్నది సాధించారు కడప జిల్లా పులివెందులకు చెందిన చిదిగే సాయి వర్షిత అనిలాదేవి, గురుదత్త దంపతుల రెండో కుమార్తె చిదిగే సాయి వర్షిత పులివెందులలో టెన్త్ వరకు చదివారు.. అనంతరం ఇంటర్మీడియట్ హైదరాబాద్ ఎన్టీఆర్ జూనియర్ కాలేజీలో పూర్తి చేశారు. అనంతరం విశాఖపట్నంలోని దామోదరం సంజీవయ్య సెంట్రల్ లా యూనిర్శిటీలో చదివారు.. ఆమె న్యాయశాస్త్రంలో నాలుగు గోల్డ్ మెడల్స్ సాధించారు. సాయి వర్షిత ప్రభుత్వ ఉద్యోగాల కోసం ప్రిపేర్ అయ్యారు.. 2024లో మొదటిసారి స్టాఫ్ సెలెక్షన్ కమిషన్ పరీక్ష రాశారు. కానీ ప్రిలిమ్స్‌కు ఎంపికైనా మెయిన్స్‌లో సెలక్ట్ కాలేదు. ఓటమి నుంచి పాఠాలు నేర్చుకుని మళ్లీ కష్టపడి చదివారు. ఆ వెంటనే సాయి వర్షితకు కేంద్ర న్యాయశాఖలో వరుసగా ఉద్యోగాలు వచ్చాయి. సీనియర్ టెక్నికల్ అసిస్టెంట్, జూనియర్ టెక్నికల్ అసిస్టెంట్, జూనియర్ కోఆపరేటివ్ ఆఫీసర్, జూనియర్ అకౌంటెంట్, టెక్నికల్ క్లర్క్ పోస్టులు దక్కాయి. సాయి వర్షిత అక్కడితో ఆగలేదు.. కేంద్రం ప్రభుత్వంలో ఇంకా మంచి ఉద్యోగం సాధించాలనే పట్టుదలతో చదివారు. సాయి వర్షిత ఎస్ఎస్‌సీ సీజీఎల్ పరీక్షకు ప్రిపేర్ అయ్యారు.. ఈ పోస్టులు మొత్తం 412 ఉంటే.. దేశవ్యాప్తంగా ఏకంగా 28లక్షల15వేల445 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 13.77 లక్షల మంది పరీక్ష రాగాయ.. సాయి వర్షితకు ఇన్‌కంటాక్స్ డిపార్ట్‌మెంట్‌లో రీసెర్చ్ ఇన్‌స్పెక్టర్‌గా ఉద్యోగం సాధించారు. ఆమె ఈ నెల 19న బెంగళూరులో కేంద్ర మంత్రి శోభా కరంద్లాజే నుంచి నియామక పత్రం అందుకున్నారు. ప్రభుత్వ ఉద్యోగాల కోసం ప్రిపేర్ అయ్యేవారు ముందుగా ఓ టార్గె? పెట్టుకోవాలంటున్నారు సాయి వర్షిత. అన్ని అంశాలను పరిశీలించి.. సబ్జెక్టువారీగా చదవాలని సూచిస్తున్నారు. ఒక ప్రణాళిక ప్రకారం చదివితే ఉద్యోగం సాధించొచ్చంటున్నారు. ఒకవేళ ఏదైనా వైఫల్యం ఎదురైతే సమీక్షించుకుని ముందుకు సాగాలంటున్నారు.

# దసరా రికార్డులు...
# 18 లక్షల దర్శనాలు.. 36 లక్షల లడ్డూలు

విజయవాడ, అక్టోబరు 22, విజయవాడ శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వారి దేవస్థానంలో శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరిగాయ్. దసరా మహోత్సవాల సందర్భంగా శ్రీ కనకదుర్గ అమ్మవారి దర్శనార్థం భారీగా భక్తులు తరలివచ్చారు. లడ్డూ ప్రసాదం విక్రయాల్లో సరికొత్త రికార్డును నమోదు చేశాయి. దుర్గమ్మ దర్శనార్థం వచ్చిన లక్షల మంది భక్తులకు ఎటువంటి కొరత రాకుండా దేవాదాయ శాఖ కమిషనర్ పర్యవేక్షణతో దేవస్థానం పకడ్బందీ ప్రణాళికతో లడ్డూ ప్రసాదాన్ని అందుబాటులో ఉంచింది. ఉత్సవాలు ప్రారంభమైన అక్టోబర్ 11 నుంచి అక్టోబర్ 21 దసరా మరుసటి రోజువరకూ భక్తుల రద్దీ ఇలా ఉందిశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా 10 రోజులలో మొత్తం 15,05,359 మంది భక్తులు అమ్మవారిని దర్శించుకోగా.. అక్టోబర్ 21 రాత్రి 7 గంటల సమయానికి సుమారు 1,55,000 మంది భక్తులు దర్శనం చేసుకున్నారు. దీంతో ఇప్పటివరకు మొత్తం 11 రోజుల్లో కనకదుర్గమ్మను దర్శించుకున్న భక్తుల సంఖ్య 18,60,359 కి చేరింది. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా క్యూలైన్లలో పటిష్టమైన ఏర్పాట్లు, మంచినీరు, ప్రసాదం పంపిణీ నిరంతరాయంగా కొనసాగుతున్నాయి. భక్తులు దేవస్థాన నిబంధనలు పాటిస్తూ ప్రశాంతంగా దర్శనాలు పూర్తి చేసుకుంటున్నారు. ఈ ఏడాది ?దసరా శరన్నవరాత్రి మహోత్సవాల్లో లడ్డూ ప్రసాదం విక్రయాల్లో సరికొత్త రికార్డు...?10 రోజుల్లో రికార్డు స్థాయిలో 30,69,048 లడ్డూల విక్రయం జరిగింది. ఈ సంఖ్య గతేడాది కన్నా 7.49 లక్షలు అధికం. ఇక ?12వ రోజైన సాయంత్రం 6:00 గంటల వరకు 5,08,676 లడ్డూలు విక్రయం జరిగింది. ఇప్పటివరకూ విక్రయించిన లడ్డూల సంఖ్య 35,77,724. ?భక్తుల రద్దీకి అనుగుణంగా ఎలాంటి కొరత లేకుండా నిరంతరాయంగా లడ్డూ ప్రసాదం అందిస్తున్నారు దేవస్థానం అధికారులు.

# సిక్కోలులో విచిత్రం...
# టీడీపీ అభ్యర్థే..వైసీపీ మేయర్

శ్రీకాకుళం, అక్టోబరు 22, శ్రీకాకుళం టీడీపీ నేత గుండా లక్ష్మి దేవి పార్టీకి రాజీనామా చేశారు. మాజీ ఎమ్మెల్యే అయిన ఆమెకు గత ఎన్నికల్లో టిక్కెట్ నిరాకరించారు. కూటమి ప్రభుత్వంలో తను ఆశించిన ప్రాధాన్యత దక్కకపోవడం, పొత్తులో భాగంగా మేయర్ స్థానాన్ని జనసేనకు కేటాయించడంతో అసంతృప్తికి గురయ్యారు. అదే సమయంలో వైసీపీ నుంచి ఆమెకు మేయర్ ఆఫర్ వచ్చింది. మేయర్ టిక్కెట్ ఇస్తామని ఆశపెట్టడంతో పార్టీ మారాలని నిర్ణయించుకున్నారు. సుమారు 40 ఏళ్ల పాటు ఎన్టీఆర్ నుంచి చంద్రబాబు నాయకత్వం వరకు టీడీపీ అభివృద్ధి కోసం తన కుటుంబం అంకితమై పనిచేసిందని, అలాంటి పార్టీని ఇప్పుడు వీడాల్సి రావడం ఎంతో బాధగా ఉందని గుండ లక్ష్మీదేవి ఆవేదన వ్యక్తం చేశారు. తన భర్త, దివంగత మాజీ మంత్రి గుండ అప్పలసూర్యనారాయణ అడుగుజాడల్లో నడుస్తూ శ్రీకాకుళంలో పార్టీని కంటికి రెప్పలా కాపాడుకుంటూ వచ్చిన తనకు, కీలకమైన సమయంలో తగిన గుర్తింపు లభించలేదని ఆమె వాపోయారు. పార్టీ ఆవిర్భావం నుంచి కష్టపడిన తమను కాదంటూ స్థానికంగా కొందరు వ్యూహాత్మకంగా అణగదొక్కాలని చూశారని, ఈ అవమానాల భారాన్ని మోయలేకే పార్టీ వీడేందుకు సిద్ధమయ్యామని ఆమె తన సన్నిహితులు, అనుచరుల వద్ద ఆవేదన వెళ్లగక్కినట్లు తెలుస్తోంది. శ్రీకాకుళం మాజీ మంత్రి, వైసీపీ సీనియర్ నేత ధర్మాన ప్రసాదరావు రంగంలోకి దిగి గుండ లక్ష్మీదేవిని పార్టీలోకి ఆహ్వానించడంతో పాటు, శ్రీకాకుళం నగరపాలక సంస్థ మేయర్ అభ్యర్థిగా ఆమెను బరిలో దింపేందుకు రంగం సిద్ధం చేశారు. నగరంలో గుండ కుటుంబానికి ఉన్న బలమైన పట్టును, సామాజికవర్గ సమీకరణాలను దృష్టిలో ఉంచుకుని ఎన్నికల ఖర్చంతా పార్టీయే భరిస్తుందని హామీ ఇవ్వడంతో.. గుండ లక్ష్మీదేవి వైసీపీ కండువా కప్పుకోవడానికి ఆసక్తి చూపుతున్నట్లు సమాచారం. త్వరలోనే ఆమె తన అనుచరులతో విస్తృత సమావేశం నిర్వహించి అధికారికంగా ఫ్యాన్ పార్టీ గూటికి చేరనున్నట్లు తెలుస్తోంది.

విజయనగరంలో దెబ్బకు సిక్కోలులో రీవెంజ్

స్థానిక సంస్థల ఎన్నికల ముంగిట ఉత్తరాంధ్ర రాజకీయాలు ఆసక్తికరంగా మారాయి. బొత్స మేనల్లుడు మజ్జి శ్రీనును తమ పార్టీలో చేర్చుకోవడం ద్వారా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి టీడీపీ షాకిచ్చింది. మజ్జి శ్రీను పార్టీ మారడం విజయనగరం జిల్లాలో వైసీపీకి గట్టి షాక్ అని చెప్పొచ్చు. జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలో ఆయనకు అనుచరగణం ఉంది. మజ్జి శ్రీనుతోపాటు ద్వితీయ శ్రేణి నాయకులు కూడా టీడీపీలోకి వెళ్లారు. 2019 ఎన్నికల్లో విజయనగరం జిల్లాలో జగన్ పార్టీ క్లీన్‌స్వీప్ చేయడంలో ఈయన కీలక పాత్ర పోషించారు. పార్టీలో చేరగానే ఆయనకు అరకు లోక్ సభ టీడీపీ అబ్జర్వర్‌గా బాధ్యతలు అప్పగించారు. మజ్జి శ్రీనును చేర్చుకోవడం ద్వారా విజయనగరం జిల్లాలో వైసీపీని టీడీపీ దెబ్బకొడితే.. గుండ ఫ్యామిలీని తమవైపు తిప్పుకోవడం ద్వారా తెలుగుదేశం పార్టీకి శ్రీకాకుళంలో రివర్స్ షాక్ ఇవ్వడానికి వైసీపీ రెడీ అవుతోంది. శ్రీకాకుళం మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి టీడీపీకి రాజీనామా చేసి.. వైసీపీలో చేరబోతున్నారు. తెలుగు దేశం పార్టీతో గుండ ఫ్యామిలీకి 40 ఏళ్ల అనుబంధం ఉంది. 1982లో ఎన్టీఆర్ ఆహ్వానం మేరకు ఆమె భర్త గుండ అప్పల సూర్యనారాయణ టీడీపీలో చేరారు. అప్పల సూర్యనారాయణ వరుసగా నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. ఆయన మంత్రిగానూ పని చేశారు. 1985, 1989, 1994, 1999ల్లో ఆయన శ్రీకాకుళం ఎమ్మెల్యేగా గెలిచారు. అయితే 2004, 2009 ఎన్నికల్లో ధర్మాన ప్రసాద రావు చేతిలో ఆయన ఓడిపోయారు. 2014 ఎన్నికల్లో అప్పల సూర్యనారాయణ సతీమణి లక్ష్మీదేవి ఎమ్మెల్యేగా గెలిచారు. 2019 ఎన్నికల్లో ఆమె ఓటమిపాలవగా.. 2024 ఎన్నికల్లో ఆమెకు టికెట్ కేటాయించలేదు. అప్పల సూర్యనారాయణ అనుచరుడిగా వ్యవహరించిన గొండు శంకర్‌కు టీడీపీ టికెట్ దక్కగా, ఆయన ఎమ్మెల్యేగా గెలిచారు. 2026 జనవరి 12న అప్పల సూర్యనారాయణ కన్నుమూశారు. శ్రీకాకుళంలో రెండు చోట్ల ఆయన విగ్రహం ఏర్పాటు చేస్తామని తన కుమారులు చంద్రబాబు నాయుణ్ని కలిసి కోరారని.. పార్టీ అధినేత అంగీకరించినా, విగ్రహం ఏర్పాటు చేయనీయలేదని లక్ష్మీదేవి వాపోయారు. 40 ఏళ్లుగా పార్టీలో ఉంటున్న తమను అవమానాలకు గురి చేస్తున్నారని, తట్టుకోలేకే తాను పార్టీకి రాజీనామా చేస్తున్నానని ఆమె ప్రకటించారు. గుండ లక్ష్మీదేవి తన అనుచరులతో కలిసి వైఎస్సార్సీపీలో చేరబోతున్నారని ధర్మాన ప్రసాద రావు ఇప్పటికే బహిరంగంగా ప్రకటించారు. 50 వేల మంది అనుచరులతో ఆమె వైసీపీలోకి రాబోతున్నారన్నారు. గుండ లక్ష్మీదేవి ధర్మాన బ్రదర్స్‌కు వరుసకు సోదరి అవుతారు. టీడీపీలో గుండ ఫ్యామిలీ అసంతృప్తితో ఉన్న విషయాన్ని గమనించిన ధర్మాన ఆమెను వైసీపీలోకి ఆహ్వానించారని తెలుస్తోంది. గుండ లక్ష్మీదేవి వైసీపీలో చేరితే ఆమెకు మేయర్ టికెట్ ఇస్తామని.. ఖర్చు మొత్తం తామే భరిస్తామని ధర్మాన హామీ ఇచ్చినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. కోర్టు కేసు కారణంగా శ్రీకాకుళం కార్పొరేషన్ ఎన్నికలు ఇప్పుడు జరగడం లేదు. అంతేకాదు 2029 ఎన్నికల్లో ఆమె చిన్నకుమారుడు గుండ విశ్వనాథ్‌కు శ్రీకాకుళం ఎంపీ టికెట్ కూడా ఇచ్చే అవకాశం ఉందని సమాచారం.

శ్రీకాకుళం మేయర్ రేసులో వైసీపీ తరఫున గుండ లక్ష్మీదేవి నిలబడితే.. కూటమి అభ్యర్థికి గట్టిపోటీ ఎదురయ్యే అవకాశం ఉంది. శ్రీకాకుళంలో గుండ ఫ్యామిలీకి మంచి పట్టు ఉంది. మరోవైపు స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి సీట్ల పంపకాల్లో భాగంగా శ్రీకాకుళం మేయర్ స్థానాన్ని జనసేనకు కేటాయించారు.

టీడీపీ ఓటు బ్యాంక్ పూర్తిగా జనసేనకు బదిలీ అవుతుందా అనేది ఒక ప్రశ్న. అలాగే గుండ లక్ష్మీదేవి వెంట ఆమె అనుచరగణం కూడా పార్టీ మారితే.. టీడీపీ ఓటు బ్యాంకుకు కూడా గండిపడుతుంది.

ఈ రెండూ జనసేన అభ్యర్థికి పడే ఓట్లను ప్రభావితం చేసే అవకాశం ఉంది. అంటే విజయనగరంలో వైసీపీకి టీడీపీ షాకిస్తే.. జగన్ పార్టీ దానికి శ్రీకాకుళం బదులు తీర్చుకోనుందన్నమాట. ఈ రెండు పార్టీల వ్యూహాలు, ప్రతివ్యూహాలతో ఉత్తరాంధ్ర రాజకీయం రసవత్తరంగా మారుతోంది. అయితే ఈ పరిణామాలు శ్రీకాకుళం మేయర్‌గా పోటీ చేయనున్న జనసేనను టెన్షన్ పెట్టే అవకాశం ఉంది.

# సల్మాన్ ఖాన్ తర్వాత అమితాబ్ బచ్చన్, అక్షయ్ కుమార్‌లేనట!

ముంబై, అక్టోబరు 22, బాలీవుడ్ ఇండస్ట్రీలో సంచలనం సృష్టించిన టైగర్ ష్రాఫ్ కాల్పుల ఘటన దర్యాప్తులో పోలీసులు కీలక విషయాలు రాబట్టారు. రాజస్థాన్‌లోని కోటా నుంచి ముంబయికి తరలిస్తున్న సమయంలో నిందితులు పోలీసుల ఎదుట విస్మయకరమైన నిజాలు ఒప్పుకున్నారు. వాస్తవానికి ఈ ముగ్గురు దుండగుల ప్రధాన టార్గెట్ బాలీవుడ్ సూపర్‌స్టార్ సల్మాన్ ఖాన్ అని తేలింది. ముంబయిలోని బాంద్రాలో ఉన్న సల్మాన్ నివాసం వద్ద నిందితులు పలుమార్లు రెక్కీ నిర్వహించి, ఆయన కదలికలను క్షుణ్ణంగా ట్రాక్ చేశారు. అయితే సల్మాన్ ఖాన్ చుట్టూ ఉన్న భారీ, పటిష్టమైన భద్రతా వలయాన్ని చూసి వారు సమీపించలేకపోయారు. కేవలం సల్మాన్ మాత్రమే కాకుండా అక్షయ్ కుమార్, అమిర్ ఖాన్, లెజెండరీ నటుడు అమితాబ్ బచ్చన్ ఇళ్ల వద్ద కూడా వీరు రెక్కీ నిర్వహించినట్లు దర్యాప్తులో బయటపడింది. సల్మాన్ ఖాన్ వద్ద భద్రత కట్టుదిట్టంగా ఉండటంతో.. సులభంగా టార్గెట్ చేయగల సెలబ్రిటీ కోసం దుండగులు అన్వేషించారు. ఈ క్రమంలోనే నటుడు టైగర్ ష్రాఫ్ జుహూలోని ఫుట్‌బాల్ గ్రౌండ్‌కు క్రమం తప్పకుండా వస్తాడని, అక్కడ ఆయనకు సెక్యూరిటీ తక్కువగా ఉంటుందని కొందరు సోషల్ మీడియాలో రీల్స్ చేయడంతో ఈ విషయాన్ని గుర్తించారు. అయితే దాడి జరగడానికి వారం రోజుల ముందే అంటే అక్టోబర్ 11వ తేదీన సదరు ముగ్గురు నిందితులు ఆ ఫుట్‌బాల్ మైదానానికి వెళ్లి రెక్కీ నిర్వహించారు. ఆ రోజు టైగర్ ష్రాఫ్ అక్కడ అందుబాటులో లేకపోవడంతో దాడి వాయిదా పడింది. చివరకు అక్టోబర్ 18వ తేదీన జుహూ ప్రాంతంలో టైగర్ ష్రాఫ్ కారును లక్ష్యంగా చేసుకుని దుండగులు కాల్పులకు తెగబడ్డారు. ఈ ఘటనలో అదృష్టవశాత్తూ నటుడు ప్రమాదం నుంచి తప్పించుకోగలిగారు. కోటాలో అదుపులోకి తీసుకున్న నిందితులను అక్టోబర్ 21వ తేదీన తెల్లవారుజామున ముంబయికి తీసుకువచ్చి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కేసుకు సంబంధించి లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌తో సంబంధం ఉన్నట్లు భావిస్తున్న అనిల్ పండిట్ పాత్రపై, అలాగే అసలు సూత్రధారి ఎవరనే దానిపై ముంబయి పోలీసులు తీవ్రస్థాయిలో విచారణ జరుపుతున్నారు. మరోవైపు ఈ పరిణామాలపై స్పందించిన అనుభవజ్ఞుడైన ప్రముఖ గాయకుడు అనూప్ జలోటా.. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించాలంటే సల్మాన్ ఖాన్ బిష్ణోయ్ సంఘానికి బహిరంగంగా క్షమాపణలు చెప్పాలని సూచించారు. లేకపోతే బిష్ణోయ్ వర్గం నుంచి ఇలాంటి దాడులు కొనసాగే ప్రమాదం ఉందని, సల్మాన్‌తో కలిసి పనిచేయాలనుకునే వారి కుటుంబాలు కూడా భయందోళనలో బతకాల్సి వస్తుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

# దసరా వేళ మద్యం
# అమ్మకాల్లో సరికొత్త రికార్డు

హైదరాబాద్ తెలంగాణ లో దసరా పండగ రోజుల్లో లిక్కర్ ఏరులై పారింది. దసరాకు ముందు నాలుగు పనిదినాల్లోనే రూ.755.14 కోట్ల మద్యం విక్రయాలు రికార్డ్ అయ్యాయి. గతేడాది దసరా అమ్మకాలతో పోలిస్తే రూ.57.91 కోట్ల పెరుగుదల నమోదయింది. అక్టోబర్ 1 నుంచి 19 వరకు రాష్ట్రవ్యాప్తంగా రూ.2,054.51 కోట్ల అమ్మకాలు జరిగాయి. అక్టోబర్ 19న ఒక్కరోజే రూ.303.40 కోట్ల విలువైన మద్యం విక్రయాలు జరిగాయి. 19 రోజుల్లో 18.38 లక్షల కేసుల లిక్కర్, 30.37 లక్షల కేసుల బీర్ అమ్మకాలు జరిగినట్లు అధికారులు వెల్లడించారు. గతేడాది ఇదే కాలంతో పోలిస్తే లిక్కర్, బీర్ విక్రయాల్లో భారీ పెరుగుదల. రాష్ట్రవ్యాప్తంగా 2,620 వైన్ షాపులు, సుమారు 1,200 బార్లు, రెస్టారెంట్ల ద్వారా అమ్మకాలు జరిగాయి. మరోవైపు, పల్లెల్లో బెల్టు షాపుల ద్వారా భారీగా మద్యం విక్రయాలు జరిగినట్లు సమాచారం

# కాక్రోచ్ పార్టీకి దీపావళి సెలవులు

న్యూఢిల్లీ, అక్టోబరు 22, కాక్రోచ్ జనతా పార్టీ లీడర్లు దీపావళి వరకూ సెలవులు ప్రకటించుకున్నారు. అప్పటి వరకూ ఎలాంటి ఆందోళనలు చేయబోమని దీప్కే ప్రకటించారు. ఈ ప్రకటనలకు కారణం వారి అంతర్గత నిస్సహాయతే ప్రధాన కారణమని సులువుగానే అర్థం చేసుకోవచ్చు. పార్టీ కీలక నాయకులు దాస్, రాంకా లాంటి వారు ఊహించని విధంగా జైలుపాలు కావడంతో కేడర్‌లో నైతిక స్థైర్యం పూర్తిగా దెబ్బతింది. అగ్రనేతల వెంటే ఉండి నడిపించాల్సిన ముఖ్యులే కటకటాల వెనక్కి వెళ్లేసరికి, రోడ్డెక్కి వారి కోసం పోరాడే దిక్కులేక శ్రేణులంతా ఎవరికి వారు సర్దుకుపోయి సైలెంట్ అయ్యారు.ఈ సంక్షోభ సమయంలో పార్టీకి అండగా నిలవాల్సిన ప్రకాష్ రాజ్ వంటి ప్రముఖులు సైతం ఎవరి దారి వారు చూసుకుంటున్నారు. నటుడు ప్రకాష్ రాజ్ సైతం వివాదాలకు దూరంగా ఒక వీడియోను విడుదల చేసి, తన వ్యక్తిగత పనుల్లో తాను బిజీ అయిపోయారే తప్ప పార్టీ కోసం క్షేత్రస్థాయిలో గళం విప్పే సాహసం చేయడం లేదు. పండుగ తర్వాత కూడా ఈ కాక్రోచ్‌లను సీరియస్‌గా పట్టించుకునే నాథుడే ఉండరు. ఒకప్పుడు హడావుడి చేసిన ఈ వర్గాన్ని, దేశంలోని జెన్-జీ యువత ఎప్పుడో పక్కనబెట్టి విడాకులు ఇచ్చేసింది. మారుతున్న ట్రెండ్స్, యువత ఆలోచనా విధానానికి తగినట్లుగా మారలేకపోవడంతో ఆ పార్టీ పూర్తిగా ఐసోలేట్ అయిపోయింది.కాక్రోచ్ జనతా పార్టీ ర్గాలన్నీ కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీ వంటి ప్రత్యామ్నాయ రాజకీయ శక్తుల అనుబంధ సభ్యులుగా, సానుభూతిపరులుగా మారిపోయారనేది పరిశీలకుల మాట. తాత్కాలిక హంగామాతో సోషల్ మీడియాలో ట్రెండ్ కావచ్చె?మో కానీ, గ్రౌండ్ రియాలిటీలో నిలకడ లేని ఇలాంటి రాజకీయ ప్రయో గాలు ఎక్కువ కాలం మనుగడ సాగించలేవని మరోసారి రుజువవుతోంది. నాయకుల అరెస్టులు, మద్దతుదారుల వెను కంజతో కాక్రోచ్ జనతా పార్టీ భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారింది. దీపావళి తర్వాత హడావుడి చేద్దామనుకున్న ఆ పార్టీ వ్యూహాలు ఇక పారకపోవచ్చు. ప్రభుత్వం వీరిపై వ్యతిరేకత పెంచడమే కాదు.. ఇదే అదనుగా కఠినంగా వ్యవహరించనుంది. శాంతిభద్రత లకు విఘాతం కలిగించబోమని వీరి వద్ద బాం డ్లు తీసుకుని దాన్నే వారి చేతులు కట్టే యడానికిఅవకాశంగాఉపయోగించు కుంటున్నారు.

మీరు జెన్ జీనా...

కాక్రోచ్ జనతా పార్టీ నాయకులు సౌరవ్ దాస్, అశుతోష్ రంకాలకు సంబంధించిన పిటిషన్‌పై బుధవారం విచారణ సందర్భంగా ఢిల్లీ హైకోర్టులో ఒక ఆసక్తికర సన్నివేశం చోటుచేసుకుంది. జస్టిస్ సుబ్రమణ్యం ప్రసాద్ ధర్మాసనం వారి వయస్సును తెలుసుకున్న తర్వాత ఆ ఇద్దరు నాయకులు 'జెన్ జీ' కిందకు రారని వ్యాఖ్యానించారు. విచారణ సందర్భంగా.. పిటిషనర్ల తరఫున హాజరైన లాయర్ అభీక్ చిమ్నాని ఆ ఇద్దరు నాయకుల వయస్సు ఎంత అని జస్టిస్ ప్రసాద్ ప్రశ్నించారు. దాస్‌కి 27 ఏళ్లు, రంకాకి 32 ఏళ్లు అని న్యాయవాది కోర్టుకు తెలిపారు. "అలాగైతే మీరు జెన్ జీ కాదు. ఇంతకీ జెన్ జీ అంటే ఏమిటి?" అని కోర్టు ప్రశ్నించింది.సాధారణంగా 1997 తర్వాత జన్మించిన వారిని 'జెన్ జీ ' అని పిలుస్తారని తెలియజేయగా.. 'అలాంటప్పుడు మీరు జెన్ జీ కారనేది స్పష్టం' అని కోర్టు పునరుద్ఘాటించింది. పిటిషనర్ల జుడీషియల్ కస్టడీని అక్టోబర్ 21 వరకు పొడిగిస్తూ స్పెషల్ ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ ఇచ్చిన ఉత్తర్వులను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌ను విచారిస్తున్న సమయంలో ఈ వ్యాఖ్యలు వెలువడ్డాయి. ఈ సంభాషణ సోషల్ మీడియాలో కూడా చర్చనీయాంశమైంది. ప్రధాని మోదీ ఫోటోను సీజేపీ నాయకుడు అభిజీత్ దీప్కే పోస్ట్ చేస్తూ.. "జెన్ జీ అర్హత ఉన్న ఏకైక వ్యక్తి ఈయనే" అని రాసుకొచ్చారు.మేజిస్ట్రేట్ ఉత్తర్వులను సవాలు చేయడానికి 'రివిజన్' అనే ప్రత్యామ్నాయ మార్గం అందుబాటులో ఉన్నప్పుడు, రాజ్యాంగంలోని ఆర్టికల్ 226 ప్రకారం నేరుగా హైకోర్టును ఎందుకు ఆశ్రయించారని కోర్టు ప్రశ్నించింది. "ఇది మీ రెండో సంఘటన.. మీరు గతంలో పూచీకత్తు నిబంధనలను ఉల్లంఘించారు. మీ అసలు పరిష్కారం రివిజన్ పిటిషన్‌లోనే ఉంది" అని కోర్టు వ్యాఖ్యానించింది.శాంతి భద్రతల నిబంధనలను రెండోసారి ఉల్లంఘించినప్పుడు కఠినమైన షరతులను విధించే హక్కు అధికారులకు ఉంటుందా లేదా అని కూడా ధర్మాసనం ప్రశ్నించింది. జంతర్ మంతర్‌ను ధర్నా చౌక్‌గా తొలగించడాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్ సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉందని, ఆ నోటిఫికేషన్‌పై ఎలాంటి స్టే లేదని కోర్టు గుర్తుచేసింది. అటువంటి పరిస్థితుల్లో పిటిషనర్లు మళ్లీ ఆ ప్రాంతానికి వెళ్లడంపై సందేహం వ్యక్తం చేసింది.

# మహానగరాల్లో భారీగా పెరుగుతున్న అద్దెలు

హైదరాబాద్, అక్టోబరు 22, దేశంలోని ప్రముఖ ఐటీ, వాణిజ్య మహానగరాలైన హైదరాబాద్, బెంగళూరు తదితర ప్రాంతాల్లో నివసిస్తున్న ఉద్యోగులు, వలస కుటుంబాలకు అద్దె ఇళ్ల నిర్వహణ ఓ పెద్ద పీడకలగా మారుతోంది. కరోనా అనంతరం వర్క్ ఫ్రమ్ హోమ్ నిబంధనలు తొలగిపోయి, దాదాపు అన్ని ప్రైవేట్, ఐటీ కంపెనీలు వర్క్ ఫ్రమ్ ఆఫీస్ ను తప్పనిసరి చేయడంతో ఒక్కసారిగా అద్దె ఇళ్లకు డిమాండ్ విపరీతంగా పెరిగింది. ఇదే అవకాశంగా భావించిన ఇంటి యజమానులు అడ్డగోలుగా అద్దెలు పెంచేయడమే కాకుండా, సెక్యూరిటీ డిపాజిట్ల పేరుతో భారీగా నిధులు దండుకుంటున్నారు. హైదరాబాద్‌లోని గచ్చిబౌలి, కొండాపూర్, మాదాపూర్, తెల్లాపూర్ వంటి ఐటీ కారిడార్లలో సాధారణ ఫ్లాట్లకు కూడా గతంలో కంటే 30 నుంచి 50 శాతం వరకు అద్దెలు పెంచేశారు. ఇక బెంగళూరు పరిస్థితి మరింత దారుణంగా మారింది. అక్కడ రెండు లేదా మూడు నెలల అద్దెను డిపాజిట్‌గా తీసుకోవడానికి బదులుగా, ఏకంగా 6 నుంచి 10 నెలల అద్దెను ముందస్తు అడ్వాన్స్ లేదా సెక్యూరిటీ డిపాజిట్ గా చెల్లించాలని యజమానులు నిబంధనలు విధిస్తున్నారు. ఒక్క ఇల్లు అద్దెకు తీసుకోవాలంటేనే లక్షల్లో అడ్వాన్స్ సొమ్ము సిద్ధం చేసుకోవాల్సి రావడం సగటు మధ్యతరగతి ఐటీ ఉద్యోగి బడ్జెట్‌ను తలకిందులు చేస్తోంది.కేవలం డిపాజిట్లు మాత్రమే కాకుండా, ఖాళీ చేసి వెళ్లే సమయంలో ఇంటి యజమానులు చేసే మెయింటెనెన్స్ కోతలు, డిపాజిట్ సొమ్మును తిరిగి ఇవ్వకుండా వేధించే ఘటనలు నిత్యకృత్యమయ్యాయి.

చిన్నచిన్న కారణాలు చూపిస్తూ డిపాజిట్‌లో సగానికి పైగా సొమ్మును కట్ చేసుకోవడం, పెయింటింగ్, గీతలు పడ్డాయంటూ వేలల్లో కోతలు విధించడంపై సోషల్ మీడియా వేదికగా అద్దెదారులు తమ ఆవేదనను వెళ్లగక్కుతున్నారు. ప్రభుత్వాలు తగిన అద్దె నియంత్రణ చట్టాలను పకడ్బందీగా అమలు చేయకపోవడం వల్లే యజమానుల రాక్షసానందం, ఏకపక్ష వైఖరి హద్దులు దాటుతోందని వినియోగదారుల హక్కుల సంఘాలు మండిపడుతున్నాయి.ఐటీ ఉద్యోగులు తమ జీతంలో దాదాపు 40 శాతం కేవలం అద్దెలకే వెచ్చించాల్సి వస్తోందని, దీనివల్ల పొదుపు చేసుకునే అవకాశమే లేకుండా పోతోందని ఆందోళన చెందుతున్నారు. పెరుగుతున్న అద్దెలు, అన్యాయమైన సెక్యూరిటీ డిపాజిట్ల ధోరణిని అరికట్టేందుకు ఐటీ కారిడార్లలో టెనెన్సీ యాక్ట్‌ను కఠినంగా అమలు చేయాలని, యజమానులు ఏకపక్షంగా అద్దెలు పెంచకుండా గరిష్ఠ పరిమితి విధించాలని ఐటీ సంఘాలు ప్రభుత్వాన్ని కోరుతున్నాయి.

# 21 రోజుల్లో 2400 కోట్ల మద్య విక్రయాలు

హైదరాబాద్, అక్టోబరు 22, తెలంగాణలో దసరా పండుగ సీజన్‌లో మద్యం విక్రయాలు గణనీయంగా పెరిగాయి. ఎక్సైజ్ శాఖ గణాంకాల ప్రకారం 21 రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా రూ.2,454.51 కోట్ల విలువైన మద్యం అమ్ముడైంది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే అమ్మకాల విలువ 37.02 శాతం పెరిగింది. బీర్ల విక్రయాలు 30.37 లక్షల కేసులకు చేరగా.. గత ఏడాదితో పోలిస్తే 8.82 లక్షల కేసులు అదనంగా అమ్ముడయ్యాయి. బీర్ల అమ్మకాల్లో 40.93 శాతం.. మద్యం విక్రయాల్లో 29.80 శాతం వృద్ధి నమోదైంది. అక్టోబర్ 19న ఒక్కరోజే రూ.303.40 కోట్ల విలువైన మద్యం విక్రయాలు జరిగాయి.తెలంగాణలో దసరా పండుగ సీజన్ మద్యం వ్యాపారానికి భారీ ఊతమిచ్చింది. అక్టోబర్ మొదటి 19 రోజుల్లోనే రాష్ట్రవ్యాప్తంగా రూ.2,054.51 కోట్ల విలువైన మద్యం విక్రయాలు నమోదు అయ్యాయి. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే అమ్మకాల విలువ 37.02 శాతం పెరిగినట్లు ఎక్సైజ్ శాఖ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ముఖ్యంగా బీర్ల విక్రయాల్లో గణనీయమైన పెరుగుదల కనిపించగా.. అక్టోబర్ 19వ తేదీన ఒక్కరోజే రూ.303.40 కోట్ల విలువైన మద్యం అమ్ముడవడం గమనార్హం.తెలంగాణ ఎక్సైజ్ శాఖ వెల్లడించిన వివరాల ప్రకారం.. 2026 అక్టోబర్ 1వ తేదీ నుంచి 21వ తేదీ వరకు తెలంగాణలో మద్యం అమ్మకాల విలువ రూ.2,454.51 కోట్లకు చేరింది. గత ఏడాది ఇదే సమయంలో నమోదైన విక్రయాలతో పోలిస్తే ఈసారి 37.02 శాతం వృద్ధి నమోదైంది. పండుగల నేపథ్యంలో మద్యం కొనుగోళ్లు పెరగడం ఈ గణాంకాల్లో ప్రతిబింబిస్తోంది. ఈ నెల ప్రారంభంలో అమ్మకాలు కొంత నెమ్మదిగా సాగినప్పటికీ.. రెండో వారం నుంచి విక్రయాలు భారీగా పెరిగినట్లు లెక్కలు చెబుతున్నాయి.

# కాకినాడ జిల్లాలో ఘోర ప్రమాదం..
# నలుగురు భవాని భక్తులు మృతి

కాకినాడ జిల్లా శంఖవరం మండలం కత్తిపూడి వద్ద జాతీయ రహదారి-16పై ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. విజయనగరం జిల్లా నుంచి విజయవాడకు వెళ్తున్న భవాని మాలధారుల బస్సు , మరమత్తులకోపం నిలిచిపోయింది. టీ తాగేందుకు రోడ్డు పక్కకు వెళ్లిన భక్తులను స్కార్పియో కారు వేగంగా వచ్చి ఢీకొట్టింది. ప్రమాదంలో నలుగురు అక్కడికక్కడే మృతి చెందారు. మరొకరికి గాయాలు అయ్యాయి. మృతులంతా విజయనగరం జిల్లా డెంకాడ గ్రామానికి చెందినవారిగా గుర్తించారు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు.

# సొంత పార్టీ గెలుపుపై అపనమ్మకం ?

హైదరాబాద్, అక్టోబరు 22, ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ ప్రతిష్ఠాత్మకంగా తలపెట్టిన మహా గర్జన భారీ బహిరంగ సభ వేదిక ఆకస్మికంగా హైదరాబాద్ నుంచి నవంబర్ 1న ఢిల్లీలోని చారిత్రాత్మక రామ్‌లీలా మైదానానికి మారింది. తొలత ఈ జాతీయ స్థాయి శక్తి ప్రదర్శనను తెలంగాణ రాజధాని హైదరాబాద్ వేదికగా నిర్వహించాలని భావించినప్పటికీ, అనూహ్యంగా వ్యూహాన్ని మార్చుకుని జాతీయ రాజధాని వైపు కాంగ్రెస్ అగ్రనాయకత్వం అడుగులు వేసింది. దీంతో తెలంగాణలోని గ్రామస్థాయి సర్పంచ్‌ల నుంచి శాసనసభ్యులు, ఎంపీలు , మంత్రుల దాకా అధికార యంత్రాంగం, పార్టీ కేడర్ అంతా హస్తిన బాట పట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ భారీ తరలింపు బాధ్యతను ఏఐసీసీ నేరుగా తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు బి. మహేష్ కుమార్ గౌడ్ భుజస్కంధాలపై మోపడం రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది.ముందుగా అనుకున్నట్లుగా హైదరాబాద్‌లో ఈ సభను నిర్వహించకుండా చివరి నిమిషంలో వెనక్కి తగ్గడం వెనుక బలమైన రాజకీయ, ఆత్మరక్షణ కారణాలు ఉన్నాయనే ప్రచారం జోరందుకుంది. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ పూర్తి మెజారిటీతో అధికారంలో ఉన్న తరుణంలో.. స్వయంగా తమ సొంత పాలన సాగుతున్న రాజధానిలోనే జాతీయ స్థాయి నిరసన లేదా ఆందోళన సభను నిర్వహిస్తే, అది విపక్షాలకు బలమైన రాజకీయ అస్త్రంగా మారే ప్రమాదం ఉందనే అభిప్రాయం వ్యక్తమైంది. "అధికారంలో ఉండి కూడా హైదరాబాద్‌లో సభ పెడుతున్నారంటే మీ ప్రభుత్వ గెలుపుపై మీకే నమ్మకం లేదా?" అని బీఆర్ఎస్, బీజేపీలు ప్రశ్నించే అవకాశం ఉందనే ఉద్దేశంతోనే కాంగ్రెస్ అధిష్ఠానం ఈ వెనకడుగు వేసినట్లు విశ్లేషకులు భావిస్తున్నారు.మరోవైపు, తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటై మూడేళ్లు గడుస్తున్న సమయంలో క్షేత్రస్థాయిలో రైతుల ఎల్ నినో నష్టపరిహారం, పవర్ ట్రూ-అప్ ఛార్జీల వడ్డన , మూసీ ప్రక్షాళన వంటి అంశాలపై ప్రజల నుంచి వ్యక్తమవుతున్న అసంతృప్తి కూడా ఈ నిర్ణయంపై ప్రభావం చూపినట్లు తెలుస్తోంది. హైదరాబాద్‌లో సభ పెడితే జనసమీకరణలో ఏమాత్రం లోటుపాట్లు జరిగినా, లేదా ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేకత ఉందని విపక్షాలు ట్రోల్ చేసినా అది వీసీసీ విజయంపైనే పెను సందేహాలను రేకెత్తిస్తుంది. అందుకే, అధికారంలో ఉన్న సొంత గడ్డపై ఎలాంటి రిస్క్ తీసుకోకుండా సభను నేరుగా కేంద్రంపై ఒత్తిడి పెంచేందుకు ఢిల్లీకి తరలించడమే సురక్షితమైన మార్గమని భావించారు. ఢిల్లీ రామ్‌లీలా మైదాన్‌లో జరగనున్న ఈ మహా గర్జన కు ఇండియా కూటమి భాగస్వామ్య పక్షాలను సైతం సమీకరిస్తుండటంతో, దీని ప్రాధాన్యత జాతీయ స్థాయికి చేరింది. కేంద్రంలోని మోదీ ప్రభుత్వ విధానాలు, దర్యాప్తు సంస్థల దుర్వినియోగం , నిరుద్యోగం వంటి అంశాలపై ఏఐసీసీ సమరశంఖం పూరిస్తోంది. ఈ క్రమంలోనే దక్షణాది నుంచి ముఖ్యంగా కాంగ్రెస్ అధికారంలో ఉన్న తెలంగాణ నుంచి భారీ ఎత్తున జనసమీకరణ చేసి ఢిల్లీ పీఠాన్ని కదిలించాలని రేవంత్ రెడ్డి సర్కార్‌పై ఏఐసీసీ భారం మోపింది. తెలంగాణ కాంగ్రెస్ కేడర్‌ను హస్తినకు తరలించే బాధ్యతను పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. రాష్ట్రం నుంచి ప్రతి నియోజకవర్గం నుంచి ప్రత్యేక రైళ్లు, బస్సులు ఏర్పాటు చేసి పదివేల మందికి పైగా ద్వితీయ శ్రేణి నేతలు, సర్పంచ్‌లు, కౌన్సిలర్లను ఢిల్లీకి తరలించేందుకు రూట్ మ్యాప్ సిద్ధం చేశారు. మంత్రులు, సీనియర్ ఎమ్మెల్యేలు కచ్చితంగా తమ అనుచరగణంతో ఢిల్లీలో హాజరవ్వాలని ఇప్పటికే అంతర్గత ఆదేశాలు జారీ అయ్యాయి. దీనివల్ల హైదరాబాద్‌లో నిర్వహించాల్సిన భారాన్ని ఢిల్లీ తరలింపు ద్వారా భుజాన వేసుకున్నట్లయిందిహైదరాబాద్ సభ రద్దు వెనుక సొంత ప్రభుత్వ ప్రతిష్టను కాపాడుకునే డిఫెన్సివ్ వ్యూహం ఉన్నప్పటికీ, ఢిల్లీలో జాతీయ స్థాయి పవర్ షో ద్వారా రేవంత్ రెడ్డి సర్కార్ తన పట్టును అధిష్టానానికి నిరూపించుకోవడానికి ఇది ఒక అవకాశంగా మారింది. సొంత రాజధానిలో సభ పెట్టి ఉంటే వచ్చే విమర్శల నుంచి తప్పించుకున్న కాంగ్రెస్, ఇప్పుడు హస్తినలో ఏ స్థాయిలో జన సమీకరణ చేసి తన శక్త్యనుయుక్తులను నిరూపించుకుంటుందో నవంబర్ 1 నాటి మహా గర్జన స్పష్టం చేయనుంది.

# డంపింగ్ యార్డ్ విముక్తి కోసం
# ఈటెల యాక్షన్ ప్లాన్... 27 నుంచి పాదయాత్ర

హైదరాబాద్, అక్టోబరు 22, జవహర్‌నగర్ డంపింగ్ యార్డును మరో ప్రాంతానికి తరలించాలని డిమాండ్ చేస్తూ మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ పాదయాత్ర చేపట్టనున్నారు. ఈనెల 23న డంపింగ్ యార్డు బాధితులతో.. 25న మేధావులు, పర్యావరణవేత్తలతో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించనున్నారు. ఏళ్లుగా కొనసాగుతున్న దుర్వాసన, గాలి-నీటి కాలుష్యం, చెత్త నిల్వలు, మిథేన్ ఉద్గారాలపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రత్యామ్నాయ చెత్త నిర్వహణ కేంద్రాలు, పర్యావరణ పరిరక్షణ చర్యలు, ప్రజారోగ్య భద్రతపై ప్రభుత్వం స్పష్టమైన ప్రణాళిక ప్రకటించాలన్న డిమాండ్ ఈ పాదయాత్రతో మరింత బలపడే అవకాశం ఉంది. హైదరాబాద్‌లో జవహర్‌నగర్ డంపింగ్ యార్డు తరలింపుపై పోరాటాన్ని మరింత ఉధృతం చేసేందుకు బీజేపీ సీనియర్ నేత, మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ రెడీ అయ్యారు. ఏళ్ల తరబడి దుర్వాసన, కాలుష్యం, ఇతర సమస్యలతో ఇబ్బందులు పడుతున్న స్థానిక ప్రజలకు మద్దతుగా ఈ నెల 27వ తేదీ నుంచి పాదయాత్ర చేపట్టనున్నట్లు ప్రకటించారు. డంపింగ్ యార్డును అక్కడి నుంచి మరో ప్రాంతానికి తరలించాలన్న డిమాండ్‌తో ఈ పాదయాత్ర కొనసాగనుంది. ఈ సమస్యపై ప్రజల్లో అవగాహన పెంచడంతో పాటు రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడమే లక్ష్యంగా ఎంపీ ఈటల రాజేందర్ అడుగులు వేస్తున్నారు. జవహర్‌నగర్ డంపింగ్ యార్డు సమస్యపై కార్యాచరణ రూపొందించేందుకు ఈటల రాజేందర్ ముందుగా బాధితులతో సమావేశం కానున్నారు.ఈ నెల 23వ తేదీన స్థానిక ప్రజలతో సమావేశమై వారి సమస్యలు, అభిప్రాయాలను ఈటల తెలుసుకోనున్నారు. ఆ తర్వాత ఈ నెల 25వ తేదీన డంపింగ్ యార్డు ప్రాంతంలోనే మేధావులు, పర్యావరణవేత్తలు, బాధితులతో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. డంపింగ్ యార్డు నుంచి వెలువడుతున్న మిథేన్ వాయువు, పరిసర ప్రాంతాల్లో కాలుష్యం, ప్రజలు ఎదుర్కొంటున్న ఆరోగ్య సమస్యలపై ఈ సమావేశాల్లో చర్చించే అవకాశం ఉంది. స్థానికుల అభిప్రాయాలు, నిపుణుల సూచనల ఆధారంగా పాదయాత్ర రూట్ మ్యాప్, ఇతర వివరాలను ప్రకటించనున్నారు. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు సమస్యకు శాశ్వత పరిష్కారం అవసరమని ఈటల రాజేందర్ పేర్కొన్నారు. జవహర్‌నగర్ డంపింగ్ యార్డు సమస్య కొత్తదేమీ కాదు. హైదరాబాద్ నగరంలో రోజూ ఉత్పత్తి అయ్యే చెత్తలో గణనీయమైన భాగాన్ని ఇక్కడికి తరలిస్తున్నారు. చెత్త నిల్వలు పెరిగిపోవడం, వ్యర్థాల నిర్వహణ, దుర్వాసన, గాలి-నీటి కాలుష్యంపై చుట్టుపక్కల నివాస ప్రాంతాల ప్రజలు చాలాకాలంగా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. డంపింగ్ యార్డు ప్రభావం జవహర్‌నగర్‌కే పరిమితం కాకుండా దమ్మాయిగూడ, నాగారం వంటి పరిసర ప్రాంతాలపైనా పడుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా వర్షాకాలంలో వ్యర్థాల నుంచి వెలువడే కలుషిత ద్రవాలు, భూగర్భ జలాల నాణ్యతపై ఆందోళనలు వ్యక్తం అవుతున్నాయి. దుర్వాసన కారణంగా రోజువారీ జీవనం ఇబ్బందిగా మారుతోందని, కాలుష్య సమస్యకు అధికారులు శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు.ఈ నేపథ్యంలో డంపింగ్ యార్డును మరో ప్రాంతానికి తరలించాలన్న డిమాండ్‌ను ఈటల రాజేందర్ తన పాదయాత్ర ప్రధాన అంశంగా తీసుకున్నారు. అయితే తరలింపు సాధ్యాసాధ్యాలు, ప్రత్యామ్నాయ ప్రాంతం ఎంపిక, చెత్త నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లు వంటి అంశాలపై ప్రభుత్వం స్పష్టమైన ప్రణాళిక ప్రకటించాల్సి ఉంది. జవహర్‌నగర్ డంపింగ్ యార్డు చర్చలోకి రావడానికి మరో ప్రధాన కారణం అక్కడి నుంచి వెలువడుతున్న మిథేన్ వాయు ఉద్గారాలపై వచ్చిన పరిశోధన నివేదికలుగా పేర్కొంటున్నారు. యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా, లాస్ ఏంజెల్స్ (యూసీఎల్ఏ)కు సంబంధించిన 'స్టాప్ మిథేన్ ప్రాజెక్ట్' పరిశోధనలో జవహర్‌నగర్ డంపింగ్ యార్డు నుంచి అధిక మోతాదులో మిథేన్ విడుదలవుతున్నట్లు అంచనా వేసినట్లు ప్రచురిత కథనాలు వెల్లడించాయి.

ఆ నివేదికకు సంబంధించిన వివరాల ప్రకారం.. ఇక్కడ గంటకు సుమారు 5.9 టన్నుల మిథేన్ విడుదలవుతున్నట్లు అంచనా వేస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా పరిశీలించిన డంపింగ్ యార్డుల్లో జవహర్‌నగర్ నాలుగో స్థానంలో ఉన్నట్లు కూడా ఆ కథనాలు పేర్కొన్నాయి. మిథేన్ ఒక శక్తిమంతమైన గ్రీన్‌హౌస్ వాయువు. వాతావరణ మార్పులను వేగవంతం చేయడంలో దీనికి కీలక పాత్ర ఉంది. చెత్త కుళ్లిపోయే సమయంలో వెలువడే మిథేన్‌ను సమర్థంగా సేకరించడం, నియంత్రించడం, వ్యర్థాలను శాస్త్రీయంగా నిర్వహించడం పర్యావరణ పరిరక్షణలో ముఖ్యమైన చర్యలుగా ఉన్నాయి. డంపింగ్ యార్డు నుంచి వెలువడే వాయువులపై నిరంతర పర్యవేక్షణ, ప్రజలకు అందుబాటులో ఉండే కాలుష్య నివేదికలు అవసరమనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.జవహర్‌నగర్ డంపింగ్ యార్డు విస్తీర్ణం సుమారు 393.54 ఎకరాలుగా.. ఇక్కడ 1994 నుంచి చెత్తను డంప్ చేస్తున్నట్లు అందిన వివరాలు సూచిస్తున్నాయి. ప్రారంభంలో రోజుకు 2,500 నుంచి 3 వేల టన్నుల చెత్త వచ్చేదని.. ప్రస్తుతం ఆ పరిమాణం 8 వేల నుంచి 10 వేల టన్నుల వరకు చేరినట్లు కొన్ని నివేదికలు పేర్కొన్నాయి. ఇక్కడ సుమారు 1.4 కోట్ల టన్నుల పాత చెత్త పేరుకుపోయినట్లు కూడా ప్రచురిత కథనాల్లో ప్రస్తావించారు. చెత్త నిల్వల ఎత్తు సముద్ర మట్టానికి 614 మీటర్లకు చేరిందని.. ఇది గోల్కొండ కోట ఎత్తును మించిందని ఆ కథనాలు పేర్కొన్నాయి.

# దేవరగట్టులో రక్తసిక్తమైన బన్నీ ఉత్సవం

కర్నూలు దసరా తరువాత జరిగే దేవరగట్టు బన్నీ ఉత్సవాలు రక్తసిక్తంగా మారాయి. బన్నీ జైత్రయాత్రలో భక్తుల మధ్య కర్రల సమరం నడిచింది. రింగులు తొడిగిన కర్రలతో పరస్పరం దాడులు జరుపుకున్నారు. అల్లరిమూకలు గాల్లోకి కాగడాలు విసిరాయి. ఈ సారి ఉత్సవంలో 80 మందికి గాయాలు అయినట్లు పోలీసులు నిర్ధారించారు. అందులో ఎనిమిది మంది పరిస్థితి విషమంగా వుంది

# రెట్టింపైన కూరగాయల దిగుబడి...

హైదరాబాద్, అక్టోబరు 22, ఎల్ నినో ఎఫెక్ట్, సాగు నీటి కష్టాల వేళ తెలంగాణ వ్యవసాయ రంగంలో కీలక మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ఒకప్పుడు పత్తి, వరి, కంది పంటలకే ఎక్కువగా పరిమితమైన వికారాబాద్ జిల్లా రైతులు ఇప్పుడు కూరగాయల సాగుపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. దాదాపు 30 ఏళ్ల తర్వాత జిల్లాలో రికార్డు స్థాయిలో కూరగాయల సాగు చేపడుతున్నారు. వానాకాలం, యాసంగి సీజన్లను కలిపి ఈసారి సుమారు 75 వేల ఎకరాల్లో కూరగాయలు పండించేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. హైదరాబాద్ నగరంలో పెరుగుతున్న కూరగాయల డిమాండ్, సాగుకు అనుకూలమైన భూములు, ప్రభుత్వ రాయితీలు ఈ మార్పునకు ప్రధాన కారణాలుగా నిలుస్తున్నాయి.గతంలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిధిలోని మొయినాబాద్, చేవెళ్ల, శంకర్‌పల్లి, షాబాద్, శంషాబాద్ తదితర మండలాల్లో కూరగాయలు, పూల సాగు విస్తృతంగా జరిగేది. హైదరాబాద్ చుట్టుపక్కల ప్రాంతాల్లో వ్యవసాయానికి అనుకూలమైన భూములు ఉండటంతో నగరానికి అవసరమైన తాజా ఉత్పత్తులు పెద్దఎత్తున సరఫరా అయ్యేవి. అయితే కాలక్రమంలో స్థిరాస్తి వ్యాపారం విస్తరించడంతో వ్యవసాయ భూముల వినియోగంలో మార్పులు వచ్చాయి. దీంతో కూరగాయలు, పూల సాగు గణనీయంగా తగ్గిపోయింది. వికారాబాద్ జిల్లా ఏర్పడిన తర్వాత అక్కడి రైతులు సుమారు ఐదు లక్షల ఎకరాల సాగు విస్తీర్ణంలో ప్రధానంగా పత్తి, వరి, కంది పంటలను పండించేవారు. నవాబ్‌పేట, మోమిన్‌పేట ప్రాంతాలు మినహా ఇతర మండలాల్లో కూరగాయలు, ఆకుకూరలు, పూలను ఎక్కువగా కుటుంబ అవసరాల కోసమే సాగుచేసేవారు.ప్రస్తుతం పరిస్థితి మారుతోంది. ఈ వానాకాలంలో జిల్లాలో దాదాపు రెండు లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేయగా.. వరి, కంది పంటలు కూడా విస్తృతంగా సాగవుతున్నాయి. వీటి తర్వాత కూరగాయల సాగు ఎక్కువగా సాగవుతోంది. హైదరాబాద్ నగర జనాభాకు అవసరమైన కూరగాయలు శివారు ప్రాంతాలతోపాటు ఉమ్మడి నల్గొండ, మహబూబ్‌నగర్ జిల్లాల నుంచి ఆశించిన స్థాయిలో సరఫరా కావడం లేదు. ఈ నేపథ్యంలో రాజధానికి 70 నుంచి 100 కిలోమీటర్ల పరిధిలో ఉన్న వికారాబాద్ జిల్లాలో కూరగాయల ఉత్పత్తిని పెంచేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. నగర మార్కెట్లకు సమీపంగా ఉండటం వల్ల పంటలను త్వరగా తరలించేందుకు తాజాదనాన్ని కాపాడేందుకు అవకాశం ఉండటం కూడా సాగు విస్తరణకు దోహదపడుతోంది.మరోవైపు ఉద్యాన పంటల సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అందిస్తున్న రాయితీలు రైతులకు ఊతమిస్తున్నాయి. నీటి కుంటలు, పందిళ్ల ఏర్పాటుకు 50 శాతం, డ్రిప్ పరికరాలకు 70 నుంచి 90 శాతం వరకు రాయితీలు అందుతున్నాయి. తోటల ఏర్పాటుకు అవసరమైన నారు మొక్కలు, విత్తనాలను కూడా రాయితీపై సరఫరా చేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా సుమారు 120 నర్సరీలు ఏర్పాటవగా, ఆంధ్రప్రదేశ్‌లోని గోదావరి జిల్లాల నుంచి నాణ్యమైన నారును తెప్పించి రైతులకు అందిస్తున్నాయి. నాణ్యమైన విత్తనాలు, నారు అందుబాటులో ఉండేలా అధికారులు చర్యలు చేపడుతున్నారు.జిల్లాలో కూరగాయల సాగు విస్తీర్ణం పెరుగుతుండటంతో ఉద్యానశాఖ అధికారులు కూడా ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నారు. రాష్ట్రస్థాయి అధికారులు నెలలో ఒకటి, రెండు సార్లు జిల్లాలో పర్యటిస్తూ రైతులతో మాట్లాడి సమస్యలు, అవసరాలను తెలుసుకుంటున్నారు. కొడంగల్, పరిగి, దోమ తదితర ప్రాంతాల నుంచి వ్యవసాయ ఉత్పత్తులను హైదరాబాద్‌కు తరలించేందుకు మెరుగైన రహదారి సౌకర్యాలు కల్పించడం, ఉద్యాన పంటల హబ్ ఏర్పాటు చేయడం వంటి ప్రణాళికలు సాగు విస్తరణకు మరింత ఊతమివ్వనున్నాయి.గత మూడు దశాబ్దాలుగా జిల్లాలో ఏటా 15 వేల నుంచి 20 వేల ఎకరాల్లో మాత్రమే కూరగాయలు సాగయ్యేవి. అయితే, 2026-27 వానాకాలంలోనే 44,610 ఎకరాల్లో సాగు చేపట్టడం గమనార్హం. యాసంగి సీజన్‌లో మరో 32 వేల ఎకరాల్లో కూరగాయలు పండించేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. ఈ లక్ష్యాలు నెరవేరితే హైదరాబాద్ మార్కెట్లకు స్థానికంగా కూరగాయల సరఫరా పెరగడంతోపాటు, వికారాబాద్ రైతులకు ఆదాయ వనరులు విస్తరించే అవకాశం ఉంది.

# వైఎస్సార్ నగర్ గుడిసెవాసులకు అండగా ఉంటా

## ప్రభుత్వ మాజీ చీఫ్ విప్, మాజీ శాసనసభ్యుడు దాస్యం



వరంగల్ వైఎస్సార్ నగర్ గుడిసెవాసులకు పట్టాలు ఇచ్చి, పక్కా ఇండ్లు కట్టించి ఇవ్వాలి. గుడిసెవాసులను బెదిరిస్తున్నారు, స్థలాన్ని కొందరు కబ్జా చేయాలని చూస్తున్నారని ప్రభుత్వ మాజీ చీఫ్ విప్, మాజీ శాసనసభ్యుడె దాస్యం వినయ్ భాస్కర్ ఆరోపించారు.

వడ్డేపల్లి..... వైఎస్సార్ నగర్ గుడిసెవాసులకు బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, పేదల పొట్టగొట్టాలని చూస్తే సహించేది లేదని దాస్యం వినయ్ భాస్కర్ స్పష్టం చేశారు.

బుధవారం రోజున హన్మకొండ వడ్డేపల్లిలోని ఆయన నివాసంలో వైఎస్సార్ నగర్ గుడిసెవాసులు వినయ్ భాస్కర్ గారిని మర్యాదపూర్వకంగా కలిసి, తమకు జరుగుతున్న అన్యాయాన్ని వివరించారు.

ఈ మేరకు కాంగ్రెస్ నాయకులు తమను బెదిరిస్తున్నారంటూ బాధితులు ఆయనకు ఒక లిఖితపూర్వక వినతిపత్రాన్ని అందజేసి, న్యాయం చేయాలని వేడుకున్నారు.

ఈ సందర్భంగా దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

వైఎస్సార్ నగర్‌లో పేద ప్రజలు నివాసముంటున్న భూములపై కొందరు బడా బాబులు, పెద్దల కన్ను పడిందని విమర్శించారు.

సీలింగ్ యాక్ట్‌లో ఉన్న ఈ భూముల్లో జరిగిన నిర్మాణాలకు గత ప్రభుత్వ హయాంలో ఎటువంటి అనుమతులు రాలేదని, ఇప్పుడు ఈ కాంగ్రెస్ పాలనలో కొన్ని నిర్మాణాలకు అనుమతులు వచ్చాయంటే ప్రభుత్వంలోని ప్రజాప్రతినిధులు అవినీతి పరులతో ములాఖత్ అయ్యారని అర్థమవుతోందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ మూడేళ్లలో పేదలకు మేలు చేయడం పక్కనబెట్టి, వారి గుడిసెలను దౌర్జన్యంగా కూల్చుతూ వారిని తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందని మండిపడ్డారు.

కాంగ్రెస్ పార్టీకి చెందిన కొందరు నాయకులు గుడిసెవాసులను నిరంతరం భయభ్రాంతులకు గురిచేస్తున్నారని, ఆ విలువైన స్థలాన్ని అక్రమంగా కబ్జా చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. పేదలను బెదిరిస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. గుడిసెవాసులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. వైఎస్సార్ నగర్‌లో నివసిస్తున్న అర్హులైన గుడిసెవాసులందరికీ తక్షణమే ప్రభుత్వ పట్టాలు పంపిణీ చేయాలని, వారందరికీ అక్కడే పక్కా ఇండ్లను నిర్మించి ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# మరోసారి మానవత్వాన్ని చాటుకున్న హోం మంత్రి వంగలపూడి అనిత

విశాపట్నం హోం మంత్రి వంగలపూడి అనిత మరోసారి మానవత్వాన్ని చాటుకున్నారు. విశాఖపట్నంలోని ఆరిలోవ హెల్త్ సిటీ బీఆర్టీఎస్ రోడ్డులో రోడ్డు ప్రమాదం జరిగింది. ఒక బోలెరో వాహనం స్కూటీని ఢీకొట్టింది. ఘటనలో ఇద్దరు విద్యార్థులకు తీవ్ర గాయాలు అయ్యాయి. ప్రమాదంలో గాయపడిన విద్యార్థులకు హోం మంత్రి అనిత తక్షణ సాయం అందించింది. విశాఖపట్నం నుంచి బీఆర్టీఎస్ రోడ్డు మీదుగా పాయకరావుపేట వెళ్తుండగా ఘటన జరిగింది. రోడ్డు ప్రమాదాన్ని గమనించి గాయపడిన విద్యార్థులను మంత్రి అనిత ఆస్పత్రికి తరలించారు. విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు ఆదేశం ఇచ్చారు. ప్రమాదానికి కారణమైన బొలెరో వాహనం డ్రైవర్పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులకు మంత్రి అనిత సూచించారు.

## రిటర్న్ టు హైదరాబాద్ భారీ ట్రాఫిక్ జామ్

నల్గోండ హైదరాబాద్ విజయవాడ జాతీయ రహదారిపై భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ప్రజలు పెద్ద సంఖ్యలో దసరా తర్వాత హైదరాబాద్ బాట పట్టారు. చౌటుప్పల్‌లో ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనుల వల్ల వాహనాలు నెమ్మదిగా మూవ్ అవుతున్నాయి. పంతంగి టోల్‌ప్లాజా వద్ద హైదరాబాద్ వైపు 10 టోల్ బూత్‌లు తెరిచారు. దసరా సందర్భంగా 10 రోజుల్లో జాతీయ రహదారిపై 7 లక్షల వాహనాల రాకపోకలు జరిగినట్లు సమాచారం

## కరెంట్ పోల్ ను ఢీకొన్న కారు.. రెండు కార్లు ధ్వంసం



మేడ్చల్ మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధి వరంగల్ జాతీయ రహదారి లో గురువుఆరం తెల్లవారుజామున కారు కరెంట్ పోల్ ను ఢీ కొట్టింది. దాంతో స్థంభం విరిగి కారు పై పడి రెండు కార్లు ధ్వంసం అయ్యాయి.

కారు డ్రైవర్ ఆకున్ సభర్వాల్,(19) స్వల్ప గాయాలు అయ్యాయి. తెల్లవారుజామున ఘటన జరగడంతో పెను ప్రమాదం తప్పింది.

# ఘట్‌కేసర్‌లో యువకుడి దుర్మరణం..



మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా, ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఔషాపూర్‌లో విషాదం చోటుచేసుకుంది. వాగ్వాదం నేపథ్యంలో ఓ యువకుడిని రోడ్డుపైకి నెట్టడంతో లారీ కింద పడి మృతి చెందాడు.

పోలీసుల వివరాల ప్రకారం... రాత్రి 8.30 గంటల సమయంలో హెచ్‌ఎల్ స్పిరిట్ వైన్స్ ఎదుట నలుగురి మధ్య గొడవ జరిగింది. ఈ క్రమంలో భువేకాంత్ శ్యామ్ అనే వ్యక్తి దుర్లభ్‌ను రోడ్డుపైకి నెట్టడంతో, అటుగా వెళ్తున్న లారీ వెనుక చక్రాల కింద పడి దుర్లభ్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటన అనంతరం పారిపోయేందుకు ప్రయత్నించిన ముగ్గురిని స్థానికులు పట్టుకున్నారు.

మృతుడు ఛత్తీస్‌గఢ్‌కు చెందిన కూలీగా గుర్తించారు. ప్రత్యక్ష సాక్షి సయ్యద్ అక్రమ్ అలీ ఫిర్యాదు మేరకు ఘట్‌కేసర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## కొమురం భీమ్, పండుగ సాయన్న కు కేటీఆర్ నివాళులు

హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో నిర్వహించిన ఆదివాసీ యోధుడు కొమురం భీమ్, బహుజన వీరుడు పండుగ సాయన్న ముదిరాజ్ జయంతి వేడుకల్లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొని, ఆ మహనీయుల చిత్రపటాలకు నివాళులు అర్పించారు.

అన్యాయంపై పోరాడి, పేదలు, బడుగు బలహీన వర్గాల హక్కులు, ఆత్మగౌరవం కోసం జీవితాలను అంకితం చేసిన వారి పోరాట స్ఫూర్తి చిరస్మరణీయమని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో శాసనమండలి డిప్యూటీ ఛైర్మన్ బండా ప్రకాష్, మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, ఖానాపూర్ నియోజకవర్గ ఇంచార్జ్ జాన్సన్ నాయక్, మాజీ కార్పొరేషన్ ఛైర్మన్లు, బీఆర్ఎస్ నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు

# మేడిపల్లిలో ఘోర రోడ్డు ప్రమాదం

## ప్రమాదం ఘోరంగా ఉన్నా తప్పిన ప్రాణనష్టం, సీసీటీవీ లో రికార్డు

మేడ్చల్ అతివేగం.. మద్యం మత్తు.. నిర్లక్ష్యపు డ్రైవింగ్ వెరసి హైదరాబాద్?వరంగల్ జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదానికి దారితీశాయి.

మేడ్చల్ జిల్లా మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని పీర్జాదిగూడలోని, హైదరాబాద్ వరంగల్ జాతీయ రహదారి ఉప్పల్ నారపల్లి ఎలివేటర్ కారిడార్ పిల్లర్ నంబర్ 57 సమీపంలోని హెచ్‌పీ పెట్రోల్ బంక్ వద్ద ఉదయం 6.30 గంటలకు ఈ ప్రమాదం జరిగింది.వేగంగా వచ్చిన టయోటా ఫార్చ్యూనర్ కారు ముందుగా వెళ్తున్న ఐ10 కారును వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. దీంతో ఐ10 కారు పల్టీలు కొట్టగా.. అదుపుతప్పిన ఫార్చ్యూనర్ విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది.

స్తంభం విరిగి ఫార్చ్యూనర్ కారుపై పడటంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. ఈ ప్రమాదంలో ఇద్దరు గాయపడగా, ప్రాణనష్టం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

మేడిపల్లి సీఐ డి.జలంధర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం. సాయిశివ (30), మేఘన (28) దంపతులు ఐ10 కారులో ఎల్‌బీనగర్ నుంచి వరంగల్ జిల్లా నర్సంపేటకు వెళు న్నారు.ఈ క్రమంలో హైదరాబాద్ వరంగల్ జాతీయ రహదారి పిల్లర్ నంబర్ 57 సమీపానికి చేరుకోగానే వెనుక నుంచి వచ్చిన ఫార్చ్యూనర్ కారు వారి వాహనాన్ని ఢీకొట్టింది.దీంతో ఐ10 కారు పల్టీలు కొడుతూ డివైడర్ వైపు వెళ్లగా, ఫార్చ్యూనర్ విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. ఈ ఘటన మొత్తం సీసీటీవీ లో రికార్డు అయింది.

ఈ ఘటనలో సాయిశివ, మేఘన గాయపడటంతో వారిని చికిత్స నిమిత్తం చైతన్యపురిలోని ఓజోన్ ఆసుపత్రికి తరలించారు.ప్రమాదానికి కారణమైన ఫార్చ్యూనర్ కారును అకున్ సబర్వాల్ నడిపినట్లు పోలీసులు గుర్తించారు.




అతడు మద్యం సేవించి ఉన్నట్లు అనుమానం వ్యక్తం కాగా, డ్రైవింగ్ లైసెన్స్ లేదని విచారణలో తెలిపినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.అంతేకాకుండా కారుకు అమర్చిన నంబర్ ప్లేట్ నకిలీదిగా గుర్తించినట్లు పోలీసులు వెల్లడించారు. డ్రైవింగ్ లైసెన్స్ లేని వ్యక్తికి వాహనం నడపడానికి అనుమతించినందుకు కారు యజమాని మంగీలాల్‌పై కూడా కేసు, దర్యాప్తు చేపట్టారు.

## రూపాయి నాణేలతో నామినేషన్‌కు వచ్చిన సుభద్ర

తిరుపతి చిగురువాడ గ్రామం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి సుభద్ర, నామినేషన్ దాఖలుకు రూపాయి నాణేలతో వచ్చింది. గ్రామస్థుల చందాలతో సుమారు రూ.6 వేల నాణేలను సేకరించింది. గ్రామస్థులు తలా రూపాయి చొప్పున చందా వేసాని తెలిపింది. గ్రామ సమస్యలను ఎవరూ పట్టించుకోవడం లేదంటూ నిరసనగా తనను నామినేషన్ వేయాలని గ్రామస్థులే ప్రోత్సహించారని సుభద్ర వెల్లడించింది. -న స్వతంత్ర అభ్యర్థిగా ఎన్నికల బరిలో నిలుస్తున్నట్లు చెప్పింది

## నామాపూర్‌లోరోడ్డెక్కిన రైతులు

రాజన్న సిరిసిల్ల రైస్ మిల్లర్ల సిండికేట్‌కు వ్యతిరేకంగా రైతులు రాస్తారోకో నిర్వహించారుజ. నామాపూర్ గ్రామంలోని ఎల్లారెడ్డిపేట?ముస్తాబాద్ ప్రధాన రహదారిపై బైఠాయించారు. మిల్లర్లు తమ దగ్గర తక్కువ ధరకు ధాన్యం కొని మోసం చేస్తున్నారంటూ ఆగ్రహం వక్తం చేసారను. రైతుల నిరసనతో భారీ ట్రాఫిక్ జామ్ ఎర్పడింది. పోలీసులు కలగచేసుకుని రైతులను సముదాయించారు.

## నాలుగు రోజుల్లోనే రూ.755 కోట్ల 14 లక్షల విలువైన మద్యం

హైదరాబాద్, అక్టోబరు 22 తెలంగాణ రాష్ట్రంలో దసరా పండుగ సందర్భంగా మద్యం అమ్మకాలు భారీగా నమోదయ్యాయి. పండుగకు ముందు నాలుగు రోజుల్లోనే మొత్తం రూ.755 కోట్ల 14 లక్షల విలువైన మద్యం విక్రయాలు జరిగాయని ఎక్సైజ్ శాఖ అధికారులు వెల్లడించారు. ఈ లెక్కలు రాష్ట్రంలో మద్యం వినియోగం పెరుగుదలను, తద్వారా ప్రభుత్వానికి గణనీయమైన ఆదాయాన్ని సూచిస్తున్నాయి. ముఖ్యంగా దసరా పండుగకు ముందురోజు, అక్టోబర్ 19న, మద్యం అమ్మకాలు అత్యధిక స్థాయికి చేరుకున్నాయి. ఆ ఒక్క రోజులోనే ఏకంగా రూ.303 కోట్ల 40 లక్షల విలువైన మద్యం అమ్ముడుపోయింది. పండుగకు ముందు ఈ అమ్మకాలు పెరగడం సాధారణంగా జరిగే పరిణామమే అయినప్పటికీ, ఈసారి నమోదైన సంఖ్యలు గత రికార్డులను అధిగమించాయి. అమ్మకాల వివరాలను పరిశీలిస్తే, అక్టోబర్ 14న రూ.102 కోట్ల 17 లక్షల విలువైన మద్యం విక్రయాలు జరిగాయి. అక్టోబర్ 15న మద్యం డిపోలకు సెలవు కావడంతో అమ్మకాలు నమోదు కాలేదు. తిరిగి అక్టోబర్ 16న రూ.126 కోట్ల 32 లక్షలు, అక్టోబర్ 17న రూ.223 కోట్ల 25 లక్షల విలువైన మద్యం అమ్ముడైంది. అక్టోబర్ 18న ఆదివారం సెలవు కావడంతో అమ్మకాలు తగ్గగా, అక్టోబర్ 19న అత్యధికంగా రూ.303 కోట్ల 40 లక్షల విక్రయాలు జరిగాయి. ఈ నాలుగు పనిదినాల్లో మొత్తం రూ.755 కోట్ల 14 లక్షల అమ్మకాలు నమోదయ్యాయి.విక్రయించిన మద్యం రకాలలో, ఈ నాలుగు రోజుల్లో 6,83,000 కేసుల హార్డ్ లిక్కర్ అమ్ముడైంది. బీరు విక్రయాలు మరింత ఎక్కువగా, 10,44,000 కేసులకు చేరుకున్నాయి. తెలంగాణ రాష్ట్రంలో సాధారణంగానే బీరు వినియోగం అధికంగా ఉంటుందని ఈ గణాంకాలు మరోసారి ధృవీకరించాయి. అక్టోబర్ 19 వరకు మొత్తం అక్టోబర్ నెలలో రూ.2,055 కోట్ల విలువైన మద్యం అమ్ముడైంది. గత నెలలతో పోలిస్తే, సెప్టెంబర్ నెలలో రూ.3,209 కోట్లు, ఆగస్టు నెలలో రూ.3,482 కోట్ల విలువైన మద్యం విక్రయాలు జరిగాయి. దసరా పండుగ కారణంగా అక్టోబర్ నెలలో కూడా అమ్మకాలు భారీగానే నమోదయ్యే అవకాశం ఉందని ఎక్సైజ్ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. గత దసరా పండుగతో పోలిస్తే ఈసారి అమ్మకాలు పెరిగాయి.

## మహబూబ్ నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల (ఉమ్మడి రంగారెడ్డి జిల్లా) సన్నాహక సమావేశం.



హైద్రాబాద్ అక్టోబర్ 22:పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఈ రోజు ఉమ్మడి రంగారెడ్డి జిల్లా సన్నాహక సమావేశం నిర్వహించారు.

సమావేశంలో మంత్రి శ్రీధర్ బాబు,ఎమ్మెల్సీ ఎన్నికల ఎల్బీ నగర్ నియోజకవర్గ కో ఆర్డినేటర్ ప్రభుత్వ విప్ డాక్టర్ బల్మూర్ వెంకట్, ఎంపీ మల్లు రవి, ఏఐసీసీ ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ చైర్మన్ మధు యాష్కీ,గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి సామ రామ్మోహన్,రంగారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షురాలు పారిజాత నరసింహారెడ్డి,

ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, జిల్లా కాంగ్రెస్ నేతలు, డివిజన్ నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఈ సమావేశంలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్ల నమోదు, ప్రచారంలో అనుసరించాల్సిన వ్యూహం, ఎన్నికల కార్యాచరణ, నాయకుల సమన్వయం తదితర అంశాలపై చర్చించారు.



## ఘనంగా కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా జన్మదిన వేడుకలు

### పేద ప్రజలకు నిత్యావసర సరుకుల పంపిణీ
### విద్యార్థులకు నోట్‌బుక్స్, బ్యాగుల పంపిణీ
### రోగులకు పండ్లు,అన్నదానం పంపిణీ

హైద్రాబాద్ అక్టోబర్ 22: కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా జన్మదినాన్ని... రాష్ట్రీయ అమిత్ షా యువ సంఘటన్ హైద్రాబాద్ లో ఘనంగా నిర్వహించింది. ఈ సందర్భంగా... సంఘటన్ రాష్ట్ర అధ్యక్షుడు విక్రమ్ నాథ్ నేతృత్వంలో నగరంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. హైదర్ గూడలోని ఎన్‌ఎన్‌ఎస్ లో కేక్ కట్ చేసి అమిత్ షాకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వివిధ బస్తీలలో పేద ప్రజలకు నిత్యావసర సరుకులు, విద్యార్థులకు నోట్‌బుక్స్, బ్యాగులను ఉచితంగా పంపిణీ చేశారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు





పండ్లు పంపిణీ చేయడంతో పాటు... ఆసుపత్రి ఆవరణలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా విక్రమ్ నాథ్ మాట్లాడుతూ.. దేశ ప్రజల సంక్షేమం కోసం అమిత్ షా నిరంతరం దేశ భద్రత కోసం నక్సలిజాన్ని నిలుమూరించడంలో అమిత్ షా ఆయన అచంచలమైన నిబద్ధత, దృఢమైన, సకాలంలో నిర్ణయాలు, యుద్ధ ప్రాతిపదికన తీసుకునే విధానం భారతదేశాన్ని బలమైన, సురక్షితమైన దేశంగా తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషించారు. దేశంలో శాంతిభద్రతలను కాపాడటానికి, సేవ చేయడానికి ఆయన చేస్తున్న ప్రయత్నాలలో ఆయన విజయం సాధించాలని హృదయపూర్వకంగా కోరుకుంటున్నానని . దేశ సమగ్రతను దెబ్బతీసేందుకు కొందరు కుట్రలు చేస్తూ... రాజకీయ లబ్ధి పొందాలని ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. సేవా కార్యక్రమాల ద్వారా పేదలకు, విద్యార్థులకు అండగా నిలవడం సంతోషంగా ఉందని తెలిపారు. ఈ సేవా కార్యక్రమంలో సుమన్ సాయి వంశీ రాష్ట్రీయ అమిత్ షా యువ సంఘటన్ నాయకులు పాల్గొన్నారు




### పోలవరం జిల్లాలో రెండో రోజు 31 ఎంపీటీసీ నామినేషన్లు

## 60కి చేరిన మొత్తం నామినేషన్లు

పోలవరం జిల్లాలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతోంది. అక్టోబర్ 22న రెండో రోజు ఎంపీటీసీ స్థానాలకు జిల్లావ్యాప్తంగా 31 నామినేషన్లు దాఖలయ్యాయి. దీంతో ఇప్పటివరకు దాఖలైన మొత్తం నామినేషన్ల సంఖ్య 60కి చేరినట్లు అధికారిక పట్టికలో పేర్కొన్నారు.జిల్లాలోని 12 మండలాల పరిధిలో 101 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. మండలాల వారీగా రెండో రోజు చింతూరు మండలంలో అత్యధికంగా 12 నామినేషన్లు దాఖలయ్యాయి. దేవీపట్నంలో ఐదు, రాజవొమ్మంగిలో నాలుగు, ఏజెన్సీ గంగవరంలో మూడు, అడ్డతీగల, మారేడుమిల్లి, రంపచోడవరం మండలాల్లో రెండేసి, వీఆర్ పురంలో ఒక నామినేషన్ నమోదైంది. మిగిలిన నాలుగు మండలాల్లో రెండో రోజు నామినేషన్లు దాఖలు కాలేదు.నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ అక్టోబర్ 23 వరకు కొనసాగనుంది. ఎన్నికల నిబంధనల ప్రకారం అభ్యర్థులు గడువులోగా నామినేషన్లు దాఖలు చేయాల్సి ఉంది.

## 25న విశ్వకర్మ పొలిటికల్ సమ్మిట్ వాల్ పోస్టర్ ఆవిష్కరణ



హైదరాబాద్ అక్టోబర్ 22; విశ్వకర్మ కమ్యూనిటీ జేఏసీ ఆధ్వర్యంలో మరో కీలక రౌండ్ టేబుల్ సమావేశానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈనెల 25న మధ్యాహ్నం 2 గంటల నుండి 5 గంటల వరకు విశ్వకర్మ పొలిటికల్ సమ్మిట్ నిర్వహిస్తున్నట్టు జేసేసీ కన్వీనర్, పారిశ్రామికవేత్త, సీనియర్ జర్నలిస్ట్ దేవరకొండ కాళిదాస్, కో-కన్వీనర్ అడ్లూరి రవీంద్రాచారిలు తెలిపారు. తెలంగాణలో విశ్వకర్మల జనాభా 10 నుండి 12 లక్షల మధ్య ఉందని, కేవలం 2 శాతం ఓట్ల తేడాతో ప్రభుత్వాలు ఏర్పడుతున్న తరుణంలో... 4 నుంచి 5 శాతం ఓటు బ్యాంకుతో ఎన్నికలను నిర్దేశించే స్థాయిలో విశ్వకర్మలు ఉన్నారని జేఏసీ నాయకులు తెలిపారు. అయిదు వృత్తులతోపాటుగా, అన్ని రంగాలలోనూ విశ్వకర్మలు తమ సత్తా చాటుతున్నారని గుర్తుచేశారు.

సోమాజిగూడలోని ప్రెస్ క్లబ్ హైదరాబాద్‌లో జరిగే పొలిటికల్ సమ్మిట్‌కు అన్ని పార్టీలలోని ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, సర్పంచులు, ఎన్నికలలో పోటీ చేసిన, ఎన్నికలకు సన్నద్ధమవుతున్న, ఆశావహ విశ్వకర్మలు భారీగా తరలివస్తున్నారని వెల్లడించారు. ఈ సదస్సుకు విశ్వకర్మ సమాజంలోని రాజకీయ జిజ్ఞాస కలిగిన వారంతా హాజరుకావచ్చని వివరించారు. విశ్వకర్మలను రాజకీయాలకు సన్నద్ధం చేయడం, కొత్త తరాన్ని ప్రోత్సహించడమే లక్ష్యంగా ఈ సమ్మిట్ ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఈ సందర్భంగా మెట్రో కార్యాలయంలో సమ్మిట్ వాల్ పోస్టర్‌ను జేఏసీ ప్రతినిధులు ఆవిష్కరించారు. రిటైర్డ్ ఇంజనీర్ మల్లయ్య, సీనియర్ జర్నలిస్టులు బైరోజు వీరశేఖరాచారి, బి.రాజమౌళిచారి పాల్గొన్నారు.

## రాజవొమ్మంగి జెడ్పీటీసీ బరిలో మురళీకృష్ణ వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా నామినేషన్ పత్రాల సమర్పణ



రాజవొమ్మంగి రాజవొమ్మంగి జెడ్పీటీసీ స్థానానికి వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా కొంగర మురళీకృష్ణ నామినేషన్ దాఖలు చేశారు. గురువారం సంబంధిత నామినేషన్ కేంద్రంలో అధికారికి నామినేషన్ పత్రాలను అందజేశారు. దీంతో రాజవొమ్మంగి మండలంలో జెడ్పీటీసీ ఎన్నికల పోటీపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో రాజవొమ్మంగి మండలంలో రాజకీయ సమీకరణాలు ప్రాధాన్యం సంతరించుకుంటున్నాయి. జెడ్పీటీసీ స్థానానికి అభ్యర్థుల నామినేషన్లతో ఎన్నికల వాతావరణం వేడెక్కుతోంది. నామినేషన్ల ప్రక్రియ పూర్తయి, అభ్యర్థుల తుది జాబితా వెలువడిన తర్వాత ఎన్నికల పోటీపై మరింత స్పష్టత రానుంది.

## కలెక్టర్ ఫొటోతో సైబర్ మోసం --డబ్బులు అడిగితే నమ్మొద్దు



నంద్యాల జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ఫొటోను దుర్వినియోగం చేస్తూ డబ్బులు డిమాండ్ చేస్తున్న సైబర్ మోసగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సూచించారు. 9713588183 నంబర్ నుంచి వచ్చే సందేశాలను నమ్మి డబ్బులు బదిలీ చేయవద్దని గురువారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు.ప్రజలు, అధికారులు, ప్రజాప్రతినిధులు, మీడియా ప్రతినిధులు అప్రమత్తంగా ఉండాలని కోరారు. అనుమానాస్పద సందేశాలు వస్తే సంబంధిత నంబర్‌ను బ్లాక్ చేసి, ఆధారాలతో పోలీసులకు లేదా సైబర్ క్రైమ్ విభాగానికి ఫిర్యాదు చేయాలని సూచించారు. సైబర్ మోసం నిర్ధారణ అయితే బాధ్యులపై కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు.

## గ్రామాల్లో వేడెక్కిన రాజకీయాలు

### ఎన్నికల వేళ పల్లెల్లో మారుతున్న సమీకరణాలు..
### అభ్యర్థుల్లో పెరుగుతున్న ఉత్కంఠ

బేతంచెర్ల: స్థానిక ఎన్నికల నేపథ్యంలో మండలంలోని గ్రామాల్లో రాజకీయ వాతావరణం వేడెక్కుతోంది.నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కావడంతో ఆయా గ్రామాల్లో రాజకీయ సందడి నెలకొంది.ప్రధాన పార్టీల నాయకులు అభ్యర్థుల ఎంపిక,మద్దతుదారుల సమీకరణలు, గెలుపు వ్యూహాలపై దృష్టి సారిస్తున్నారు.మరోవైపు ఆశావహులు తమకు అనుకూలంగా మద్దతు కూడగట్టుకునే ప్రయత్నాల్లో నిమగ్నమయ్యారు.గ్రామాల్లోఎక్కడ చూసినా ఎన్నికల చర్చలే వినిపిస్తున్నాయి.ఏ గ్రామంలో ఎవరు బరిలోకి దిగుతారు?ఏ పార్టీ నుంచి ఎవరికి అవకాశం దక్కుతుంది?రెబల్స్‌గా ఎవరు పోటీ చేస్తారు?అన్న అంశాలు ఆసక్తి రేపుతున్నాయి.కొన్నిచోట్ల అభ్యర్థుల ఎంపికపై అసంతృప్తులు వ్యక్తమవుతుండగా,మరికొన్ని చోట్ల రాజకీయ సమీకరణాలు మారుతున్నాయి.నామినేషన్ల ఉపసంహరణ,తుది అభ్యర్థుల జాబితా వెలువడిన తర్వాత గ్రామాల్లో రాజకీయ పరిస్థితులు మరింత స్పష్టమయ్యే అవకాశం ఉంది.



# ఎం,ఎస్,పట్టా పొందిన డాక్టర్ కాపా లోహిత.

**వైరా వైద్య దంపతులు డాక్టర్ మురళీకృష్ణ,**
**డాక్టర్ చంద్రకళ కుమార్తె లోహిత.**
**లోహితకు తల్లిదండ్రులకు పలువురు అభినందనలు.**






ఖమ్మం జిల్లా బ్యూరో ప్రజాబలం అక్టోబర్ 22:వైరాకు చెందిన ప్రముఖ వైద్య దంపతులు డాక్టర్ కాపా మురళీకృష్ణ, డాక్టర్ కాపా చంద్రకళ కుమార్తె డాక్టర్ కాపా లోహిత ప్రసూతి, స్త్రీల వ్యాధుల విభాగంలో శస్త్రచికిత్సా నిపుణతతో కూడిన మాస్టర్ ఆఫ్ సర్జరీ (ఎం.ఎస్.) పోస్టుగ్రాడ్యుయేషన్ పట్టాను గురువారం అందుకున్నారు. చెన్నైలోని శ్రీ రామచంద్ర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ విశ్వవిద్యాలయం నుంచి ఆమె ఈ పట్టాను పొందారు.డాక్టర్ లోహిత ఎం.బి.బి.ఎస్. విద్యను పూర్తి చేసిన అనంతరం, మమత మెడికల్ కాలేజీలో తన వైద్య విద్యను కొనసాగించి, అనంతరం ఎం.ఎస్. పోస్టుగ్రాడ్యుయేషన్ కోసం చెన్నైలోని శ్రీ రామచంద్ర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్‌లో చేరారు. అక్కడ ప్రసూతి, స్త్రీల వ్యాధుల విభాగంలో ఉన్నత వైద్య విద్యను విజయవంతంగా పూర్తి చేసి ఎం.ఎస్. పట్టాను సాధించారు.వైద్య వృత్తిలో ఉన్నత విద్యను అభ్యసించి, శస్త్రచికిత్సా విభాగంలో పోస్టుగ్రాడ్యుయేషన్ పట్టాను సాధించిన డాక్టర్ లోహితను వైరా ప్రాంతానికి చెందిన వైద్యులు, ప్రముఖులు, కుటుంబసభ్యులు,శ్రేయోభిలాషులుఅభినందించారు. భవిష్యత్తులో వైద్య రంగంలో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించి, ప్రజలకు విశిష్టమైన వైద్య సేవలు అందించాలని ఆకాంక్షించారు.

ఈ సందర్భంగా వైరా మండల డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ దారెల్లి కోటయ్య, డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి, పెంట్యాల భాస్కరరావు, డాక్టర్ పెరుమాళ్ల కృష్ణమూర్తి, డాక్టర్ సతీష్ కుమార్, తమ్మిశెట్టి ఉమామహేశ్వరరావు, డాక్టర్ దారెల్లి హరిత, డాక్టర్ లగడపాటి చరిత, డాక్టర్ శ్రీధర్ గౌడ్, లయన్ లగడపాటి ప్రభాకర్ రావు, ఉంద్రు శ్యాంబాబు, ఉంద్రు వరలక్ష్మి, చింతనిపు వెంకటయ్య, జాల పుల్లారావు, ఉయ్యూరు రామకృష్ణ, తోటకూర శ్రీకాంత్, గంగవరపు కిషన్, పెనుగొండ ఉపేందర్ రావు, కొల్లా రాంబాబు, చెరుకూరు శ్రీనివాసరావు, షేక్ పాషా, కొదుమూరు రవి, ఏపూరి రాజారావు, గద్దె నీరజ, గజ్జల కృష్ణమూర్తి, చింతోజు నాగేశ్వరరావు, వై. బుచ్చి రామారావు, మరికంటి రాంగోపాల్, కన్యాదారి హనుమాయమ్మ, కుతుంబాక ఇంద్రాణి తదితరులు డాక్టర్ లోహితకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు.

# బీసీలకు గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ పదవి లోకేష్ యాదవ్ కు ఇవ్వాలి ...

**నామినేటెడ్ పదవుల్లో బీసీలకు ప్రాధాన్యత కల్పించాలి ...**
**లేకరుల సమావేశంలో తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్షులు పొదిల సతీష్ యాదవ్,**
**ప్రధాన కార్యదర్శి యలమందల జగదీష్**






ఖమ్మం జిల్లా బ్యూరో ప్రజాబలం అక్టోబర్ 22:ఉమ్మడి ఖమ్మం జిల్లాకు గవర్నర్ కోటాలో డాక్టర్ లోకేష్ యాదవ్ ఇవ్వాలని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్షులు పొదిల సతీష్ యాదవ్, ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి, నాయి బ్రాహ్మణ సేవా సంఘం ఖమ్మం నగర అధ్యక్షులు యలమందల జగదీష్ పేర్కొన్నారు. ఖమ్మం ప్రెస్ క్లబ్ గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం లో వారు మాట్లాడుతూ గత 26 సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీలోనూ , ఎన్ఎస్ యుఐ విద్యార్థి సంఘం నాయకుడు నుండి రాష్ట్ర అధికార ప్రతినిధి గా కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి పాటుపడిన లోకేష్ యాదవ్, నాయి బ్రాహ్మణ బిడ్డ జంపాల రాజేష్ లకు గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలని డిమాండ్ చేశారు. 60 శాతానికి పైగా ఉన్న బీసీలకు చట్టసభల్లో ప్రాతినిధ్యం లేకపోతే తమ గోడు ఎవరికి చెప్పుకోవాలని ఆవేదన వ్యక్తం చేశారు. 2014, 2018, 2023 ఎన్నికల్లో ఎమ్మెల్యే, ఎంపీ, ఎమ్మెల్సీ, రాజ్యసభ, మంత్రి పదవి కూడా ఒక్క బీసీకి కేటాయించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీల జనాభా శాతం ఎక్కువగా ఉన్నా చట్టసభల్లో వారి ప్రాతినిధ్యం కరువైందని పేర్కొన్నారు. ఓట్లు మావి సీట్లు మీవా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి ఖమ్మం జిల్లాలో బీసీలకు న్యాయం చేయాలని లేనిచో రాష్ట్రవ్యాప్తంగా బీసీల ఉద్యమానికి శ్రీకారం చుడతామని పేర్కొన్నారు. ఖమ్మం కార్పొరేషన్ ఎన్నికలలో నాయి బ్రాహ్మణులకు తగిన ప్రాధాన్యత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బత్తుల వీరబాబు, పగడాల హనుమంతరావు, రాగం కోటి, నాగరాజు, వినయ్, వంశి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# కిష్టాపూర్ ప్రాథమిక సహకార సంఘం భవన నిర్మాణానికి భూమిపూజ

**చైర్మన్ నాగులగారి మల్లేశం గౌడ్**
**ఆధ్వర్యంలో పనులకు శ్రీకారం**







కొల్చారం, అక్టోబర్ 22 (ప్రజా బలం): ప్రతినిధి మెదక్ జిల్లా కొల్చారం మండలం కిష్టాపూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) నూతన భవన నిర్మాణానికి గురువారం భూమిపూజ నిర్వహించి పునాదిరాయి వేశారు. ఎన్నో ఏళ్లుగా అద్దె భవనంలో కొనసాగుతున్న సంఘానికి సొంత భవనం నిర్మించాలనే లక్ష్యంతో చైర్మన్ నాగులగారి మల్లేశం గౌడ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు.

ఈ సందర్భంగా చైర్మన్ మల్లేశం గౌడ్ మాట్లాడుతూ.. 2020లో సంఘ బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి అభివృద్ధికి కృషి చేస్తున్నామని తెలిపారు. గత రెండేళ్ల క్రితం సంఘానికి గుంట భూమిని కొనుగోలు చేశామని, ప్రస్తుతం ఆ స్థలంలో సంఘ నిధుల నుంచి కొంత మొత్తాన్ని వినియోగించుకునేలా తీర్మానం చేసి, అందరి సహకారంతో నూతన భవన నిర్మాణాన్ని ప్రారంభించినట్లు వివరించారు. ఇన్నాళ్లు సొంత భవనం లేక అద్దె భవనంలో సంఘ కార్యకలాపాలు నిర్వహిస్తూ అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నామని, నూతన భవన నిర్మాణంతో ఆ సమస్యకు పరిష్కారం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ స్వప్న ఉషయ్య, సహకార సంఘం సీఈఓ నవీన్, వైస్ చైర్మన్ ప్రభాకర్, పాలకవర్గ సభ్యులు పసుల నారాయణ, పసుల సత్యనారాయణ, సార డాకా గౌడ్, చిట్యాల పోచయ్య, వార్డు సభ్యులు పెద్దల కిషన్, ఎంబరీ మల్లేశం, అక్కేమ్ ప్రవీణ్, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పెద్ది శ్రీశైలం, గ్రామ పెద్దలు, రైతులు, సంఘ అటెండర్ యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

నూతన భవన నిర్మాణానికి సహకరించిన సీఈఓ, పాలకవర్గ సభ్యులు, సంఘ సభ్యులు, రైతులకు చైర్మన్ మల్లేశం గౌడ్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## యనమల రామకృష్ణుడుకు అస్వస్థత

కాకినాడ, అక్టోబరు 22 తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు అస్వస్థతకు గురయ్యారు. దీంతో ఆయన్ను మెరుగైన చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు కాకినాడలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు. ప్రస్తుతం ఆయన వైద్యుల పర్యవేక్షణలో చికిత్స పొందుతున్నారు.ఈ విషయం తెలుసుకున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెంటనే స్పందించారు. యనమల కుటుంబ సభ్యులు, ఆయనకు చికిత్స అందిస్తున్న వైద్యులతో ఫోన్‌లో మాట్లాడి ఆరోగ్య పరిస్థితి గురించి ఆరా తీశారు. యనమలకు అందిస్తున్న వైద్య వివరాలను అడిగి తెలుసుకున్నారు.అనంతరం యనమల రామకృష్ణుడి ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు తనకు తెలియజేయాలని పార్టీ ముఖ్య నేతలను చంద్రబాబు ఆదేశించారు. యనమల అస్వస్థతకు గల కారణాలు, ఆయన ఆరోగ్య స్థితికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# గ్రీన్‌ఫీల్డ్ హైవేపై ఇదేం నిర్లక్ష్యం?

**హైవేపై ద్విచక్ర వాహనాలు, ఆటోల స్వైర విహారం!**
**ప్రశ్నిస్తే సమాధానం చెప్పాల్సింది పోయి..**
**ఫిర్యాదు చేసుకోమంటున్న సిబ్బంది!**





ఖమ్మం జిల్లా బ్యూరో ప్రజాబలం అక్టోబర్ 22:ప్రయాణం సాఫీగా సాగాలి ప్రయాణికుల ప్రాణాలకు భరోసా ఉండాలి ప్రమాదాలకు తావులేకుండా హైవేపై నిబంధనలు అమలవ్వాలి కానీ గ్రీన్‌ఫీల్డ్ హైవేపై పరిస్థితి మాత్రం ఇందుకు భిన్నంగా ఉందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

హైవే అంటేనే వేగవంతమైన ప్రయాణానికి మార్గం.. అలాంటి రహదారిపై ద్విచక్ర వాహనాలు, ఆటోలు యథేచ్ఛగా సంచరిస్తుంటే బాధ్యత ఎవరిది?

హైవేపై ఈ వాహనాల రాకపోకలపై ప్రశ్నిస్తే.. సమస్యను పరిష్కరించాల్సిన సిబ్బంది నిర్లక్ష్యంగా సమాధానాలు చెబుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఏమైనా ఉంటే ఫిర్యాదు చేసుకోండి అంటూ బాధ్యతను దాటవేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

వాహనదారుల భద్రతపై ప్రశ్నిస్తే ఇదేనా సమాధానం? నిబంధనల అమలును ప్రశ్నిస్తే ఇదేనా బాధ్యత?

ఈ వ్యవహారంపై వాహనదారులు సోషల్ మీడియా వేదికగా తమ అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. హైవేపై వాహనాల రాకపోకలను పర్యవేక్షించాల్సిన సిబ్బంది.. సమస్యను తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కారం చూపాల్సింది పోయి ఫిర్యాదు చేసుకోమని చెప్పడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది.

ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించాలి.. హైవేపై నిబంధనల అమలును పర్యవేక్షించాలి.. ప్రమాదాలకు ఆస్కారం లేకుండా చర్యలు చేపట్టాలి.

ప్రజల ప్రాణాల భద్రతే ప్రథమ ప్రాధాన్యంగా ఉండాలి.. సమస్యను ప్రశ్నించే ప్రజలకు నిర్లక్ష్యపు సమాధానాలు కాదు.. బాధ్యతాయుతమైన స్పందన కావాలి!

మరి ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు ఎలా స్పందిస్తారో వేచి చూడాలి!

# ఆత్మకూరు మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా టీడీపీ తరఫున డా. గోవిందరాజులు ఏకగ్రీవం



ఆత్మకూరు: ఆత్మకూరు మున్సిపాలిటీ చైర్మన్ అభ్యర్థిగా తెలుగుదేశం పార్టీ (టీడీపీ) తరపున డా. గోవిందరాజులు ఏకగ్రీవంగా ఎంపికైనట్లు సంబంధిత ఎన్నికల అధికారి వెల్లడించారు. టీడీపీ తరఫున చైర్మన్ అభ్యర్థిగా డా. గోవిందరాజులు పేరును ఖరారు చేసినట్లు తెలిపారు.ఆత్మకూరు మున్సిపల్ ఎన్నికల ప్రక్రియలో ఈ పరిణామం చోటుచేసుకుంది. ఎన్నికల అధికారుల ప్రకటనతో చైర్మన్ అభ్యర్థి ఎంపికపై స్పష్టత వచ్చింది.

# క్రికెట్ క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయి.

**యువతను ప్రోత్సహిస్తున్న ఎస్సై రామారావు,డాక్టర్ మురళీకృష్ణ.**

**రెండవ బహుమతి ప్రధానం చేసిన**

**కౌన్సిలర్ ఉండ్రు వరలక్ష్మి శ్యాంబాబు.**

**ఖమ్మం జిల్లా బ్యూరో ప్రజాబలం అక్టోబర్ 22:**వైరా మున్సిపాలిటీ పరిధిలో నిర్వహించిన 6 టు 6 క్రికెట్ టోర్నమెంట్ మూడు రోజులు పాటు నిర్వహించారు బుధవారం క్రికెట్ పోటీల్లో గెలిచిన టీం లకు బహుమతి ప్రధానోత్సవం చేశారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సమక్ తక్రా జిల్లా అధ్యక్షులు డాక్టర్ కాపా మురళీకృష్ణ స్థానిక సబ్ ఇన్స్పెక్టర్ పుష్పాల రామారావు విచ్చేసి వారు మాట్లాడుతూ మన భారతదేశం ఆట క్రికెట్ కాకున్నా భారతీయులందరూ అతిగా ఇష్టపడేట క్రికెట్ అని ఈ క్రికెట్ తో పాటు అనేకమైన ఆటలు యువకులు ఆడటం వల్ల మనిషి శారీరకంగా మానసికంగా ఆరోగ్యంగా ఉండటానికి ఆటలు ఎంతో







ఉపయోగపడతాయని అన్నారు యువకులందరూ కలిసి క్రికెట్ టోర్నమెంట్లో ఆనందంగా కలిసి పాల్గొన్నారని వారు తెలిపారు యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించడంతోపాటు ఆరోగ్యం పై కూడా అవగాహన కల్పించుకోవాలని అన్నారు క్రీడలు ధ్యానం ద్వారా ఒత్తిడి ఆందోళన ఇతర అనారోగ్య సమస్యలు అధిగమించవచ్చని తెలిపారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ క్రీడలను జీవితంలో భాగం చేసుకోవాలని వారి పేర్కొన్నారు క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కూడా కలిగిస్తాయని వారి సందర్భంగా తెలిపారు అనంతరం టోర్నమెంట్లో లో గెలిచిన టీమ్లకు బహుమతులను అందించారు. 6టూ 6 క్రికెట్ టోర్నమెంట్ మొదటి బహుమతి షీల్డ్ ను మణుగూరు టీం రెండో బహుమతిని కాప రాయల్ టీం మూడో బహుమతిని గణేష్ టీం గెలుచుకుంది. ఈ బహుమతులను మొదటి బహుమతి వైరా మున్సిపల్ చైర్పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణ,రెండో బహుమతి 20 వ వార్డ్ కౌన్సిలర్ వుండ్రు వరలక్ష్మీ శ్యాంబాబు,మూడవ బహుమతిని కాంగ్రెస్ నాయకులు పెరుగు ప్రసాద్ ఆల్ రౌండర్ గా ఎన్నికైన క్రికెటర్ కు బహుమతిని 2 వార్డ్ కౌన్సిలర్ తిరుపతి శివ కుమారి శ్రీను అందించారు ఈ బహుమతి ప్రధానోత్స కార్యక్రమంలో , పొదిలి హరినాథ్ , తోటకూర శ్రీకాంత్ . ఉయ్యూరు రామకృష్ణ పెనుగొండ ఉపేందర్ రావ్ వాంకుడోత్యా బిక్య ఈ కార్యక్రమంలో టోర్నమెంట్ కమిటీ సభ్యులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

# దామన్న వదిలిన బాణం

# ఆకుల సత్యనారాయణ అలియాస్ చిట్టిబాబు



**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి అక్టోబర్ 22 (ప్రజాబలం )సంగారెడ్డి జిల్లా:** గురువు అడుగు జాడల్లో నడుస్తూ, ప్రజాసేవే లక్ష్యంగా, రాముడికి,లక్ష్మణుడి, అండగా, హనుమంతుడి హృదయంలో కొలువైన రామ నామములా, చిట్టిబాబు నారానరణ దామన్న నామ స్మరణతో, దామన్న వదిన బాణం, గురువే మార్గదర్శిగా, వినయమే ఆభరణంగా, మంత్రి దామోదర్ రాజనర్సింహ, అడుగుజాడల్లో, నడుస్తూ రాజకీయ చదరంగంలో అనుభవ పాఠాలు నేర్చుకుంటున్న, యువ నాయకుడు ఆకుల సత్యనారాయణ, (చిట్టిబాబు) దామన్న మాటను గౌరవిస్తూ, అభివృద్ధి బాటలో ముందడుగులు వేస్తూ, ప్రతిపక్షాలకు దీటైన జవాబు ఇస్తూ, ఆందోల్- జోగిపేట, మున్సిపల్ వైస్ చైర్మన్ గా, ప్రజాసేవకు తనదైన ముద్ర వేస్తూ, నమ్మినవారికి నేనున్నాననె ధైర్యం, ఆపదలో ఉన్న వారికి నేనున్నాననె భరోసా, ప్రజా సమస్యలకు పరిష్కారమే తన సంకల్పం, ఇది ఆకుల సత్యనారాయణ అలియాస్ (చిట్టిబాబు) తత్వం

# అల్లం పంటలో కొత్త తెగులు.. రైతులు అప్రమత్తంగా ఉండాలి

## జహీరాబాద్, కోహిర్ మండలాల్లో

## కేంద్ర బృందం పర్యటన

**జహీరాబాద్, అక్టోబర్ 22 ప్రజాబలం ప్రతినిధి:** జహీరాబాద్, కోహిర్ మండలాల్లో అల్లం పంటకు సోకుతున్న అగ్గి తెగులును పోలిన కొత్త తెగులుపై కేంద్ర, రాష్ట్ర వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులు సంయుక్తంగా క్షేత్రస్థాయిలో పరిశీలన నిర్వహించారు. పంటలకు సోకుతున్న తెగులు లక్షణాలను పరిశీలించి, నివారణ చర్యలపై రైతులకు సూచనలు చేశారు. హైదరాబాద్ కేంద్రీయ సమగ్ర సస్యరక్షణ కేంద్రానికి చెందిన ప్లాంట్ ప్రొటెక్షన్ అధికారులు వెంకటరెడ్డి, బసవన్నప్ప, అసిస్టెంట్ ప్లాంట్ ప్రొటెక్షన్ అధికారి ఉదయశంకర్, సంగారెడ్డి ఫల పరిశోధన స్థానం శాస్త్రవేత్త డాక్టర్ మౌనిక, డీడీఎస్ కేవీకే శాస్త్రవేత్త శైలజ, స్థానిక ఉద్యాన శాఖ అధికారి సునీత రోస్, ఉద్యాన విస్తరణ అధికారి సతీశ్ ఈ పర్యటనలో



పాల్గొన్నారు. కర్ణాటక, కేరళ రాష్ట్రాల్లో ఇటీవల వ్యాపించిన ఈ తెగులు ప్రస్తుతం తెలంగాణలోనూ కనిపిస్తున్నట్లు అధికారులు తెలిపారు. కేరళలోని భారతీయ సుగంధ ద్రవ్యాల పరిశోధన సంస్థ శాస్త్రవేత్తలు దీనికి ప్రాక్సిఫైరిక్యులేరియా జింజిబెరిస్ అనే శిలీంధ్రాన్ని కారణంగా గుర్తించినట్లు పేర్కొన్నారు.

నివారణ చర్యలు తప్పనిసరి

తెగులు నివారణకు ప్రొపికోనజోల్ లేదా టెబుకోనజోల్ మందును లీటరు నీటికి ఒక మిల్లీలీటరు చొప్పున కలిపి పిచికారీ చేయాలని సూచించారు. విత్తనంగా ఉపయోగించే అల్లం కొమ్ములకు కూడా ఇదే మందులతో శుద్ధి చేయాలని తెలిపారు. తెగులు సోకిన ప్రాంతాల నుంచి అల్లం విత్తన కొమ్ములను ఎట్టి పరిస్థితుల్లోనూ తీసుకురావద్దని రైతులను హెచ్చరించారు.

## ఏపీ చీఫ్ సెక్రటరీ సాయి ప్రసాద్

## పదవీకాలం 6 నెలలు పొడిగింపు

ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్ పదవీకాలాన్ని ప్రభుత్వం పొడిగించింది. ఈ ఏడాది నవంబర్ 30వ తేదీన ఆయన పదవి విరమణ చేయాల్సి ఉన్న విషయం తెలిసిందే. ఈ మేరకు సాయిప్రసాద్ పదవీ కాలాన్ని మరో 6 నెలలు పొడిగించాలని డీఓపీటీకి రాష్ట్ర ప్రభుత్వం లేఖ రాసింది. ఏపీ ప్రభుత్వ విజ్ఞప్తిపై సాయిప్రసాద్ పదవీకాలాన్ని ఆరు నెలల పాటు డీఓపీటీ పొడిగించింది. దీంతో వచ్చే ఏడాది మే 30వ తేదీ వరకు చీఫ్ సెక్రటరీగా సాయిప్రసాద్ కొనసాగనున్నారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్ళు మంజూరు చేయాలి.

**బిఆర్ఎస్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ధర్నా చౌక్ వద్ద నిరసన.**

**కార్యక్రమంలో పాల్గొన్న తల్లాడ మాజీ ఎంపీపీ,**

**అన్నారుగూడెం సర్పంచ్ .**

**ఖమ్మం జిల్లా బ్యూరో ప్రజాబలం అక్టోబర్ 22:**అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్ల స్థలాలు,ఇందిరమ్మ ఇళ్ళు మంజూరు చేయాలని,గ్రామ పంచాయతీల అభివృద్ధిలో కీలక పాత్ర పోషించే సర్పంచులకు వారి విధులు, అధికారాలను వినియోగించుకునే అవకాశం కల్పించాలని డిమాండ్ చేస్తూ బిఆర్ఎస్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఖమ్మం జిల్లా కలెక్టరేట్ ధర్నా చౌక్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఇల్లు లేని నిరుపేదలకు అర్హత ప్రాతిపదికన ఇళ్ల స్థలాలు మంజూరు చేసి,ఇందిరమ్మ ఇల్లు నిర్మించి వారికి న్యాయం చేయాలని నాయకులు డిమాండ్ చేశారు.అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.ఇళ్ల స్థలాల కోసం ఎదురుచూస్తున్న పేదల సమస్యలను అధికారులు, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. గ్రామాల అభివృద్ధి, ప్రజా సమస్యల




పరిష్కారంలో సర్పంచుల పాత్ర కీలకమని పేర్కొంటూ, వారికి కేటాయించిన విధులు, అధికారాలను స్వేచ్ఛగా వినియోగించుకునేలా ప్రభుత్వం అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. గ్రామ పంచాయతీల పరిపాలనలో సర్పంచులకు తగిన అధికారాలు,విధుల నిర్వహణకు అవసరమైన అవకాశాలు కల్పించాలని కోరారు. పేదలకు ఇళ్ల స్థలాల కల్పన,గ్రామ పంచాయతీల పరిపాలనలో సర్పంచుల అధికారాల వినియోగం వంటి అంశాలను ప్రధానంగా ప్రస్తావిస్తూ నాయకులు, కార్యకర్తలు ప్లకార్డులతో నిరసన తెలిపారు.ప్రజల సమస్యలను పరిష్కరించడంతో పాటు గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

# దార్లపల్లి జిపి లో అమృత్ స రోవర్ కుంటలు నిర్మించాం

## గ్రామ సర్పంచ్ తెనాలి దుర్గమ్మ బాల్ రాజ్

**వికారాబాద్ నియోజకవర్గ ప్రతినిధి అక్టోబర్ 23 (ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:** దార్లపల్లి గ్రామ పంచాయతీ లో అమృత్ సరో వర్ కార్యక్రమం గ్రామ ప్రజలు పాల్గొని నీటి కుంటల నిల్వ ఉండేలా ఈ కార్యక్రమంపూర్తి చేయడం జరిగిందని గ్రామ సర్పంచ్ తలారి దుర్గమ్మ బాల్ రాజ్ తెలిపారు అక్టోబర్ మాసంలోనే ఎండలు మెండుగా ఉన్నాయి కాబట్టి ప్రజలు నీటి మందం తగ్గిపోతుంది. భూగర్భ జలాలు అంతరించిపోతున్నా యి కావున చిన్న చిన్న నీటి కుంటలు నిర్మించి భూమిలో నీటిని ని ల్వయే మనందరికీ బాధ్యతగా కృషి చేయాలని దార్లపల్లి గ్రామ సర్పంచ్ తలారి దుర్గమ్మ బాలరాజు తెలిపారు



# గ్రాడ్యుయేట్ ఎన్నికలు త్వరలో జరగనున్న నేపథ్యంలో అర్హులైన గ్రాడ్యుయేట్ లు ఓటర్లుగా నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలి!!!

## ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు.

**సనత్ నగర్ (ప్రజాబలం ప్రతినిధి నరేష్) అక్టోబర్ 22** గ్రాడ్యుయేట్ ఎన్నికలు త్వరలో జరగనున్న నేపథ్యంలో అర్హులైన గ్రాడ్యుయేట్ లు ఓటర్లుగా నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. గురువారం వెస్ట్ మారేడ్ పల్లి లోని క్యాంప్ కార్యాలయంలో సనత్ నగర్ నియోజకవర్గ పరిధిలోని బిఆర్ఎస్ పార్టీ ముఖ్య





నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవంబర్ 6 వ తేదీ వరకు గ్రాడ్యుయేట్ లు ఓటర్లుగా నమోదు చేసుకునేందుకు అవకాశం ఉందని పేర్కొన్నారు. మీ మీ ప్రాంతాలలో అర్హులైన గ్రాడ్యుయేట్ లను గుర్తించి ఓటర్లుగా నమోదు చేపించాలని కోరారు. వాస్తవంగా ఓటరు నమోదు కార్యక్రమాన్ని ఎన్నికల కమిషన్ నిర్వహించాల్సి ఉండగా, బాధ్యతగా వ్యవహరించడం లేదని పేర్కొన్నారు. కాలనీలు, బస్తీలు అనే తేడా లేకుండా గ్రాడ్యుయేట్ లు ఉన్న ప్రతి ప్రాంతంలో గుర్తించి ఓటరుగా నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలని కోరారు. బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించిన నాయకులను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా విజయ దశమి శుభాకాంక్షలు తెలిపారు. సమావేశంలో మాజీ కార్పొరేటర్ లు నామన శేషుకుమారి, కుర్మ హేమలత, డివిజన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కొలన్ బాల్ రెడ్డి, గుర్రం పవన్ కుమార్ గౌడ్, అత్తిలి శ్రీనివాస్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, నాయకులు టి. శ్రీహరి, కిషోర్ సురేష్ గౌడ్,ప్రవీణ్ రెడ్డి, కూతురు నర్సింహ, గందే నాగులు, రాములు, నరేందర్, శేఖర్, ఖలీల్, వెంకటరమణ, కోటేశ్వర్ గౌడ్, ప్రేమ్, బాసా లక్ష్మీ, నాగలక్ష్మి, దుర్గ, రాణి కౌర్ తదితరులు పాల్గొన్నారు.

# టిడిపి జెడ్పీటీసీ అభ్యర్థిగా మిద్దె గీతా కుమారి

తుగ్గలి మండల జెడ్పీటీసీ స్థానానికి తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా మిద్దె గీతా కుమారి గురువారం రోజున నామినేషన్ పత్రాన్ని దాఖలు చేశారు. జొన్నగిరి గ్రామానికి చెందిన సీనియర్ టీడీపీ నాయకులు మిద్దె వెంకటేష్ యాదవ్ సతీమణి మిద్దె గీతా కుమారి కర్నూలు జిల్లా పరిషత్ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారికి నామినేషన్ అందజేశారు.ఈ సందర్భంగా మిద్దె గీతా కుమారి మాట్లాడుతూ తుగ్గలి మండల అభివృద్ధికి కృషి చేస్తానని,మహిళా సాధికారత కోసం పాటుపడతానని తెలిపారు.తనకు అవకాశం ఇచ్చిన ఎమ్మెల్యే కే.ఈ శ్యాంబాబుకు,పార్టీ అధిష్టానానికి, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎర్రగుడి మాజీ సర్పంచ్ ఎర్రగుడి వెంకటస్వామి,టీడీపీ మండల నాయకులు,కార్యకర్తలు,కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# నర్సాపూర్ నియోజకవర్గ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి, నేడు నియోజకవర్గంలో పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు

అందోల్ నియోజకవర్గం ప్రతినిధి అక్టోబర్ 22

## పండుగ సాయన్నకు ఘన నివాళులు




(ప్రజాబలం )సంగారెడ్డి జిల్లా :పండుగ సాయన్న 174,వ జయంతినందర్భంగానర్సాపూర్ చౌరస్తాలోఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళు లర్పించారు,ఈసందర్భంగా, పండుగ సాయన్న, చేసిన సేవలనుఆయనపోరాటన్నార్తిని



స్మరించుకున్నారు.దుర్గామాత నిమజ్జన కార్యక్రమంలో పాల్గొనడం శివ్వంపేట మండలం పిలుట్ల,గ్రామంలో నిర్వహించిన శ్రీ దుర్గామాత నిమజ్జనం కార్యక్రమంలో ఆవుల రాజిరెడ్డి, పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు, ఈ సందర్భంగా గ్రామ ప్రజలతో కలిసి కార్యక్రమంలో పాల్గొన్నారునర్సాపూర్ మున్సిపాలిటీలో 13వ వార్డు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మాతిన్ మాతృమూర్తి అనారోగ్యంతో మృతి చెందడంతో ఆవులరాజిరెడ్డి, ఆమెకు నివాళులు అర్పించారు, అనంతరం మాతిన్ కుటుంబ సభ్యులను పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారుఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు..

# నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ పనులను త్వరితగతిన పూర్తి చేయాలి.

## ప్రయాణికుల సౌకర్యాలకు ప్రాధాన్యం ఇవ్వాలి.

## మంత్రి దనసరి అనసూయ సీతక్క.

**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి అక్టోబర్ 22 ములుగు** గురువారం జిల్లా కలెక్టర్ బోర్ధడే హేమంత్ సహదేవరావుతో కలిసి మంత్రి అనసూయ సీతక్క ములుగు జిల్లా కేంద్రంలోని మోడల్ బస్‌స్టాండ్ నిర్మాణ పనులను పరిశీలించారు.

ఫ్లోరింగ్, నిర్మాణ పనులతో పాటు ఇతర పనుల పురోగతిని పరిశీలించి, ఇప్పటివరకు పూర్తయిన పనులు, మిగిలిన పనుల వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా మంత్రి అనసూయ సీతక్క మాట్లాడుతూ, ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందించడంలో బస్‌స్టాండ్ కీలకమని తెలిపారు. ప్రయాణికుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని నిర్మాణ పనులను పూర్తి చేయాలని సూచించారు. పనుల వేగంతో పాటు నాణ్యతకు సమాన ప్రాధాన్యం ఇవ్వాలని, అధికారులు క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.



ప్రయాణికులు సురక్షితంగా రాకపోకలు సాగించేలా ఫ్లోరింగ్ పనులు చేపట్టాలని సూచించారు. తాగునీరు, మరుగుదొడ్లు, కూర్చునే సదుపాయాలు, విద్యుత్ దీపాలు వంటి మౌలిక సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు.

మిగిలిన పనులను సమన్వయంతో పూర్తి చేసి, బస్‌స్టాండ్‌ను ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగా కళ్యాణి,పంచాయతీ రాజ్ డైరెక్టర్ బైరెడ్డి భగవాన్ రెడ్డి, స్థానిక ప్రజా ప్రతినిధులు, సంబధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# దశ దినకర్మకు ఆర్థిక సహాయం అందజేసిన. శ్రీ రామకృష్ణ సేవ ట్రస్ట్ చైర్మన్ బడిస నాగ రమేష్

**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి అక్టోబర్ 22 మంగపేట** మంగపేట మండలంలోని కోడుమూరు గ్రామానికి చెందిన సారా లాలయ్య ఇటీవల ఆరోగ్య సమస్యతో మరణించడం జరిగింది పొద్దుమూరు గ్రామానికి చెందిన స్థానికులు వారి పరిస్థితిని గురించి పేదస్థితి గురించి నాగ రమేష్ కు తెలపడంతో వారి మాటలకు చెల్లించిన టిఆర్ఎస్ ములుగు జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శి నాగ రమేష్ తక్షణమే ట్రస్ట్ సభ్యులను పంపించి బాధిత కుటుంబ సభ్యులతో ఫోన్లో మాట్లాడి వారి పరిస్థితి తెలుసుకొని వారిని పరామర్శించి తన వంతుగా ఆర్థిక సహాయాన్ని అందజేశారు



ఈ కార్యక్రమంలో మండల నాయకులు హైదర్ భుట్టో రఘు బాబు రవి గుండారపు సతీష్ కొప్పుల సమ్మయ్య నరసింహ శ్రీను జగ్గ సమ్మయ్య గౌరయ్య లాలయ్య మహిళలు పాల్గొన్నారు

# భూభారతి దరఖాస్తుల పరిష్కారానికి పక్కా ప్రణాళిక రూపొందించాలి

**పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు వేగవంతం చేయాలి**

**పాత భూభారతి దరఖాస్తులకు నవంబర్ 15 గడువు**

**కొత్త దరఖాస్తులను 30 రోజుల్లోగా పరిష్కరించాలి**

**భూ పరిపాలన ప్రధాన కమిషనర్ లోకేశ్ కుమార్**

**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి అక్టోబర్ 22** కలెక్టరేట్‌గురువారం భూ పరిపాలన ప్రధాన కమిషనర్ లోకేశ్ కుమార్ రాష్ట్రంలోని అన్ని జిల్లాల అదనపు కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

భూముల రీ సర్వే, బృందాల ఏర్పాటు, భూభారతి పెండింగ్ దరఖాస్తులు, హైకోర్టు కేసులు, భూసేకరణ, ప్రభుత్వ ఉత్తర్వు సంఖ్య 59 కింద క్రమబద్ధీకరణ దరఖాస్తులు, భూదాన్ భూములపై సమీక్షించారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు ములుగు సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ సీహెచ్ మహేందర్ హాజరయ్యారు.





ఈ సందర్భంగా లోకేశ్ కుమార్ మాట్లాడుతూ పాత భూభారతి విధానంలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులన్నింటినీ నవంబర్ 15లోగా పరిష్కరించాలని స్పష్టం చేశారు. కొత్త భూభారతి విధానంలో అందే దరఖాస్తులను స్వీకరించిన తేదీ నుంచి 30 రోజుల్లోగా పరిష్కరించాలని ఆదేశించారు. దరఖాస్తుల పరిశీలన, పరిష్కార ప్రక్రియను క్రమం తప్పకుండా పర్యవేక్షిస్తూ నిర్ణీత గడువులను పాటించాలని సూచించారు.

రీ సర్వే పురోగతి, ఇందుకు అవసరమైన బృందాల ఏర్పాటుపై సమీక్షించారు. రీ సర్వే పనులు సక్రమంగా సాగేందుకు బృందాల ఏర్పాటుపై దృష్టి సారించాలని తెలిపారు. భూదాన్ భూములు, భూసేకరణ అంశాలు, హైకోర్టు కేసుల స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ ఉత్తర్వు సంఖ్య 59 కింద పెండింగ్‌లో ఉన్న క్రమబద్ధీకరణ దరఖాస్తులను నిబంధనల ప్రకారం పరిశీలించి పరిష్కరించాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో ఆర్డీఓ కృష్ణవేణి, డిప్యూటీ తహసీల్దార్ నితీష్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పండుగ సాయన్న ముదిరాజ్ జయంతి వేడుకలు

## ములుగు జిల్లా కేంద్రంలోని ఐడీఓసీ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం శ్రీ పండుగ సాయన్న ముదిరాజ్ జయంతి వేడుకలు



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి అక్టోబర్ 22. కలెక్టరేట్** జిల్లా వెనుకబడిన తరగతుల శాఖ అధికారి బి. రామ్మోహన గారి ఆద్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీ సంపత్ రావు ముఖ్య అతిథిగా హాజరై, శ్రీ పండుగ సాయన్న ముదిరాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ శ్రీ సంపత్ రావు మాట్లాడుతూ, శ్రీ పండుగ సాయన్న ముదిరాజ్ పేద ప్రజల సంక్షేమం కోసం, సామాజిక న్యాయం కోసం పోరాడిన గొప్ప ప్రజానాయకుడని పేర్కొన్నారు. ఆయన ధైర్యసాహసాలు, ప్రజల పట్ల అంకితభావం, సమాజానికి చేసిన సేవలు చిరస్మరణీయమని తెలిపారు. ఆయన ఆశయాలను నేటి యువత ఆదర్శంగా తీసుకొని సమాజ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో బొల్లు దేవేందర్ ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు, ఏర్ల వెంకన్న ముదిరాజ్ జిల్లా అధ్యక్షుడు, అచ్చునూరి కిషణ్ ముదిరాజ్ మేపా జిల్లా అధ్యక్షుడు, సనబోయిన అశోక్ ముదిరాజ్ సామజిక ముదిరాజ్ న్యాయవేధిక రాష్ట్ర అధ్యక్షుడు, వీరబోయిన రాజేందర్, పులుగుజ్జు వెంకన్న, భుమ నరేష్ , మరబోయిన రవీందర్, మరియు ముదిరాజ్ సంఘ నాయకులు మరియు బి.సి. సంక్షేమ శాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

# గ్రాడ్యుయేట్ ఓట్లను ఎన్రోల్మెంట్ చేస్తున్న జిల్లా ఆత్మ కమిటీ చైర్మన్ చిటమట రఘు యూత్ నాయకులు ఆర్టిఏ డైరెక్టర్



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి అక్టోబర్ 22 ఏటూరునాగారం** పంచాయతీరాజ్ మినిస్టర్ సీతక్క ఆదేశాల మేరకు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు అశోక్ సూచనల మేరకు ఏటూరు నాగారంలో డిగ్రీ పట్టభద్రులైన విద్యార్థులు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ పట్టభద్రుల ఓటు హక్కు కోసం గ్రాడ్యుయేట్ ఓట్లను ఎన్రోల్మెంట్ చేయించారు ఈ కార్యక్రమంలో రామన్నగూడెం సర్పంచ్ గద్దల నవీన్ టౌన్ యూత్ అధ్యక్షుడు బండారు లక్కీ మండల నాయకులు ముజామిల్ తదితరులు పాల్గొన్నారు

# ఇంద్రకీలాద్రి క్షేత్రానికి కొనసాగుతున్న భక్తుల రద్దీ

విజయవాడ దసరా ఉత్సవాలు ముగిసిన తర్వాతకుడా ఇంద్రకీలాద్రికి భక్తుల రద్దీ కొనసాగుతోంది. తెలంగాణ తో పాటు ఇతర ప్రాంతాల నుంచి విచ్చేసిన భవాని భక్తులు భవానిపురం ఆర్టీసీ వర్క్ షాప్ రోడ్డు ఇతర ప్రాంతాలలో తమ వాహనాలు పార్కింగ్ చేసుకుంటున్నారు. సితార సెంటర్ ప్రాంతంలోనూ వాహనాలు పార్కింగ్ చేసుకుంటూ ఈ సందర్భంలో ప్రజలు భక్తులందరూ ట్రాఫిక్ పోలీసువారికి సహకరించాలని మనవి. భవానిపురం ఆర్టీసీ వర్క్ షాప్ రోడ్డు లో వాహనాలు పార్కింగ్ చేయడంతో ట్రాఫిక్ పోలీస్ అధికారులు సిబ్బంది ఎప్పటికప్పుడు ఈ ప్రాంతంలో పర్యవేక్షణ చేస్తూ ట్రాఫిక్ క్రమబద్ధీకరిస్తున్నారు.

ట్రాఫిక్ ఏఎస్ఐ నాయక్ ట్రాఫిక్ సిబ్బంది ఆర్టీసీ వర్క్ షాప్ రోడ్డు ప్రాంతంలో విధులు నిర్వహిస్తూ ట్రాఫిక్ ను నియంత్రించారు. భవాని భక్తులందరూ ట్రాఫిక్ పోలీసు వారికి సహకరించాలని విజయవాడ నగర ప్రజలు దుర్గమ్మ వారి ఆలయానికి విచ్చేసిన భవాని భక్తుల జన సాంద్రత నేపథ్యంలో ట్రాఫిక్ వారికి పోలీసు వారికే సహకరించాలని విజ్ఞప్తి చేసారు.

# సమన్వయంతో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి.

**నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలి.**

**పర్యాటక అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి సారించాలి.**

**ఫోన్ ద్వారా అధికారులకు దిశా నిర్దేశం చేసిన రాష్ట్ర మంత్రి దనసరి అనసూయ సీతక్క.**

**ప్రతి 15 రోజులకు పనుల పురోగతిపై సమీక్ష : జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు.**

**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి అక్టోబర్ 22 కలెక్టరేట్**గురువారం నూతన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో రోడ్లు, భవనాలు, నీటిపారుదల, పర్యాటక, పంచాయతీరాజ్, మిషన్ భగీరథ, ఎన్పీడీసీఎల్, తదితర శాఖల ఉన్నతాధికారులతో జిల్లా కలెక్టర్ అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. శాఖల వారీగా చేపట్టిన పనులు, వాటి ప్రస్తుత స్థితి, పనులు పెండింగ్‌లో ఉండటానికి గల కారణాలను





ఆయన క్షుణ్ణంగా అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అభివృద్ధి పనుల పురోగతిపై ప్రతి 15 రోజులకు ఒకసారి సమీక్ష నిర్వహిస్తామని అన్నారు. అధికారులు నిర్లక్ష్యం వహించకుండా క్షేత్రస్థాయిలో పనులను పర్యవేక్షించాలని సూచించారు. పనుల అమలులో ఎదురవుతున్న సమస్యలను సంబంధిత శాఖల సమన్వయంతో పరిష్కరించి, నిర్మాణాలను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు.

నిర్మాణ పనులు చేపట్టేందుకు రాబోయే ఆరు నెలలు అనుకూలంగా ఉంటాయని,

ఈ కాలాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న అంచనాలను సిద్ధం చేసి, టెండర్ ప్రక్రియను వేగవంతం చేయాలని అన్నారు. పనుల పూర్తికి స్పష్టమైన గడువులను నిర్దేశించి, వాటికి అనుగుణంగా పురోగతి సాధించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

యంగ్ ఇండియా పాఠశాల, వైద్య కళాశాల నిర్మాణాలు, ఇతర మరమ్మతు పనుల పురోగతిని కలెక్టర్ సమీక్షించారు. పుష్కరాలకు సంబంధించిన పనులను వేగంగా చేపట్టాలని, జంపన్నవాగు అభివృద్ధికి అవసరమైన అంచనాలను సిద్ధం చేయాలని ఆదేశించారు.

రామప్ప ఐలాండ్, పర్యావరణ ఉద్యానవనం, ప్లాజా, పరిపాలనా భవనాలు, ఎకో టూరిజం విలేజ్, బటర్ఫ్లై గార్డెన్, ప్రసాద్ పథకం కింద చేపట్టిన పర్యాటక సమాచార కేంద్రం పనుల పురోగతిని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. పర్యాటక ప్రాజెక్టుల పనులను వేగవంతం చేసి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు.

సమీక్ష సమావేశం సందర్భంగా రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క ఫోన్ ద్వారా అధికారులకు దిశానిర్దేశం చేశారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, జిల్లాలో పర్యాటక అభివృద్ధి పనులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. జిల్లా కలెక్టర్ నేతృత్వంలో సంబంధిత శాఖల అధికారులు బృందంగా పనిచేసి, పెండింగ్ పనులను గుర్తించి త్వరగా పూర్తి చేయాలని అన్నారు. పర్యాటక ప్రాంతాల్లో చేపట్టే నిర్మాణ పనుల్లో నాణ్యతను కచ్చితంగా పాటించాలని స్పష్టం చేశారు. ప్రత్యేక ప్రణాళికతో పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేయడంతోపాటు, వాటికి విస్తృత ప్రచారం కల్పించాలని సూచించారు.

మేడారం జాతరను దృష్టిలో ఉంచుకొని రోడ్లు, భవనాల శాఖ పరిధిలో పెండింగ్‌లో ఉన్న రహదారి పనులను వేగవంతం చేయాలని మంత్రి ఆదేశించారు. మేడారంలో నూతన అతిథిగృహ నిర్మాణానికి సంబంధించిన పనులను త్వరగా ప్రారంభించాలని సూచించారు. మల్లూరు ఆలయం వద్ద అవసరమైన వసతుల కల్పనతోపాటు, పుష్కరాలకు సంబంధించిన పనుల కోసం అంచనాలను సిద్ధం చేసి సమర్పించాలని తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రాలు, గ్రామపంచాయతీ భవనాలు, గ్రామ సమాఖ్య భవనాల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని మంత్రి సూచించారు. వైద్య కళాశాల, సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ భవన నిర్మాణం, గిరిజన ప్రాంతాల్లో రహదారి పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.

అంచనాల తయారీ, టెండర్ల ఖరారు, పనుల ప్రారంభంలో ఎలాంటి జాప్యం జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. సంబంధిత సాంకేతిక అధికారులు పనులను క్రమం తప్పకుండా పరిశీలించి, పురోగతి వివరాలను తెలియజేయాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, జిల్లా అధికారులు అప్పలనాయుడు, ధర్మానాయక్, భిక్షపతి, శ్యాంసింగ్, సునీత, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పాలపిట్టను బంధించిన సర్పంచ్‌కు అటవీశాఖ నోటీసులు



**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి అక్టోబర్ 22 (ప్రజాబలం )సంగారెడ్డి జిల్లా**:(హెచ్ ఎం టీవీ) కథనానికి అదిరిపోయే రెస్పాన్స్, తక్షణమే రంగంలోకి దిగిన అటవీ శాఖ అధికారులు! అందోల్ మండలం నేరేడిగుంట,సర్పంచ్ ఒగ్గుసాయి కిరణ్,అక్రమాలపై అటవీ శాఖ సీరియస్!రాష్ట్ర పక్షి 'పాలపిట్ట'ను పంజరంలో బంధించి.. వైల్డ్‌లైఫ్ యాక్ట్‌ను ఉల్లంఘించిన సర్పంచ్!టి,వి,లో ప్రసారమైనదృశ్యాల ఆధారంగా, స్వయంగా విచారణ జరిపిన ఫారెస్ట్ ఆఫీసర్స్!ఆందోల్ డిప్యూటీ రేంజ్ అధికారి మాధవిలత,ఆధ్వర్యంలో నేరేడిగుంటలో ఆకస్మిక తనిఖీలు!చట్టాన్ని ఉల్లంఘించిన సర్పంచ్ సాయి కిరణ్ కు నోటీసులు జారీ చేసిన అధికారులు!సర్పంచ్ అందుబాటులో లేకపోవడంతో, అతని తల్లికి నోటీసులు అందజేసిన ఫారెస్ట్ సిబ్బంది!సర్పంచ్ సాయి కిరణ్‌పై త్వరలోనే వన్యప్రాణి సంరక్షణ చట్టం ( వైల్డ్ లైఫ్ ప్రొటెక్షన్) కింద కేసు నమోదు, సంప్రదాయాల పేరుతో మూగజీవాలను, వన్యప్రాణులను హింసిస్తే కఠిన చర్యలు తప్పవని ఫారెస్ట్ అధికారుల తీవ్ర హెచ్చరిక!

## పేదల పక్షాన నిలిచిన ప్రజా నాయకుడు పండుగ సాయన్న కలెక్టర్ చిత్రా మిశ్రా

కరీంనగర్ నిజాం కాలంలో పెత్తందార్ల అన్యాయాలకు, దొరల దోపిడీకి వ్యతిరేకంగా పోరాడి ఎంతో మంది పేదలకు అండగా నిలిచిన నిలిచిన మహనీయుడు పండుగ సాయన్న అని కలెక్టర్ చిత్రా మిశ్రా పేర్కొన్నారు. గురువారం నూతన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం ఐడీఓసీ లో పండుగ సాయన్న జయంతి కార్యక్రమాన్ని బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్, డీఆర్వో స్వామి, బీసీ సంక్షేమ శాఖ అధికారి అనిల్ ప్రకాష్, ఇతర అధికారులు, ముదిరాజ్ సంఘం నాయకులు సాయన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా కలెక్టర్మాట్లాడుతూ. సొంతంగా సైన్యం ఏర్పాటు చేసుకొని దోపిడీ చేస్తున్న దొరలకు వ్యతిరేకంగా పోరాటం చేశారన్నారు. సమాజంలోని అణగారిన వర్గాలకు అండగా నిలిచారని పేర్కొన్నారు.

## పదవరోజు ఎన్ హెచ్ ఎం ఉద్యోగుల నిరవధిక సమ్మె




**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి అక్టోబర్ 22 ములుగు** రాష్ట్రవ్యాప్తంగా జాతీయ ఆరోగ్య మిషన్ లో పనిచేస్తున్న ఉద్యోగులందరూ ఈనెల 13 నుంచి 31 వరకు సమ్మె సైరన్ మోగించారు 10వ రోజు డాక్టర్ నరహరి ఆధ్వర్యంలో సమ్మెను ప్రారంభించారు రాష్ట్రమంతటా ఎన్ హెచ్ ఎం ఉద్యోగులు ప్రధాన కూడలి వద్ద టెంట్లు ఏర్పాటు చేసుకుని వారి సమస్యల పరిష్కారానికై సమ్మెను ఏర్పాటు చేశారు 13 నుంచి ఇప్పటికి పది రోజుల నుంచి నిరవాదిక సమ్మె చేస్తూ తమ సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తున్నారు ప్రభుత్వం వెంటనే మా సమస్యలను పరిష్కరించాలని ఎన్ హెచ్ ఎం లో పనిచేస్తున్న ఉద్యోగులందరికీ పర్మినెంట్ చేయాలని అలాగే పెరిగిన జీతాలు వెంటనే విడుదల చేయాలని హెల్త్ కార్డులను ఏర్పాటు చేసి వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు మహిళలకు 18 రోజుల వేతనంతో పాటు ప్రసూతి సెలవులు ఏర్పాటు చేయాలని వారు ప్రభుత్వానికి డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో ప్రాథమిక వైద్యులు ఆయుష్ వైద్యులు ఏరియా వైద్యులు జిల్లా వైద్యులు స్టాఫ్ నర్సులు అన్ని కేటగిరీల ఉద్యోగులు సమ్మెలో పాల్గొన్నారు

# కన్నాయిగూడెంలో ఏరులై పారుతున్న గుడుంబా ఎర్రమందు

### పట్టించుకోని ఎక్సైజ్ అధికారులు

### తనిఖీలు చేయని పోలీసులు

**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి అక్టోబర్ 22 కన్నాయిగూడెం** ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం ఏటూరు సింగారం ముప్పనపల్లి చింతగూడెం బుట్టాయిగూడెం తుపాకులగూడెం దేవదుల లక్ష్మీపూర్ గ్రామాలలో విచ్చలవిడిగా పెరిగిపోయిన బెల్ట్ షాపు రోడ్డుకిరువైపులా చిన్న దుకాణం నుంచి మొదలుకొని పెద్ద దుకాణాల వరకు ఎర్రమందుతో సహా నల్లమందు విక్రయాలు యధావిధిగా మూడు పువ్వులు ఆరు కాయలుగా వ్యాపారం సాఫీగా జరుగుతుంది




ఎక్సైజ్ అధికారులు మాకు ఏ లాంటి సంబంధం లేనట్టుగా పాఠశాలల ముందు దేవాలయాల ముందు మద్యం విచ్చలవిడిగా



అమ్ముతున్న పట్టించుకోకపోవడం వైన్స్ వ్యాపారులతో కుమ్మక్కై లక్షల రూపాయలు నెలకు వసూలు చేస్తున్నట్లు సమాచారం ఇదేవిధంగా పోలీస్ అధికారులు సైతం ఇలాంటి దానిపై స్పందించకపోవడం అనుమానాలకు తావిస్తున్నాయి ముఖ్యంగా పోలీస్ అధికారులు ప్రజల భద్రత కోసం ప్రజల ప్రాణాలు కాపాడే బాధ్యతతో ఉండి కూడా ప్రజల ప్రాణాలు తీస్తున్న గుడుంబా గంజాయి ఎర్రమందు వీటిపై పోలీసులు పట్టించుకోకపోవడంపై గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు ఇప్పటికైనా పోలీస్ అధికారులు కన్నాయిగూడెం మండలం గ్రామాలలో విచ్చలవిడిగా రోడ్డుకిరువైపులా నడిపిస్తున్న బెల్టు షాపులను తీసివేసి వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు తెలిపారు దసరా నుంచి పెద్ద ఎత్తున మధ్యమ అమ్మకాలు ఎర్రమందు నల్లమందు త్రాగడంతో రాజన్నపేటకు చెందిన వృద్ధుడు మృతి చెందినట్లు తెలుస్తుంది దీనిపై చర్యలు తీసుకోకపోతే మరేంతో మంది ప్రాణాలు పోయే ప్రమాదం ఉందని అన్నారు

# కొత్తపల్లి మండలంలో ఎంపీటీసీ నామినేషన్లు..

## 10 మంది అభ్యర్థుల వివరాలు వెల్లడి

కొత్తపల్లి: నంద్యాల జిల్లా కొత్తపల్లి మండలంలో ఎంపీటీసీ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల ప్రక్రియలో భాగంగా వివిధ గ్రామాల నుంచి అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. అభ్యర్థులు సమర్పించిన నామినేషన్ పత్రాల్లో పేర్కొన్న వివరాల ప్రకారం టీడీపీ, వైఎస్సార్‌సీపీ, బీజేపీ పార్టీలతో పాటు స్వతంత్ర అభ్యర్థులు పోటీలో నిలిచారు.గ్రామాల వారీగా అభ్యర్థుల వివరాలు ఇలా ఉన్నాయి:దుద్యాల-2 ఎంపీటీసీ: టీడీపీ తరఫున ఈరగాళ్ల రాజు నామినేషన్ దాఖలు చేయగా, వైఎస్సార్‌సీపీ తరఫున రాజమూరి పుల్లయ్య, బంగి చిన్న లింగమ్మ నామినేషన్లు సమర్పించారు.ఎర్రమఠం ఎంపీటీసీ: వైఎస్సార్‌సీపీ తరఫున పెరుగు నాగలక్ష్మి రెడ్డి నామినేషన్ దాఖలు చేశారు.నందికుంట ఎంపీటీసీ: వైఎస్సార్‌సీపీ తరఫున యర్రం నాగభారతి, స్వతంత్ర అభ్యర్థిగా మేడం పార్వతమ్మ నామినేషన్లు దాఖలు చేశారు.గోకవరం ఎంపీటీసీ: బీజేపీ తరఫున బోయ వేణుగోపాల్ నామినేషన్ సమర్పించారు.శివపురం ఎంపీటీసీ: వైఎస్సార్‌సీపీ తరఫున షేక్ మహమ్మద్ గౌస్ నామినేషన్ దాఖలు చేయగా, స్వతంత్ర అభ్యర్థులుగా షేక్ మహమ్మద్ షా, షేక్ మహబూబ్ బాషా నామినేషన్లు సమర్పించారు.ఎన్నికలపై ఆసక్తికొత్తపల్లి మండలంలోని పలు ఎంపీటీసీ స్థానాల్లో వివిధ పార్టీల అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయడంతో స్థానికంగా ఎన్నికల సందడి నెలకొంది. ఆయా గ్రామాల్లో అభ్యర్థుల మధ్య పోటీ ఎలా ఉండబోతోందన్న అంశంపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.గమనిక: అందించిన జాబితాలో మొత్తం 10 మంది అభ్యర్థుల పేర్లు ఉన్నాయి. నామినేషన్ల పరిశీలన, ఉపసంహరణ అనంతరం తుది పోటీదారుల వివరాలు స్పష్టమవుతాయి.

# తొలిరోజు నాలుగు ఎంపిటిసి సభ్యుల నామినేషన్లు

సి. బెళగల్ మండల కేంద్రంలో స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో, ఆర్వో నాగిని అధ్యక్షతన, అసిస్టెంట్ ఆర్ఓలు , తాసిల్దార్ వెంకటలక్ష్మి, ఎంపీడీవో రాణెమ్మ ఆధ్వర్యంలో,ఎంపిటిసి సభ్యుల ఎన్నికలకు తొలి రోజు నాలుగు నామినేషన్లు వేశారు. వివరాల్లోకి వెళితే మండల కేంద్రంలోని ఇనగండ్ల గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ ఎంపిటిసి సభ్యులుగా బలపరిచిన అడ్డాకుల కేజియ నామినేషన్ వేయగా, ఇద్దరు సభ్యులు బలపరిచారు, అదేవిధంగా అడ్డాకుల కీర్తి ఎంపిటిసికి పదవికి నామినేషన్ వేయగా ఇద్దరు సభ్యులు బలపరిచారు. వైఎస్ఆర్సిపి బలపరిచిన అభ్యర్థిగా సంధ్యపోగు నాగేశ్వరమ్మ నామినేషన్ వేయగా, ఇద్దరు సభ్యులు బలపరిచారు. అదేపటికి చెందిన సంధ్యపోగు మరియమ్మ నామినేషన్ వేయగా ఇద్దరు సభ్యులు బలపరిచారు. తొలి రోజు కేవలం యంగండ్ల గ్రామానికి చెందిన వారు మాత్రమే నామినేషన్ వేయడం విశేషం.




Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com